శుక్రవారం 8-12-2023

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 83

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'



**భారత్‌కు స్పెయిన్ షాక్**

జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీలో 1–4 తేడాతో ఓటమి - 13లో



**భారీ ప్రకటనలేమీ ఉండవు**

ఫిబ్రవరి బడ్జెట్‌పై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ - 13లో



**అది ప్రమాదకరమైన జబ్బు**

సహజీవనం ప్రమాదకర జబ్బు అని.. దీనిని సమాజం నుంచి నిర్మూలించాలని బీజేపీ ఎంపీ ధరంబీర్‌సింగ్ వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ►



**సుపరిపాలనకు మారుపేరు**

సుపరిపాలనకు బీజేపీ మారుపేరు అని.. అధికారాన్ని నిలబెట్టుకోవడంలో తమ రికార్డు మెరుగ్గా ఉందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ►



**హత్యా? ఆత్మహత్యా?**

చైనా విదేశాంగ మంత్రిగా సేవలందించి.. ఆ తర్వాత అదృశ్యమైన క్విన్ గాంగ్ ప్రస్తుతం జీవించి లేరంటూ వార్తలొచ్చాయి.

వివరాలు 6లో ►



**కొప్పర్తిలో మరో టెక్నాలజీ పార్కు**

వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో రూ. 250 కోట్లతో మరో టెక్నాలజీ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

వివరాలు 14లో ►

**ఫ్యాక్ట్‌చెక్**

## తెలియక కాదు.. అతితెలివి!!

- పంటల బీమాపై రహస్యాలంటూ రామోజీ పనికిమాలిన రాతలు
- రైతుల వివరాలన్నిటినీ నెల కిందటే కేంద్రానికి పంపిన రాష్ట్రం
- రికార్డుల డిజిటలైజేషన్ సైతం పూర్తి చేసిన కేంద్రం
- ప్రీమియం ఖరారు చేసి చెల్లించేందుకు ఏప్రిల్ దాకా సమయం
- వచ్చే సీజన్ మొదలయ్యేలోగా (జూన్) బీమా పరిహారం చెల్లింపు

10లో

## సాధారణ స్థితికి విద్యుత్ సరఫరా

- భారీగా నష్టం.. అయినా సకాలంలో విద్యుత్.. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 98% పునరుద్ధరణ పనులు పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా నిరంతర విద్యుత్

3లో



# జాబ్స్ పిలుపు..

## 897 పోస్టులతో గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేసిన ఏపీపీఎస్సీ

**331** ఎగ్జిక్యూటివ్ పోస్టులు

**566** నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

- 21 నుంచి జనవరి 10 వరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్స్
- ఫిబ్రవరి 25న ఆఫ్‌లైన్‌లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ
- మే నాటికి ప్రక్రియ పూర్తి
- త్వరలోనే గ్రూప్–1తో పాటు పలు నోటిఫికేషన్లు

- వివరాలు 3లో



### త్వరలో గ్రూప్-1 నోటిఫికేషన్

ఏపీపీఎస్సీ త్వరలోనే వంద గ్రూప్-1 పోస్టులతో పాటు డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ లెక్చరర్స్‌తో మొత్తం 23 నోటిఫికేషన్లు విడుదల చేయనుంది. గతేడాది ఎలాంటి వివాదాలకు తావులేకుండా గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చి 11 నెలల కాలంలోనే పారదర్శకంగా మెయిన్స్ ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారు. ఏఈ నియామకాలను కూడా అతి తక్కువ సమయంలోనే పూర్తి చేశారు. పలు న్యాయపరమైన వివాదాలను అధిగమించి గత నాలుగేళ్లలో సంస్కరణలు తెచ్చిన కమిషన్ తాజాగా గ్రూప్-2 పోస్టుల భర్తీని సైతం పూర్తి పారదర్శకంగా, ఆరు నెలల వ్యవధిలో ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపట్టింది.

విజయవాడ ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం వైఎస్ జగన్



# కొండకు కొత్త శోభ

ఇంద్రకీలాద్రిపై రూ.216.05 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన.. మరో రూ.23.145 కోట్లతో పూర్తి చేసిన పనులు ప్రారంభం

అమ్మవారిని దర్శించుకున్న సీఎం.. శ్రీకనకదుర్గా వైభవం పుస్తకం ఆవిష్కరణ

2లో

**తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నేడు సీఎం జగన్ పర్యటన**

తిరుపతి, బాపట్ల జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన.. బాధితులు, రైతులతో మాట్లాడనున్న సీఎం జగన్

3లో

శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో నిర్వహించిన సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



# మడకశిరలో బడుగుల భారీ కవాతు

**సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు జన సునామీ**

- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- జై జగన్ నినాదాలతో ప్రతిధ్వనించిన సభా ప్రాంగణం
- ప్రజల్లో ఉత్సాహం నింపిన నాయకుల ప్రసంగాలు

2లో

**ఇంకా ఉంది**



మీరు కనిపిస్తే చాలు పారిపోతున్నార్సార్! అప్పు అడుగుతారనుకుంటున్నట్లున్నారు!!

తెలంగాణలో కొలువు తీరిన

# కొత్త సర్కారు

## ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

- మరో 11 మంది మంత్రులతోనూ ప్రమాణం చేయించిన గవర్నర్ తమిళిసై
- డిప్యూటీ సీఎంగా భట్టి
- మంత్రులుగా ఉత్తమ్, దామోదర, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి

10లో



అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించకపోవడం వంటి కారణాలతో దేశంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా యువత బలైపోతోందని కేంద్రం తాజాగా విడుదల చేసిన నివేదిక పేర్కొంది. గతేడాది (2022) దేశంలో మొత్తం రహదారి ప్రమాదాల్లో 18 నుంచి 45 ఏళ్ల వయసు గలవారు 66.5 శాతం మంది ప్రాణాలు కోల్పోయినట్లు బాంబుపేల్చింది.



అతివేగం..

# తప్పదు భారీ మూల్యం!

- గతేడాది దేశంలో అతివేగంగా వాహనాలు నడపడంతో 1.19 లక్షల మంది బలి
- మద్యం సేవించి డ్రైవింగ్ చేయడంతో 4,201 మంది మృతి
- మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడంతో 3,395 మంది..
- హెల్మెట్ ధరించకపోవడంతో 35,692 మంది మృత్యువాత
- సీటు బెల్ట్ పెట్టుకోకపోవడంతో అసువులు బాసిన 8,384 మంది
- 2022లో రోడ్డు ప్రమాదాల మృతుల్లో అత్యధికులు యువత
- కేంద్రం తాజా నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: గతేడాది దేశంలో మొత్తం రోడ్డు ప్రమాదాల్లో అతివేగం కారణంగా 72.3 శాతం రోడ్డు ప్రమాదాలు జరిగాయని తెలిపింది. ఇందులో 71.2 శాతం మంది మృతి చెందగా 72.8 శాతం మంది గాయాల పాలైనట్లు నివేదిక వెల్లడించింది. అతివేగం కారణంగా గతేడాది ఏకంగా 1,19,904 మంది మృత్యువాత పడ్డారని వివరించింది. మరో 3,22,795 మంది గాయాలపాలయ్యారని ఆందోళన వ్యక్తం చేసింది. ఇక మద్యం సేవించి వాహనాలు నడపడంతో దేశంలో గతేడాది 4,201 మంది అసువులు బాశారు. ఇక మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో 3,395 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపటంతో గతేడాది 35,692 మంది మరణించారు. మరో 14,337 మంది ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. సీటు బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయడంతో 8,384 మంది వాహన చోదకులు మృతి చెందారు. మరో 8,331 మంది ప్రయాణికులు కూడా మరణించారు.

**దేశంలో 2022లో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందినవారి వయసు..**

| వయసు | మరణాలు |
|---|---|
| 18 ఏళ్లలోపు | 9,528 |
| 18 నుంచి 25 ఏళ్లలోపు | 33,350 |
| 25 నుంచి 35 ఏళ్లలోపు | 42,671 |
| 35 నుంచి 45 ఏళ్లలోపు | 36,051 |
| 45 నుంచి 60 ఏళ్లలోపు | 28,407 |
| 60 ఏళ్ల పైన | 13,636 |

**దేశంలో 2022లో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలతో జరిగిన రోడ్డు ప్రమాదాలు..**

| కేటగిరీ | ప్రమాదాలు | మరణాలు | గాయాలు |
|---|---|---|---|
| అతివేగం | 3,33,323 | 1,19,904 | 3,22,795 |
| మద్యం, డ్రగ్స్ | 10,080 | 4,201 | 8,809 |
| తప్పుదారిలో డ్రైవింగ్ | 22,586 | 9,094 | 21,745 |
| రెడ్ సిగ్నల్ జంపింగ్ | 4,021 | 1,462 | 3,450 |
| ఫోన్ మాట్లాడుతూ | 7,558 | 3,395 | 6,255 |
| ఇతర కారణాలు | 83,744 | 30,435 | 80,312 |
| మొత్తం | 4,61,312 | 1,68,491 | 4,43,366 |

**దేశంలో 2022లో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడంతో ప్రమాదాలు..**

| హెల్మెట్ ధరించక.. | మరణాలు | గాయాలు |
|---|---|---|
| వాహన చోదకులు | 35,692 | 63,584 |
| ప్రయాణికులు | 14,337 | 38,307 |
| మొత్తం | 50,029 | 1,01,891 |
| **సీటు బెల్ట్ పెట్టుకోక..** | **మరణాలు** | **గాయాలు** |
| వాహన చోదకులు | 8,384 | 17,216 |
| ప్రయాణికులు | 8,331 | 25,087 |
| మొత్తం | 16,715 | 42,303 |

# చంద్రబాబు కూల్చిన ఆలయాలు..








# బాబు కూల్చారు.. జగన్ పునర్నిర్మించారు

**8 ఆలయాలను పునః నిర్మించి ప్రారంభించిన ముఖ్యమంత్రి**

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): కృష్ణా పుష్కరాల పేరిట 2016లో విజయవాడలో టీడీపీ సర్కారు కూల్చి వేసిన 8 ఆలయాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పునర్ నిర్మించి ప్రారంభించింది. నాడు పుష్కరాల సమయంలో చంద్రబాబు సర్కారు కృష్ణా పరివాహక ప్రాంతంతో పాటు అమ్మవారి ఆలయ ప్రాంగణం, అమ్మవారి ఆలయానికి చేరుకునే మార్గంలోని మొత్తం 13 ఆలయాలను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేసింది. చంద్రబాబు సర్కారు కూల్చి వేసిన ఆలయాలను పునర్ నిర్మిస్తామని హామీ ఇచ్చిన సీఎం జగన్ ఎనిమిది ఆలయాలకు 2021 జనవరి 8వ తేదీన శంకుస్థాపన చేశారు. దక్షిణాముఖ ఆంజనేయస్వామి ఆలయం, సీతమ్మవారి పాదాలు, శ్రీసీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయస్వామి ఆలయం, వీరబాబు ఆలయం, విజయవాడ గో సంరక్షణ సంఘం కృష్ణ మందిరం, బొడ్డు బొమ్మ, ఆంజనేయస్వామి ఆలయం వినాయకస్వామి ఆలయం తొలి మెట్టు, శ్రీశనైశ్వర స్వామి వారి ఆలయాల పునర్ నిర్మాణాన్ని రూ.3.87 కోట్లతో చేపట్టి పూర్తి చేశారు. తాజాగా వీటిని ప్రారంభించారు. మిగిలిన ఐదు ఆలయాలలో ప్రధానమైన మౌన స్వామి వారి విగ్రహాన్ని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి ప్రాంగణంలో తిరిగి ఏర్పాటు చేయగా పాత మెట్ల మార్గంలోని ఆంజనేయ స్వామి వారి ఆలయం, మల్లేశ్వర స్వామి వారి మెట్ల మార్గంలోని వీరాంజనేయ స్వామి ఆలయాల్లో విగ్రహాలను బ్రాహ్మణ వీధిలోని వాటర్ ట్యాంక్ వద్ద ఆలయాల్లో ఉంచి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# సీఎం జగన్ పునర్నిర్మించిన ఆలయాలు..







# ఇవిగో నవరత్నాల వెలుగులు

**ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.**

## మాకూ ఓ గూడు దొరికింది



రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు మావి. నేను, మా ఆయన రోజూ కూలిపనికెళ్తేనే పూట గడిచేది. రోజూ పనులు ఉండేవి కాదు. అప్పుడప్పుడు దొరికే పనులతోనే కాలం వెళ్లదీసేవాళ్లం. ఇంటి అద్దె చెల్లించాలన్నా నానా అగచాట్లు పడేవాళ్లం. ఒక్కోసారి ఇంటి యజమాని చేత మాటలు పడాల్సి వచ్చేది. ఈ పరిస్థితిలో సొంత ఇల్లు అనే ఆలోచన కలలో కూడా ఊహించలేకపోయేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చాక పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తారని, దానికోసం దరఖాస్తు చేసుకోవాలని మా వలంటీర్ చెప్పారు. అన్నీ దగ్గరుండి చేయించాడు. ఏ నాయకుని వద్దకు వెళ్లకుండానే మాకు వైఎస్సార్ జగనన్న లే అవుట్‌లో లక్షలాది రూపాయల విలువైన స్థలం ఉచితంగా ఇచ్చారు. ఇంటి కోసం లక్షా 80 వేల రూపాయలు మంజూరు చేశారు. రాయితీపై నిర్మాణ సామగ్రిని సమకూర్చారు. ప్రభుత్వం సాయంతో సొంతిల్లు కట్టుకున్నాం. మా ఆయనకు వృద్ధాప్య పింఛన్, నాకు అభయహస్తం పింఛన్ వస్తోంది. ఇన్నాళ్లకు సొంతింటిలో ఉండడం చాలా ఆనందంగా ఉంది.

– బోడసింగి సీత, బోడసింగిపేట, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా
(ఆదాడ గోవిందరావు, విలేకరి, బొండపల్లి)

## రైతు కష్టాలు తెలిసిన ప్రభుత్వమిది



చిన్న, సన్నకారు రైతులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంది. గతంలో ఏనాడు పెట్టుబడి సాయం రాలేదు. పంట నష్టపరిహారం ఆలస్యంగా అందేది. పావలా వడ్డీ పేరుకే ఉండేది. వాటిని తీసుకోవడానికి పైరవీలు చేయాల్సి వచ్చేది. నేడు రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులను ఆదుకుంటున్నారు. పంట నష్టపోతే బీమా సకాలంలో అందిస్తున్నారు. ఏళ్ల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. నాలుగేళ్లుగా విడతల వారీగా ఏడాదికి రూ.13,500 చొప్పున ఇప్పటి వరకూ రూ.40 వేలకుపైగా అందుకున్నా. ఎరువులు, పురుగు మందుల కొరత లేకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో అందేవిధంగా సర్కారు చేసిన ఏర్పాటు రైతుల మన్ననలు అందుకుంటోంది. రైతుగా ఆన్‌లైన్‌లో నమోదై ఉంటే చాలు సాయం దానంతట అదే వస్తోంది. విడతల వారీగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తుండడంతో సాగుకు పెట్టుబడిగా వినియోగించుకుంటున్నా. పడుతుందో లేదోననే భయం లేదు. ఇచ్చిన మాట ప్రకారం జమ చేస్తారన్న నమ్మకం ఏర్పడింది. దీంతో పెట్టుబడి అవసరమైనపుడు నేరుగా బ్యాంకుకు వెళ్లి విత్ డ్రా చేసుకుంటున్నాం. నాది పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం కొడమంచిలి గ్రామం. రైతు కష్టాలు తెలిసిన ప్రభుత్వం ఇది.

– జక్కంశెట్టి సూర్యనారాయణ, కొడమంచిలి
(గుర్రాల శ్రీనివాసరావు, విలేకరి, ఆచంట)

## నాకు ఉద్యోగం వచ్చింది..



నేను ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో అమలాపురం మండలం భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో గత సంవత్సరం ఇంజినీరింగ్ పూర్తి చేశాను. మాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కేశనకుర్రు గ్రామం. మా నాన్న మా ఊళ్లోనే మెడికల్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అమ్మ గృహిణి. చెల్లి, తమ్ముడు కూడా ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోనే ఇంజనీరింగ్ చదువుతున్నారు. మా నాన్నకు పైసా ఖర్చు లేకుండా చదివించే అవకాశం కలిగింది. మా ముగ్గుర్ని సొంత డబ్బులతో రూ.వేలల్లో ఫీజులు పోసి చదివించాలంటే మా నాన్నకు సాధ్యమయ్యే పని కాదు. ఈ ప్రభుత్వం వల్లే మమ్మల్ని పెద్ద చదువులు చదివించగలుగుతున్నారు. నా చదువు పూర్తయ్యాక కళాశాల క్యాంపస్ ఇంటర్వ్యూలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించాను. నేను ఇప్పుడు రూ.4.50 లక్షల ప్యాకేజీతో బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నానంటే అది ఈ ప్రభుత్వం పుణ్యమే. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఈ ప్రభుత్వాన్ని యువత ప్రశంసిస్తోంది.

– పెమ్మిరెడ్డి శ్రీ తులసీ చంద్ర లిఖిత, కేశనకుర్రు
(పరస సుబ్బారావు, విలేకరి, ఐ.పోలవరం)

# కొండకు కొత్త శోభ

**ఇంద్రకీలాద్రిపై రూ.216.05 కోట్లతో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన**





పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్, దుర్గగుడి నమూనాను పరిశీలిస్తున్న సీఎం జగన్, వేద విద్యార్థిని ఆప్యాయంగా పలకరిస్తున్న ముఖ్యమంత్రి జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఇంద్రకీలాద్రిపై పలు అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారంశంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. విజయవాడ కనకదుర్గానగర్ గోశాల వద్ద రూ.216.05 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మరో రూ.23.145 కోట్లతో పూర్తి చేసిన పనులను ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పనులకు సీఎం జగన్ తొలుత శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. అమ్మవారి విశేషాలతో దుర్గామల్లేశ్వర దేవస్థానం ప్రచురించిన 'శ్రీకనకదుర్గా వైభవం – ఉపాసనా విధానం' పరిశోధనాత్మక గ్రంథాన్ని ఆవిష్కరించారు. వేద పాఠశాల విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం ఇంద్రకీలాద్రిపైకి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ వివరాలను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ ముఖ్యమంత్రికి తెలియచేశారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా గోశాల శంకుస్థాపన ప్రాంతం వరకు వివిధ కళాబృందాలు తమ ప్రదర్శనలతో ఘన స్వాగతం పలికాయి. కేరళ సంప్రదాయ డ్రమ్స్ బృందం, తెలంగాణ కొత్తగూడెం గిరిజనుల కొమ్ము కోయ నృత్యం, భద్రాచలం ఒగ్గుడోలు, గిరిజన గుస్సాడి (నెమలి నృత్యం) కోలాటం, కూచిపూడి నృత్య బృందాల ప్రదర్శనలు అలరించాయి.

### ప్రారంభించిన పనులు ఇవీ..

- రూ.5.60 కోట్లతో పునః నిర్మించిన మల్లేశ్వర స్వామి వారి ఆలయం
- రూ.4.25 కోట్లతో పూర్తైన ఇంద్రకీలాద్రి కొండ రక్షణ పనులు
- రూ.3.25 కోట్లతో ఎల్‌టీ ప్యానల్ బోర్డులు, ఎనర్జీ, వాటర్ మేనేజ్‌మెంట్, స్కాడా పనులు
- 2016 పుష్కరాల సమయంలో గత సర్కారు కూల్చిన ఎనిమిది ఆలయాలను రూ 3.87 కోట్లతో పునః నిర్మించి ప్రారంభించిన సీఎం జగన్.
- పాతపాడు గ్రామంలో దేవస్థానం స్థలంలో రూ.5.66 కోట్లతో 1 మెగావాట్ సోలార్ విద్యుత్ కేంద్రం
- కొండ దిగువన రూ.23 లక్షలతో నిర్మించిన బొడ్డు బొమ్మ, రూ.28 లక్షలతో అమ్మవారి పాత మెట్ల మార్గంలో నిర్మించిన ఆంజనేయ స్వామి, వినాయక ఆలయాలను ప్రారంభించిన సీఎం జగన్.

### శంకుస్థాపనలు

- దుర్గగుడిలో రూ.30 కోట్లతో అన్నప్రసాద భవనం
- రూ.27 కోట్లతో ప్రసాదం పోటు భవన నిర్మాణాలు
- రూ.13 కోట్లతో ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్
- రూ.15 కోట్లతో రాజగోపురం ముందుభాగం వద్ద మెట్ల నిర్మాణం
- రూ.23.50 కోట్లతో దక్షిణాన అదనపు క్యూ కాంప్లెక్స్
- రూ.7.75 కోట్లతో కనకదుర్గ ప్రవేశ మార్గం వద్ద మహారాజద్వార నిర్మాణం
- రూ.7 కోట్లతో కొండపైన పూజా మండపం
- రూ.18.30 కోట్లతో మల్లిఖార్జున మహా మండపం క్యూకాంప్లెక్స్‌గా మార్పు
- రూ.19 కోట్లతో నూతన కేశ ఖండనశాల
- కొండ దిగువన ఉన్న గోశాల భవనం రూ.10 కోట్లతో బహుళ ప్రయోజన సౌకర్య సముదాయంగా మార్పు
- దాతల సహకారంతో రూ.5 కోట్లతో కొండపైన గ్రానైట్ రాతి యాగశాల నిర్మాణం
- దేవస్థానం–ప్రైవేట్ భాగస్వామ్యంతో రూ.33 కోట్లతో కనక దుర్గానగర్ వద్ద మల్టీ లెవల్ కారు పార్కింగ్ నిర్మాణం పనులు.

### పూర్ణకుంభంతో స్వాగతం

కనక దుర్గమ్మను దర్శించుకున్న ముఖ్యమంత్రి జగన్‌కు పెద రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి అంతరాలయంలో ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ముఖ్యమంత్రికి తీర్థ ప్రసాదాలు, అమ్మవారి చిత్ర పటాన్ని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దుర్గగుడి చైర్మెన్ కర్నాటి రాంబాబు, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఈవో కెఎస్.రామారావు, వేద పండితులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత, శాసన మండలి సభ్యులు తలశిల రఘురామ్, రుహుల్లా, అరుణ్‌కుమార్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, దేవస్థానం కమిటీ సభ్యులు, దేవదాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలన్, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె రాణా, డీసీపీ విశాల్ గున్ని, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్ , ఆలయ ఈవో కె.ఎస్ రామారావు, ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్.డి ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మడకశిరలో బడుగుల భారీ కవాతు

- సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు జన సునామీ
- వేలాదిగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు
- ప్రతిధ్వనించిన జై జగన్ నినాదాలు
- ఉత్సాహం నింపిన నేతల ప్రసంగాలు



మడకశిర సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన అశేష జనవాహినిలో ఓ భాగం



ఐక్యత చాటుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు

సాక్షి, పుట్టపర్తి: మడకశిర జన సాగరమైంది. బడుగులు భారీ కవాతు చేయగా.. తమకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకు జన సునామీ తరలివచ్చింది. గుండెల నిండా అభిమానం నింపుకుని 'జై జగన్' నినాదాలతో హోరెత్తించింది. నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జరిగిన మేలును వివరించేందుకు వైఎస్సార్‌సీపీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర గురువారం శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో కొనసాగింది. వైఎస్సార్‌సీపీ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచన మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ అధ్యక్షతన స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్రలో జనం పోటెత్తారు. అంతకు ముందు సరస్వతి విద్యామందిరం ఉన్నత పాఠశాల నుంచి నిర్వహించిన ర్యాలీలోనూ అభిమానులు, కార్యకర్తలు సందడి చేశారు. సభలోనూ బడుగు, బలహీన వర్గాల సామాజిక సాధికారత వెల్లివిరిసింది. సామాజిక సాధికార బస్సు యాత్రలో వేలాదిగా పాల్గొని వైఎస్ జగన్ అండతో తాము ఎంత ఉన్నతంగా బతుకుతున్నదీ వెల్లడించారు. చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేయగా.. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్నివిధాలా పెద్దపీట వేసి రాజ్యాధికారం కల్పించిన వైనాన్ని పలువురు నేతలు వెల్లడించగా.. సభికుల నుంచి పెద్దఎత్తున హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. బడుగులకు సాధికారత కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోమారు అధికారం కట్టబెడదామని మంత్రులు, నేతలు పిలుపునివ్వడంతో ప్రజలు ఈలలు, కేకలతో మద్దతు ప్రకటించారు.

### జగన్‌తోనే సామాజిక సాధికారత: మంత్రి జయరామ్

సీఎం జగన్‌తోనే సామాజిక సాధికారత సాధ్యం అవుతోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మనూరు జయరామ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జగన్ అపారమైన ప్రేమ చూపుతున్నారన్నారు. నాలుగున్నరేళ్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.2.50 లక్షల కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు వివరించారు. సంక్షేమ పాలన నిరంతరం అందాలంటే 30 ఏళ్లపాటు జగనన్నను సీఎంగా కొనసాగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### జగన్ వచ్చాకే దళితులకు గౌరవం: ఎంపీ నందిగం

జగన్ సీఎం అయ్యాక మంత్రివర్గంలో ఐదుగురికి చోటు కల్పించారని ఎంపీ నందిగం సురేష్ అన్నారు. అందులో ఒకరికి డిప్యూటీ సీఎంతో పాటు మరో మహిళకు హోంశాఖను కట్టబెట్టి గౌరవించారన్నారు.

### వైఎస్ కుటుంబం మేలు మరువలేం: ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర నియోజకవర్గానికి వైఎస్ కుటుంబం చేసిన మేలు మరువలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. జగన్ సీఎం కాగానే.. ఏటా మడకశిరకు కృష్ణా జలాలు అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. నేరుగా మడకశిరకు కృష్ణా జలాలు తీసుకురావడానికి బైపాస్ కెనాల్ ఏర్పాటుకు రూ.214 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వివధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నేడు సీఎం జగన్ పర్యటన

- తిరుపతి, బాపట్ల జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిశీలన
- బాధితులు, రైతులను కలిసి వారితో మాట్లాడనున్న సీఎం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం తిరుపతి, బాపట్ల జిల్లాల్లోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పర్యటన చేయనున్నారు. బాధితులు, రైతులను కలిసి వారితో మాట్లాడనున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి తిరుపతి జిల్లా వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం వద్ద స్వర్ణముఖి నది కట్ట తెగి నష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించి.. గ్రామస్తులు, తుపాను బాధితులతో నేరుగా సమావేశమవుతారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి బాపట్ల జిల్లా మరుప్రోలువారిపాలెం చేరుకుంటారు. అక్కడ తుపాను బాధితులతో మాట్లాడిన అనంతరం కర్లపాలెం మండలం పాతనందాయపాలెం చేరుకుని రైతులతో మాట్లాడతారు. అక్కడి నుంచి బుద్దాం చేరుకుని తుపాను వల్ల దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించి రైతులతో సమావేశమవుతారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం తాడేపల్లి చేరుకుంటారు.

### గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల హర్షణీయం

ఏపీ నిరుద్యోగ జేఏసీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 897 గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేయడంపై ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.హేమంత్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు ఇటీవల జరిగిన పరీక్షలో లోపం ఉన్న ప్రతి ప్రశ్నకు ఒక గ్రేస్ మార్కు ఇవ్వాలని కోరారు. ఏపీపీఎస్సీ, ఏపీ డీఎస్సీకి జనరల్ అభ్యర్థులకు 47 ఏళ్లకు వయోపరిమితి పెంచాలని విజ్ఞప్తి చేశారు.

### అద్వైత ప్రచారంలో ఆస్ట్రేలియా మహిళ

- భారత్‌లో 6,000 కి.మీ పాదయాత్ర
- విశాఖ శ్రీశారదాపీఠం సందర్శన



జార్డి మోర్‌కు ఆశీస్సులు అందిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

పెందుర్తి: ఆస్ట్రేలియాకు చెందిన జార్డిమోర్ అనే మహిళ భారత్‌లో అద్వైత ప్రచారం చేస్తున్నారు. ఆమె ఆదిశంకరాచార్య సంప్రదాయాన్ని అనుసరిస్తూ అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ భారత్‌లో 6,000 కిలోమీటర్ల పాదయాత్రను చేపట్టారు. ఇందులో భాగంగా విశాఖ చినముషిడివాడలోని శ్రీశారదా పీఠాన్ని గురువారం సందర్శించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. పీఠంలోని శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు, ఇతర దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. జార్డి మోర్ మాట్లాడుతూ ఒడిశాలోని పూరీలో ప్రారంభమైన తన పాదయాత్ర కేరళలోని కాలడి మీదుగా చార్‌ధామ్ వరకు ఆరు నెలలు సాగుతుందని వివరించారు. ఆస్ట్రేలియాలోని పెర్త్ ప్రాంతానికి చెందిన తాను వృత్తిరీత్యా యోగ టీచర్‌నని తెలిపారు.

### యాచకురాలిపై తెలుగు తమ్ముడి లైంగిక వేధింపులు



లోకేశ్ పాదయాత్రలో సతీష్ (ఫైల్)

కదిరి టౌన్: యాచక వృత్తి చేసుకుంటూ కదిరి బస్టాండ్ ప్రాంతంలో జీవనం సాగిస్తున్న ఓ మహిళపై నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేత అనుచరుడు, నంబూల పూలకుంటకు చెందిన ఐటీడీపీ సభ్యుడు వేలూరి సతీష్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. బుధవారం రాత్రి మద్యం మత్తులో కదిరి బస్టాండ్‌కు చేరుకున్న సతీష్ అక్కడున్న యాచకురాలిని చిత్రహింసలకు గురిచేశాడు. అంతటితో ఆగకుండా లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. స్థానిక యువకుడు ఒకరు అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. అతనిపైనా దాడికి దిగాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా.. నిత్యం బస్టాండులో కనిపించే బాధితురాలు ఇప్పుడు అక్కడ కనిపించడం లేదు. తెలుగు తమ్ముడి అకృత్యాన్ని అడ్డుకుని దాడికి గురైన యువకుడి జాడ కూడా తెలియరావడం లేదు. దీనిపై పోలీసులను వివరణ కోరగా, తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

### లోక్‌సభ ఎన్నికలకు కొత్త ఓటర్ల జాబితా

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియ ప్రారంభమైంది. వచ్చే జనవరి 1 అర్హత తేదీగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం-2024 షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండనున్న యువతతో పాటు ప్రస్తుత ఓటరు జాబితాలో పేరు లేని వారి నుంచి కూడా దరఖాస్తులను స్వీకరిస్తారు.

# జాబ్స్ పిలుపు..

## 897 పోస్టులతో గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ



సాక్షి, అమరావతి: యువత ఉత్కంఠకు తెర దించుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-2 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 897 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కమిషన్ ప్రకటించింది. ఈ నెల 21వతేదీ నుంచి జనవరి 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. అభ్యర్థులు తమ వన్ టైమ్ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ (ఓటీపీఆర్) ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. కొత్త అభ్యర్థులు తొలుత కమిషన్ వెబ్‌సైట్‌లో తమ ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఓటీపీఆర్‌తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షను ఆబ్జెక్టివ్ తరహాలో ఫిబ్రవరి 25వతేదీన ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు. మెయిన్స్ సైతం ఆబ్జెక్టివ్ తరహాలో ఆఫ్‌లైన్ లేదా సీబీటీలో నిర్వహించనున్నారు. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. మెయిన్స్ పరీక్ష తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

### మే నాటికి మొత్తం ప్రక్రియ పూర్తి

కమిషన్ ప్రకటించిన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో 114 డిప్యూటీ తహసీల్దార్, 150 ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్ల పోస్టులు 4, గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్ 16, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ 28 పోస్టులతో పాటు 59 శాఖల్లో 331 ఎగ్జిక్యూటివ్ పోస్టులున్నాయి. నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎ‌ఓ), సీనియర్ ఆడిటర్, ఆడిటర్ ఇన్ పే అండ్ అకౌంట్స్, వివిధ సెక్షన్లలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 566 ఉన్నాయి. ఈ మొత్తం ప్రక్రియను మే నెల నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం సూచించిన నేపథ్యంలో కమిషన్ ఆ మేరకు ప్రణాళిక సిద్ధం చేసింది.

### వెబ్‌సైట్‌లో సిలబస్

అభ్యర్థుల అభ్యర్థన, సౌలభ్యం మేరకు గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్షను ఆబ్జెక్టివ్ తరహాలో ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు. జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీలో 150 ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు 2.30 గంటల్లో ఓఎంఆర్ షీట్‌పై సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. మెయిన్స్‌లో పేపర్-1, పేపర్-2లో 150 చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు జవాబులు గుర్తించాలి. పరీక్ష సిలబస్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఖాళీలు, వేతనం, వయసు, విద్యార్హతలతో పాటు పూర్తి సమాచారం కోసం కమిషన్ వెబ్‌సైట్ http://www.psc.ap.gov.inలో చూడవచ్చు.

### త్వరలో రానున్న నోటిఫికేషన్లు

| నోటిఫికేషన్ | పోస్టులు |
|---|---|
| గ్రూప్-1 | 89+ (క్యారీ ఫార్వర్డ్ పోస్టులు మొత్తం 100 వరకు) |
| లైబ్రేరియన్స్ ఇన్ ఏపీ కాలేజీ ఎడ్యుకేషన్ | 23 |
| డిగ్రీ కాలేజీ లెక్చరర్స్ | 267 |
| ఏపీ రెసిడెన్షియల్ కాలేజీ జేఎల్స్ | 10 |
| ఏపీ రెసిడెన్షిల్ కాలేజీ డీఎల్స్ | 05 |
| టీటీడీ డీఎల్స్, జేఎల్స్ | 78 |
| ఇంగ్లిష్ రిపోర్టర్స్(ఏపీ లెజిస్లేచర్ సర్వీస్) | 10 |
| జూనియర్ లెక్చరర్స్ (లిమిటెడ్) | 47 |
| అసిస్టెంట్ కెమిస్ట్స్ ఇన్ గ్రౌండ్ వాటర్ సర్వీస్ | 01 |
| జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్స్ | 06 |
| అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్స్ | 03 |
| అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ | 01 |
| టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్స్ | 04 |
| విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్స్ | 02 |
| జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(కేటగిరీ-2) | 01 |
| సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(కేటగిరీ-3) | 04 |
| జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్(కేటగిరీ-4) | 06 |
| డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ | 38 |
| ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ | 04 |
| జూనియర్ అసిస్టెంట్స్ (జైళ్లు) | 01 |
| పాలిటెక్నిక్ లెక్చరర్స్ | 99 |
| లైబ్రేరియన్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్ | 02 |

పురపాలకశాఖ అకౌంట్స్ విభాగంలోనూ మరికొన్ని పోస్టులు

# వాయువేగంతో సాయం



పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలంలో పంట బోదెలలో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు



బాపట్ల జిల్లా కర్లపాలెంలో తుపాను బాధితులకు సరుకులు, బియ్యం అందిస్తున్న తహశీల్దార్

- 12 జిల్లాల్లో 428 పునరావాస కేంద్రాలు
- 26,226 మందికి ఆశ్రయం
- ఏ లోటూ లేకుండా భోజన సదుపాయం
- బాధిత ప్రాంతాల్లో కొనసాగుతున్న నిత్యావసరాల పంపిణీ
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
- నిర్విరామంగా సహాయక చర్యల్లో 12 ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

సాక్షి, అమరావతి, సాక్షి నెట్‌వర్క్: తుపాను ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలు శరవేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వలంటీర్ల నుంచి గ్రామ, మండల స్థాయి అధికారులు, కలెక్టర్లు, సీనియర్ అధికారులు, ప్రత్యేక అధికారులు అంతా సహాయ చర్యల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు కాస్త తెరిపి ఇవ్వడంతో దాదాపు అన్ని ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. తుపాను ప్రభావిత 12 జిల్లాల్లో గురువారం రాత్రి నాటికి 428 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిల్లో 26,226 మంది ఆశ్రయం పొందుతున్నారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 144 పునరావాస కేంద్రాల్లో 8,529 మందికి ఆశ్రయం కల్పించారు. బాపట్ల జిల్లాలో 74 కేంద్రాల్లో 3,888 మంది, కృష్ణా జిల్లాలోని 67 కేంద్రాల్లో 3579 మంది, తిరుపతి జిల్లాలో 36 కేంద్రాల్లో 3,386 మంది, ప్రకాశం జిల్లాలోని 11 కేంద్రాల్లో 865 మంది, పల్నాడు జిల్లాలోని 14 కేంద్రాల్లో 1,677 మంది, ఏలూరు జిల్లాలోని రెండు కేంద్రాల్లో 151 మంది, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 37 కేంద్రాల్లో 910 మంది, పశ్చిమ గోదావరి జిల్లాలోని 21 కేంద్రాల్లో 1,887 మంది, తూర్పు గోదావరి జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో 248 మంది ఆశ్రయం పొందుతున్నారు. శిబిరాల్లో ఉన్న వారికి భోజనం, మంచినీరు సౌకర్యం కల్పించారు. 74 వేలకుపైగా ఆహార పొట్లాలను బాధితులకు పంపిణీ చేశారు. 2.69 లక్షల మంచినీళ్ల ప్యాకెట్లను సరఫరా చేశారు. 171 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు ఎటువంటి వైద్య పరమైన సమస్యలు తలెత్తినా వెంటనే చికిత్స అందిస్తున్నారు. తాగు నీటికి ఇబ్బందులు లేకుండా బోర్ల వద్ద జనరేటర్లు, ట్యాంకర్లు ఏర్పాటు చేసి మరీ సరఫరా చేస్తున్నారు. సహాయ చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.24.85 కోట్లు విడుదల చేసింది. ఆ నిధులతో జిల్లా కలెక్టర్లు బాధితులకు ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు. పునరావాస కేంద్రాల నుంచి బాధితులు ఇంటికి తిరిగి వెళ్లే టప్పుడు ప్రభుత్వం అందించే రూ.1,000 నుంచి రూ.2,500 ఆర్థిక సాయాన్ని పలుచోట్ల పంపిణీ చేయగా, మిగిలిన చోట్ల కూడా అందించేందుకు ఏర్పాట్లు జరిగాయి. బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ విస్తృతంగా చేపట్టారు. ఆయా కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, లీటర్ పామాయిల్ ఇస్తున్నారు. విద్యుత్ సరఫరా దెబ్బతిన్న అన్ని చోట్లా వెంటనే పునరుద్ధరించారు. దెబ్బతిన్న రహదారులను తాత్కాలికంగా బాగు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 12 ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిర్విరామంగా సేవలు అందిస్తూనే ఉన్నాయి. కృష్ణా జిల్లా అవనిగడ్డ, మచిలీపట్నం, ప్రకాశం జిల్లా ఒంగోలు, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి, బాపట్ల జిల్లా బాపట్ల, పొట్టిశ్రీరాములు జిల్లా నెల్లూరు, తిరుపతి జిల్లా నాయుడుపేట, గూడూరులో ఈ బృందాల సభ్యులు అలుపెరగకుండా సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు.

- బాపట్ల జిల్లాలో గురువారం ఉదయం నాటికి 596 గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దెబ్బతిన్న ఒక్కో గృహానికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. 700కిపైగా కూలిన చెట్లను రోడ్లపై నుంచి తొలగించారు. జిల్లాలో లక్షకుపైగా హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఉపాధి కూలీలతో వరి పొలాల్లోని నీటిని బయటకు తరలించే పనులు కొనసాగిస్తున్నారు. తుపాన్ ఉధృతికి పర్చూరు నియోజకవర్గంలో పర్చూరు వాగు, కప్పలవాగు, కొమ్మమూరు కాలువ, ఆలేరు వాగులకు దాదాపు 20 చోట్ల గండ్లు పడటంతో మరమ్మతులు నిర్వహిస్తున్నారు.
- పశ్చిమ గోదావరి జిల్లాలో ఉపాధి హామీ కూలీలను వ్యవసాయ సహాయక చర్యల్లో వినియోగిస్తున్నారు. ముంపు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో 1,282 మంది ఉపాధి కూలీలతో పంట బోదెల్లో పూడికలు తీయించారు. జేసీబీలతో డ్రెయిన్లలో పూడిక తొలగిస్తున్నారు. గ్రామాల్లో డోర్ టు డోర్ ఫీవర్ సర్వే చేపట్టారు.
- తిరుపతి జిల్లాలో అధికారులు యుద్ధ ప్రాతిపదికన బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడంతోపాటు 17 గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. జిల్లాకు తక్షణ సాయం కింద ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. బాధితులకు నిత్యావసర సరుకులను కిట్ రూపంలో అందజేశారు.
- వర్షాలు కొద్దిగా తెరిపివ్వడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అనకాపల్లి జిల్లా మాడుగులలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, చోడవరంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.
- కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో దెబ్బతిన్న పంటను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులకు ధైర్యం చెప్పారు.

# సహాయ, పునరుద్ధరణ చర్యలు వేగవంతం

- నిత్యావసర సేవలన్నింటినీ యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించండి
- జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశంలో సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపానువల్ల రాష్ట్రంలో జరిగిన పంట నష్టం అంచనాలను త్వరగా చేపట్టడంతో పాటు సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తుపాను అనంతర సహాయ, పునరుద్ధరణ చర్యలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. తుపాను అనంతరం విద్యుత్, రహదారులు, తాగునీటి సౌకర్యం పునరుద్ధరణ, పంట నష్టాల అంచనా తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పంటనష్టం అంచనాకు సంబంధించి ఎన్యూమరేషన్ ప్రక్రియను చేపట్టాలని వ్యవసాయ, ఉద్యాన శాఖలతో పాటు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆమోదంతో తుపాను నష్ట పరిశీలనకు రాష్ట్రానికి కేంద్ర బృందాన్ని పంపాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు.

### 1.45 లక్షల హెక్టార్లలో వరి పంటకు దెబ్బ

ప్రాథమిక అంచనా ప్రకారం.. 1,45,795 హెక్టార్లలో వరి, 31,498 హెక్టార్లలో వివిధ ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని జవహర్‌రెడ్డి తెలిపారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తికాగానే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని అందించడంతో పాటు నూరు శాతం బీమా సౌకర్యం వర్తింపజేస్తామని ఆయన స్పష్టంచేశారు. అలాగే.. తడిసిన, రంగు మారిన ధాన్యం సేకరణకు సంబంధించిన నిబంధనల సడలింపునకు కేంద్రానికి లేఖ రాయనున్నట్లు సీఎస్ చెప్పారు.

### శిబిరాల్లో చేరిన వారికి సాయం..

- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ జి. సాయిప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పటివరకూ పునరావాస కేంద్రాల్లో చేరిన వారికి మొత్తం సుమారు రూ.రెండున్నర కోట్ల వరకూ సహాయం అందించినట్లు తెలిపారు.
- 1,01,000 కుటుంబాలకుగాను ఇప్పటికే 65,256 కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు వంటి నిత్యావసర సరకులను పంపిణీ చేశామన్నారు. మిగతా కుటుంబాలకు కూడా త్వరగా అందిస్తామన్నారు.
- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ వర్చువల్‌గా పాల్గొని మాట్లాడుతూ 3,292 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగ్గా ఇప్పటికే 3,111 గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరించామని చెప్పారు.

### 11 నుంచి పంట నష్టం అంచనా..

వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి పంట నష్టం అంచనా ఎన్యూమరేషన్ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు చెప్పారు. దెబ్బతిన్న పంటలన్నిటికీ నూరు శాతం బీమా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పశు సంపద, బోట్లు, వలలు నష్టపోయిన బాధితులకు శుక్రవారం సాయంత్రానికి ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తిచేసి నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- 93.8 కిలోమీటర్ల పొడవున రహదారులు దెబ్బతిన్నాయని వాటిని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ చెప్పారు. ఆర్ అండ్ బి కార్యదర్శి ప్రద్యుమ్న మాట్లాడుతూ 2,816 కిమీ మేర ఆర్ అండ్ బీ రోడ్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని సమీప మార్కెట్ యార్డులు, గోదాములకు తరలించి కాపాడేందుకు చర్యలు తీసుకున్నామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు.

# అన్నదాత సేవలో ఆర్బీకే సైన్యం

- తుపాను ప్రభావిత జిల్లాల్లో అహర్నిశలు కృషి
- ముంపునకు గురైన పంటను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు



అనకాపల్లి జిల్లా యలమంచిలిలో పనలపై ఉప్పు ద్రావణం పిచికారీ చేస్తున్న ఆర్బీకే సిబ్బంది

సాక్షి, అమరావతి: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, అధిక గాలులకు దెబ్బతిన్న పంటలను కాపాడటంలో ఆర్బీకె సైన్యం శక్తివంచన లేకుండా శ్రమిస్తోంది. వర్షం తెరిపివ్వడంతో పంటలను, పంట ఉత్పత్తులను కాపాడటంలో విశేష కృషి చేస్తూ రైతుల్లో ధైర్యాన్ని నింపుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సహాయక చర్యలను వ్యవసాయ శాఖ ముమ్మరం చేసింది. క్షేత్రస్థాయి సిబ్బంది ఆర్బీకేల ద్వారా పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ.. పొలాల్లోని వరి పనలు మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని రైతులతో కలిసి పనలపై సామూహికంగా చల్లుతున్నారు. పొలాల్లో నిలిచిపోయిన నీటను కిందకు పోయేలా చేస్తున్నారు. తడిసిపోయిన పనలను రైతు కూలీలతో కలిసి ఒడ్డుకు తీసుకొచ్చి ఉప్పు ద్రావణం చల్లే ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారుల సమన్వయంతో కాలువలు, డ్రెయిన్లను ఉపాధి హామీ కూలీల సహకారంతో మరమ్మతులు చేసి పంట పొలాల నుంచి వర్షపు నీటిని బయటకు పంపుతూ రైతులకు ఇబ్బంది లేకుండా సహాయ సహకారాలు అందిస్తున్నారు. పంట కోతకు సిద్ధంగా ఉన్న పొలాల్లో నీరు నిలిచి ఉంటే.. చేలల్లో చిన్నపాటి బాటలు, బోదెలు తీసి మడుల నుంచి నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆర్బీకే సిబ్బంది స్వయంగా చేలలో నేలకు పడిపోయిన వరి దుబ్బులను లేపి.. కట్టలు కట్టే ప్రక్రియలో రైతులకు తోడ్పాటు అందిస్తున్నారు. పంట నష్టం అంచనాలకు ఎన్యుమరేషన్ బృందాలను ఏర్పాటు చేశామని, ముంపు నీరు పూర్తిగా చేల నుంచి తొలగిన తర్వాత పంట నష్టం అంచనా వేసేందుకు ఈ బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తాయని వ్యవసాయ శాఖ కమిషనర్ చేవూరు హరికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు.

# సాధారణ స్థితికి విద్యుత్ సరఫరా

## రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాలు, గ్రామాల్లో నిరంతర విద్యుత్



విద్యుత్ పునరుద్ధరణ పనులు చేస్తున్న కార్మికుడు

సాక్షి, అమరావతి/కాకినాడ/మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సాధారణ స్థితికి వస్తోంది. శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టడానికి అవకాశంలేని చోట్ల తాత్కాలిక చర్యలతో విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో గురువారం సాయంత్రానికి రాష్ట్రమంతటా దాదాపు 98 శాతం విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తయినట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు ఐ. పృథ్వీతేజ్, జె. పద్మజనార్దనరెడ్డి, కె. సంతోషరావు 'సాక్షి'కి వెల్లడించారు. మిచాంగ్ తీవ్రత ఎక్కువగా ఉన్న నెల్లూరు, గుంటూరు జిల్లాల్లోనూ విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావడంలో రాష్ట్ర విద్యుత్ సంస్థల ప్రయత్నాలు ఫలించాయి. ఉమ్మడి ప్రకాశం, కృష్ణా, చిత్తూరు, కర్నూలు, పశ్చిమ, తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో తుపాను ప్రభావం ఉన్న ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

### పూర్తయిన పునరుద్ధరణ..

ఏపీఎస్పీడీసీఎల్‌లో 231 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. ఇక్కడ 17 ఫీడర్లు ప్రభావితం కాగా, ఒకటి రెండు మినహా మిగిలిన అన్ని ఫీడర్లు గురువారం రాత్రికి పునరుద్ధరించారు. నెల్లూరు, తిరుపతి, కడప సర్కిళ్లలో దెబ్బతిన్న మూడు ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లు, 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 269, 33 కేవీ ఫీడర్లు 145, 33 కేవీ ఫీడర్లు, 32 కేవీ స్తంభాలు 770, 11 కేవీ 2,341 స్తంభాలు, 247 డీటీఆర్‌లను సాధారణ స్థితికి తీసుకొచ్చారు. నెల్లూరు సర్కిల్‌లో 33/11కేవీ సబ్‌స్టేషన్లు 36 పూర్తిగా చెడిపోగా, పునరుద్ధరించారు. రూ.1,235.45 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో 33 కేవీ సబ్‌స్టేషన్లు 150, 33 కేవీ ఫీడర్లు 134, 33 కేవీ పోల్స్ 16, 11కేవీ పోల్స్ 514, 173 డీటీఆర్‌లు దెబ్బతినగా, అన్నిటినీ సాధారణ స్థితికి తెచ్చారు. డిస్కం మొత్తం మీద రూ.545.98 లక్షల నష్టం వాటిల్లిందని అంచనా. ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని విజయవాడ, గుంటూరు, సీఆర్‌డీఏ, ఒంగోలు సర్కిళ్లలో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 204, 33కేవీ ఫీడర్లు 147, 33 కేవీ స్తంభాలు 115, 11కేవీ పోల్స్ 1,247, డీటీఆర్‌లు 504 పాడవ్వగా, అన్నిటినీ బాగుచేశారు. రూ.1,995.57 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

# 'ఆరోగ్య సురక్ష'తో చిన్నారి జీవితంలో వెలుగులు

గ్రహణమొర్రికి ఆపరేషన్

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన చిన్నారి తల్లిదండ్రులు



ఆపరేషన్ తర్వాత నవనీత్‌తో కలిసి వైద్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్న దంపతులు శరత్‌బాబు, వెంకటలక్ష్మి

గుత్తి: ఆ చిన్నారికి నిండా రెండేళ్లు కూడా లేవు. గ్రహణమొర్రితో పెదవి చీలిపోయింది. ఏదైనా తినాలన్నా... తాగాలన్నా ఇబ్బందే. ఏం చేయాలో తెలియని నిరుపేద తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. రూ.లక్షలు ఖర్చు చేస్తే గానీ చిన్నారికి వైద్యం చేయించలేమని తెలిసి అల్లాడిపోయారు. ఇటువంటి సమయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వారి జీవితాల్లో వెలుగులు నింపింది. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో నివాసముండే శరత్‌బాబు, వెంకటలక్ష్మి దంపతులకు నవనీత్ అనే రెండేళ్ల బాలుడు సంతానం. నవనీత్‌కు గ్రహణమొర్రి కారణంగా పెదవి చీలిపోగా, అంద వికారంగా కనిపించేవాడు. దీంతో తల్లిదండ్రులు స్థానిక ఆస్పత్రులకు తీసుకువెళ్లినా వైద్యులు ఏమీ చేయలేకపోయారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, బెంగళూరులాంటి నగరాల్లోని ఆస్పత్రులకు వెళ్లాలని సూచించారు. కానీ నిరుపేదలైన వారు చేతిలో చిల్లి గవ్వలేక బిడ్డకు వైద్యం చేయించలేకపోయారు. ఈ క్రమంలోనే గత నవంబర్ మాసంలో చెట్నేపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం నిర్వహించగా, నవనీత్‌ను అక్కడికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యురాలు దివ్య అనంతపురం రెఫర్ చేశారు. నవంబర్ 15వ తేదీ అనంతపురంలో నవనీత్‌ను పరీక్షించిన వైద్యులు హైదరాబాద్ ఏవీఆర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. డిసెంబర్ 1వ తేదీన హైదరాబాద్ ఏవీఆర్ ఆస్పత్రిలో నవనీత్‌కు వైద్యులు ఆరోగ్య శ్రీ ద్వారా ఆపరేషన్ చేశారు. అనంతరం కోలుకున్న నవనీత్‌ను గురువారం డిశ్చార్జ్ చేయగా, శరత్ బాబు, వెంకట లక్ష్మి దంపతులు బిడ్డతో కలిసి స్వగ్రామం చేరుకున్నారు. తమ కుమారునికి ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేయించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ

### డాక్టర్ లాస్య సాయి సింధుకు నేషనల్ హెల్త్ ఎక్సలెన్స్ అవార్డు

సాక్షి, హైదరాబాద్: నగరంలోని సిటీన్యూరో ఆసుపత్రిలో న్యూరోటాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ లాస్య సాయి సింధుకు ఆరోగ్యరంగంలో జాతీయ అవార్డు లభించింది. కేంద్ర ప్రభుత్వం దీన్ని అందజేసింది. జీ-20లో భాగంగా నేషనల్ అచీవర్స్ రికగ్నిషన్ ఫోరం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక 'నేషనల్ అచీవర్స్ అవార్డ్ ఫర్ హెల్త్ ఎక్సలెన్స్ - 2023' అవార్డును ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి తిరథ్ సింగ్ రావత్ చేతుల మీదుగా డాక్టర్ లాస్య సాయి సింధు గురువారం ఢిల్లీలో అందుకున్నారు. ఆమెకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. న్యూరోటాలజిస్ట్‌గా ఆమె అందిస్తున్న సేవలకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కరోనా తర్వాత అనేక మంది బాధితులు కళ్లు తిరగడం (వర్టిగో) వంటి వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. ఇటువంటి వారికి తక్కువ మందులు ఇచ్చి నిర్ణీత వ్యాయామాలతో ఆమె నయం చేస్తున్నారు.

### శబరిమలకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: శబరి మలకు వెళ్లే అయ్యప్ప భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. కాచిగూడ-కొల్లాం (07187/07188) స్పెషల్ ట్రైన్ ఈ నెల 11వ తేదీ సోమవారం రాత్రి 11.45 గంటలకు బయలుదేరి బుధవారం ఉదయం 5.30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 13వ తేదీ బుధవారం ఉదయం 10.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.45కు కాచిగూడకు చేరుకుంటుంది. సికింద్రాబాద్-కొల్లాం (07193/ 07194)స్పెషల్ ట్రైన్ ఈనెల 13వ తేదీ బుధవారం ఉదయం 10.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 15వ తేదీ శుక్రవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.40కి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

నిశ్చయంగా, ఎవరైతే విశ్వసించి సత్కార్యాలు చేశారో,
మేము అలాంటి వారి మంచి పనుల ప్రతిఫలాన్ని వృథా కానివ్వము.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 8 డిసెంబర్ 2023

# కాంగ్రెస్ సర్కారుకు సవాళ్లు

తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ఏలుబడి మొదలైంది. ఎన్నికల ఫలితాలు వెలువడగానే ముఖ్యమంత్రిని నిర్ణయించటం మొదలు మంత్రుల ఖరారు వరకూ కొనసాగే కాంగ్రెస్ మార్కు అనిశ్చితికి పెద్దగా తావు లేకుండానే అంతా పూర్తికావటం గమనించదగ్గది. మరో అయిదు నెలల్లో లోక్‌సభ ఎన్నికలుండటం, తెలంగాణలో గరిష్ఠ స్థాయిలో సీట్లు రాబట్టుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌కు ఉండటం ఇందుకు కారణం కావొచ్చు. కేబినెట్ కూర్పులో రాజకీయ, పాలనానుభవం పుష్కలంగా వున్నవారితోపాటు కొత్త నెత్తురుకు కూడా చోటిచ్చారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గతంలో కాంగ్రెస్ ఏలుబడిలో మంత్రులుగా పనిచేశారు. జూపల్లి టీఆర్ఎస్ కేబినెట్‌లో కూడా మంత్రిగా ఉన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గతంలో డిప్యూటీ స్పీకర్‌గా, కాంగ్రెస్ శాసనభా పక్ష నేతగా వ్యవహరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుది ప్రత్యేక రికార్డు. ఆయన ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు దనసరి అనసూయ అలియాస్ సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాత్రం అమాత్యులుగా పరిపాలనకు కొత్త వారు. శాఖల కేటాయింపుపై ఊహాగానాలు వస్తున్నా అధికారిక ప్రకటనపై మాత్రం సస్పెన్స్ ప్రస్తుతానికి కొనసాగుతోంది.

కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాక తెలంగాణలో ఆ పార్టీకి కొంత ఊపూ ఉత్సాహం వచ్చిన సంగతి నిజమే అయినా... అది అధికారాన్ని అందుకునే స్థాయికి ఎదుగుతుందని మొదట్లో ఎవరికీ అంచనాలు లేవు. బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా, పార్టీ శాసనసభ్యుల పైనా ప్రజానీకంలో గూడుకట్టుకున్న అసంతృప్తిని పసిగట్టడంలో పార్టీ సారథి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలం అయ్యారు. వివిధ స్థాయుల్లో అవినీతి, సర్కారీ కొలువుల భర్తీలో ప్రదర్శించిన అలసత్వం, పోటీ పరీక్షల నిర్వహణలో వైఫల్యం, ధరణి పోర్టల్‌తో వచ్చిన సమస్యలు ప్రభుత్వానికి అప్రతిష్ఠ తెచ్చాయి. సీఎం ఎవరికీ అందుబాటులో వుండరన్న అభిప్రాయం ఏర్పడటం కూడా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని దెబ్బతీసింది. వీటన్నిటి పర్యవసానంగా ప్రత్యామ్నాయం కోసం తెలంగాణ ప్రజానీకం ఎదురుచూసింది. దీన్ని అందిపుచ్చుకుంటున్నట్టే మొదట్లో కనబడిన భారతీయ జనతా పార్టీ స్వీయతప్పిదాల వల్ల క్రమేపీ వెనక్కిపోయింది. ఇది కూడా కాంగ్రెస్‌కు లాభించింది. ఇక ఆ పార్టీ మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలు గెలుపును సునాయాసం చేశాయి. రైతు భరోసా కింద ఏటా రూ. 15,000, వ్యవసాయ కూలీలకు రూ. 12,000, రైతులకు అయిదేళ్ల వ్యవధిలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ, ఇంటింటికీ 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు, ప్రతి మహిళకూ నెలకు రూ. 2,500, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 500 కే గ్యాస్ సిలెండర్, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద సొంతిల్లు లేనివారికి ఉచితంగా స్థలం, రూ. 5 లక్షల సాయం, విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యాభరోసా కార్డు, చేయూత పథకం కింద నెలకు రూ. 4 వేల పెన్షన్, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా తదితర హామీలు కూడా సగటు ఓటరును బాగా ఆకట్టుకున్నాయి. ఈ ఆరు గ్యారెంటీలకు సంబంధించిన ఫైలు పైనే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తొలి సంతకం చేశారు. అయితే ఏటా రూ. 88,000 కోట్లు అవసరమని అంచనా వేస్తున్న ఈ పథకాల అమలుకు నిధులు సమకూర్చటం ప్రభుత్వం ముందున్న పెద్ద సవాలు. ఇవిగాక ఇప్పటికే అమలవుతున్న సంక్షేమ పథకాలు ఉండనే ఉన్నాయి. ప్రస్తుతం రూ. 5 లక్షల కోట్ల రుణభారం ఉన్న తెలంగాణలో ఇదంతా కత్తిమీది సామే. ఎందుకంటే 2023–24 బడ్జెట్‌లో రాష్ట్ర ఆదాయాన్ని 2.16 లక్షల కోట్లుగా చూపారు. ఇక రెవెన్యూ వ్యయం రూ. 2.12 లక్షల కోట్లుంది. ఎఫ్ఆర్‌బీఎం చట్టం కింద రుణ పరిమితిని పెంచుకోవటానికి అనుమతించాలన్న బీఆర్ఎస్ సర్కారు వినతిని కేంద్రం తిరస్కరిస్తూ వచ్చింది. బహుశా అందువల్లే కావొచ్చు... తొలి కేబినెట్ భేటీలో అధిక భారం పడని రెండు గ్యారెంటీలు – మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 10 లక్షల ఆరోగ్యశ్రీ బీమా అమలుచేయాలని నిర్ణయించారు. ఇవి రెండూ ఈ 9వ తేదీ నుంచి అమల్లోకి రాబోతున్నాయి. అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 64 కాగా, మిత్రపక్షం సీపీఐకి ఒక స్థానం వుంది. నిన్నటివరకూ పాలించిన బీఆర్ఎస్ 39 స్థానాలతో బలమైన ప్రతిపక్షంగా ఉంది. 8 స్థానాలు గెల్చుకున్న బీజేపీ, ఏడు స్థానాలున్న ఎంఐఎంలు సైతం పాలనా నిర్వహణను నిశితంగా గమనిస్తుంటాయి. వాగ్దానాల అమలులో విఫలమైతే నిలదీయటానికి విపక్షాలు సిద్ధంగా ఉంటాయి. బీఆర్ఎస్ ప్రాంతీయపార్టీ గనుక కేసీఆర్ స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోగలిగారు. పాలించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సారథిగా రేవంత్‌కి పరిమితులు తప్పవు.

రాజకీయాలపై ఆసక్తి, అనురక్తి మినహా మరే నేపథ్యమూ లేని రేవంత్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదిగిన తీరు ఎన్నదగ్గది. విద్యార్థి దశలో ఆరెస్సెస్ అనుబంధ సంస్థ ఏబీవీపీతో, ఆ తర్వాత టీఆర్ఎస్‌తో, అటుపై తెలుగుదేశంతో ప్రయాణించిన రేవంత్ రెడ్డి 2017లో అనూహ్యంగా కాంగ్రెస్‌లో కొచ్చి స్వల్పవ్యవధిలోనే పీసీసీ అధ్యక్షుడు కాగలిగారు. ఇంటా బయటా సమస్యలు ఎదుర్కొన్నారు. అయితే ఓటుకు కోట్లు కేసు, తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో ఇప్పటికీ ఉందంటున్న సాన్నిహిత్యం రేవంత్‌కు గుదిబండలే. వాటినుంచి ఎంత త్వరగా విముక్తులైతే అంత త్వరగా నవ తెలంగాణలో ఏర్పడిన తొలి కాంగ్రెస్ ప్రభుత్వ సారథిగా ఆయన తనదైన ముద్ర వేయగలుగుతారు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
కార్తీక మాసం, తిథి: బ.ఏకాదశి తె.4.12 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి ద్వాదశి, నక్షత్రం: హస్త ఉ.7.22 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం: సా.4.00 నుండి 5.40 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.31 నుండి 9.19 వరకు, తదుపరి ప.12.14 నుండి 1.02 వరకు, అమృత ఘడియలు: రా.2.20 నుండి 4.03 వరకు.

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

# ఇక రైతులకు మంచిరోజులేనా?

విశ్లేషణ



దేవీందర్ శర్మ

**రైతులను శాశ్వత పేదరికంలో ఉంచిన ప్రధాన స్రవంతి ఆర్థిక ఆలోచనల నుండి బయటపడటానికి ప్రస్తుత రాజకీయాలు పోరాడుతున్నాయి. అనేక దశాబ్దాలుగా, ప్రధానమైన ఆర్థిక ఆలోచన ఏమిటంటే, పంటల ధరలను తక్కువగా ఉంచడమే! దీనివల్ల ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుందని దీని భావం. ఆర్థికవేత్తలతో సంబంధం లేకుండా, ఇప్పుడు రాజకీయ పార్టీలు రైతు సమాజం కోసం అదనపు కృషి చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. తీవ్ర సంక్షోభం నుండి వ్యవసాయాన్ని బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందనీ, అధిక భరోసాతో కూడిన ఆదాయాన్ని అందించడమే కీలకమనీ పార్టీలు గ్రహించాయి. రైతుల చేతిలో ఎక్కువ దబ్బు ఉండడం అంటే, గ్రామీణ భారతం వ్యయం చేసే సామర్థ్యం పెరుగుతుందని అర్థం.**

కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కావాలంటూ పంజాబ్, హరియాణా రైతులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో అయిదు రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, వ్యవసాయ పంటలకు అధిక ధరను అందజేస్తామనే హామీతో రైతులను ఆకర్షించడానికి బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోటీ ఏర్పడింది. ఇది 2024 సార్వత్రిక ఎన్నికలకు కొత్త నమూనాను సృష్టిస్తోంది. దేశంలో 14 శాతం మంది రైతులు మాత్రమే ధాన్య సేకరణ ధరల ప్రయోజనాన్ని పొందుతున్నారు కాబట్టి, కనీస మద్దతు ధర కోసం చట్టపరమైన ఒక చట్రాన్ని అందించాల్సిన అవసరం ఉంది.

ఒక విధంగా చెప్పాలంటే, వ్యవసాయాన్ని శాశ్వత పేదరికంలో ఉంచిన ప్రధాన స్రవంతి ఆర్థిక ఆలోచనల నుండి బయటపడటానికి ప్రస్తుతం రాజకీయాలు తీవ్రంగా పోరాడుతున్నాయి. అనేక దశాబ్దాలుగా, ప్రధానమైన ఆర్థిక ఆలోచన ఏమిటంటే, వ్యవసాయ ధరలను తక్కువగా ఉంచడమే! ఇలా చేయడం వల్ల ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుందని దీని భావం. రైతులు పేదలుగా ఉండటానికి ఇదే ప్రధాన కారణం. ప్రపంచంలోని అత్యంత సంపన్న వాణిజ్య కూటమి అయిన 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్' (ఓఈసీడీ) చేసిన ఇటీవలి అధ్యయనం, భారతీయ రైతులపై 2000వ సంవత్సరం నుండి నిరంతరం పన్ను విధించబడుతోందని నిశ్చయాత్మకంగా చూపింది. ప్రబలంగా ఉన్న వ్యవసాయ సంక్షోభానికి మూలకారణం స్పష్టంగా మన ముందుంది. 54 దేశాలలో సాగిన ఈ అధ్యయనం ప్రకారం, రైతులు 'ప్రతికూల జోన్'లో ఉన్న దేశాలు కొన్ని ఉన్నప్పటికీ, బడ్జెట్ మద్దతు ద్వారా నష్టాన్ని పూడ్చడానికి భారతదేశంలో మాత్రమే ఎటువంటి ప్రయత్నం జరగలేదని తేలింది. సరళంగా చెప్పాలంటే – ఇరవై సంవత్సరాలుగా, భారతీయ రైతులు ఏ సహాయమూ అందని కఠిన పరిస్థితుల్లో మిగిలిపోయారు.

ఆర్థిక సంస్కరణలను ఆచరణీయంగా ఉంచడానికి వ్యవసాయాన్ని త్యాగం చేయాలని విశ్వసించే ప్రధాన ఆర్థిక ఆలోచనకు ఇది సరిగ్గా సరిపోతుంది. 50 శాతం లాభ మార్జిన్‌తో 'వెయిటెడ్ ధర'ను లెక్కించడం ద్వారా, రైతులకు కనీస మద్దతు ధరను (సాంకేతికంగా దీనిని 'సీ2+50 శాతం' అంటారు) చెల్లించాలనే 'ఎం.ఎస్. స్వామినాథన్ కమిషన్' సిఫార్సును తూట్లు పొడవడంలో అదే ఆధిపత్య ఆలోచనా ప్రక్రియ పనిచేసింది. 'సీ2+50 శాతం' ఫార్ములా ఆధారంగా రైతులకు ధరను అందించడం సాధ్యం కాదనీ, అది 'మార్కెట్లను వైకల్యపరుస్తుంద'నీ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్, కాలం చెల్లిన అదే ఆర్థిక ఆలోచనల ఫలితమే.

అయితే, ప్రధాన ఆర్థికవేత్తలు ఏం చెబుతున్నారనే దానితో సంబంధం లేకుండా, ఇప్పుడు రాజకీయ పార్టీలు కష్టాల్లో ఉన్న



రైతు సమాజం కోసం అదనపు కృషి చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. తీవ్ర సంక్షోభం నుండి వ్యవసాయాన్ని బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందనీ, అధిక భరోసాతో కూడిన ఆదాయాన్ని అందించడమే కీలకమనీ పార్టీలు గ్రహించాయి. 2020–21లో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన రైతుల విశిష్టమైన నిరసన వారి కళ్ళు తెరిపించింది. అంతే కాకుండా ఆహారాన్ని పండించే రైతులకు ఇకపై జరిమానా విధించడం కుదరదని వారికి అర్థమైంది.

ఛత్తీస్‌గఢ్‌లో వరి సేకరణ ధర ఇప్పటికే క్వింటాల్‌కు రూ. 2,640 (2023 మార్కెటింగ్ సీజన్‌లో కొనుగోలు ధర రూ. 2,183 కాకుండా) ఉన్న చోట, కాంగ్రెస్ మొదటగా దానిని రూ.3,200కి పెంచడం ఆసక్తికరం. ఎకరాకు కనీసం 20 క్వింటాళ్ల కొనుగోలు చేస్తామని కూడా హామీ ఇచ్చింది. ఎకరాకు 21 క్వింటాళ్ల కొనుగోలు చేస్తామని హామీ ఇస్తూ, క్వింటాల్‌కు రూ.3,100 చొప్పున చెల్లిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. అదే విధంగా మధ్యప్రదేశ్‌లో గోధుమలకు కాంగ్రెస్ అందించే ధర క్వింటాల్‌కు రూ. 2,600 కాగా, బీజేపీ రూ. 2,700లను ప్రతిపాదించింది. రాజస్థాన్‌లో, 'సీ2+50 శాతం' ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధర చెల్లిస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. అలాగే, తెలంగాణలో రైతులకు ప్రత్యక్ష ఆదాయ మద్దతుగా రూ. 15,000 అందజేస్తామని హామీ ఇచ్చింది. ఆశ్చర్యకరంగా, 2006లో సమర్పించిన స్వామినాథన్ ప్యానెల్ సిఫార్సులను అమలు చేయడంలో ఇరుపక్షాలూ నిరాసక్తులైనప్పటికీ, ఎన్నికల రాష్ట్రాల్లో వాగ్దానం చేసిన వరి, గోధుమ ధరలు 'సీ2+50 శాతం' ఫార్ములా ధరకు సమానంగా లేదా మించి ఉన్నాయి. ఈ ఎన్నికల వాగ్దానాలు నెరవేరుతాయా లేదా అని చాలామంది ఆలోచిస్తుండగా, కనీసం వ్యవసాయ ధరలనైనా ప్రకటించాలనే పోటీ కారణంగా, రాజకీయ నాయకులు రైతు సమాజం బాధలను, వేదనను గ్రహించడం ప్రారంభించినట్లు అర్థమవుతోంది.

కాగా, అధిక ధరలను ప్రకటించడం వెనుక ఉన్న ఆర్థిక హేతుబద్ధతను ఇప్పటికే అనేక ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తలు ప్రశ్నించడం ప్రారంభించారు. అదనపు వనరులు ఎక్కడి నుంచి వస్తాయని కూడా అడుగుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రశ్నల హోరు మరింత పెరుగుతుంది. విచిత్రమేమిటంటే – అదే ఆర్థిక ఆలోచన గత 10 సంవత్సరాలలో దాదాపు రూ. 15 లక్షల కోట్ల కార్పొరేట్ మొండి బకాయిలను మాఫీ చేయడంలోని హేతుబద్ధతను ఎన్నడూ ప్రశ్నించలేదు. అలాగే 16,000 మందికి పైగా ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు రుణాలు అందించడంలో బ్యాంకులను రాజీపడేలా చేసే ఆర్థిక శాస్త్రంలోని తప్పును ఈ ఆర్థిక ఆలోచన కనుగొనలేదు. రూ. 3.45 లక్షల కోట్ల బకాయిలను ఎగవేతదారులు దాటేసి పోవడంలోని తప్పును ఇది గుర్తించలేదు. మార్కెట్లు సమర్థతను, మంచి పనితీరును మెచ్చుకుంటున్నట్లయితే, పనితీరులో విఫలమైన కంపెనీలను బెయిల్ అవుట్ చేయడానికి ఎటువంటి ఆర్థిక కారణం లేదు.

అందువల్ల, పంటలకు అధిక ధరలు అందించే నిబద్ధత దేశవ్యాప్తంగా ఎందుకు విస్తరించడం లేదని రైతులు అడగడం సరైనదే! 14 శాతం మంది రైతులు మాత్రమే సేకరణ ధరల ప్రయోజనాన్ని పొందుతున్నారు కాబట్టి, కనీస మద్దతు ధరల కోసం 'సీ2+50 శాతం' వద్ద చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను అందించాల్సిన అవసరం ఉంది. తద్వారా మిగిలిన 86 శాతం వ్యవసాయ జనాభాకు హామీ ధరలు చేరేలా చూసుకోవాలి. దీనితో పాటుగా భూమిలేని రైతుల కోసం 'పీఎం–కిసాన్' ఆదాయ మద్దతును పెంచాలి. రైతుల చేతిలో ఎక్కువ డబ్బు ఉండడం అంటే గ్రామీణ భారతం వ్యయం చేసే సామర్థ్యం ఎక్కువ అవుతుందని అర్థం. పైగా అది జీడీపీని ఉన్నత పథంలో నడిపిస్తుంది.

రాజకీయ పార్టీలు దృఢంగా ఉండాల్సిన అవసరం ఉంది. వారి వాగ్దానాల నుండి వెనక్కి వెళ్ళడానికి ప్రధాన శ్రేణి శక్తులు చేసే అరిగిపోయిన వాదనలను అనుమతించకూడదు. ఆస్టిన్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయంలో విశిష్ట ఆర్థికవేత్త ప్రొఫెసర్ జేమ్స్ కె గాల్‌బ్రైత్ మాట్లాడుతూ, 'విద్యా, రాజకీయ, మీడియా గుత్తాధిపత్యాన్ని' అట్టిపెట్టుకోవడానికి ప్రధాన స్రవంతి తరగతి తీవ్రంగా పోరాడుతోందనీ, తాజా ఆర్థిక ఆలోచనలు పెరగడాన్ని అది ఏమాత్రం అనుమతించదనీ చెప్పారు. భారతదేశంలోనూ అలా జరగడం మనం చూస్తున్నాం. 1970లు, 1980ల ప్రారంభంలో శిక్షణ పొందిన నేటి ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తలు చాలా మంది, ముందే నిర్ధారించుకున్న ఆలోచనలు, సిద్ధాంతాలతో వస్తారు అని కూడా గాల్‌బ్రైత్ అన్నారు. ఆయన ప్రకారం, ''ప్రధాన స్రవంతి ఆర్థికవేత్తలు బహుశా వారి ప్రధాన నమ్మకాలను పునఃపరిశీలించుకోవాలి. లేదా బహుశా మనకు కొత్త 'ప్రధాన స్రవంతి' అవసరం కావచ్చు.''

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### ప్రజాపాలన



అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తన 2024–25 బడ్జెట్‌ను సిద్ధం చేసే ప్రక్రియ ప్రారంభించింది. పౌరుల సూచనలకు స్వాగతం పలికింది. సూచనలతో పాటుగా వారి పేరు, మొబైల్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ కూడా తీసుకుంటోంది. బడ్జెట్‌లో ఎలాంటి ప్రజాపనులను చేర్చవచ్చో అడిగింది. పాలనలో ప్రజల భాగస్వామ్యమే కదా, ప్రజాస్వామ్యం అంటే!

– బలరామ్ శర్మ, సామాజిక కార్యకర్త

### నేనొక్కరినే కాదు



ఇంట్లో అద్దెకు ఉన్నవాళ్లను తరిమేసి, పెంచిన అద్దెలతో కొత్తవారికి ఇంటిని అద్దెకు ఇవ్వడం ఇప్పుడు బెంగళూరులో ట్రెండ్‌గా మారిందా ఏమిటి? ఇప్పటివరకు ముగ్గురు అలా చెప్పడం విన్నాను. చెప్పొద్దూ... మొదట నేను మా ఇంటి యజమాని మాత్రమే ఇలా చేస్తున్నారని అనుకున్నాను.

– పెరల్ డిసౌజా, పాత్రికేయురాలు

### అదే ఉచితం!



చాలా ఉద్వేగపూరితంగా వ్యవహరించే మనుషులు నిర్ణయాలు తీసుకునేటప్పుడు – తార్కికంగా ఉండి, ఈ నిర్ణయాల పరిణామాలను పట్టని ఇంకో మనిషిని సంప్రతించడం మేలు.

– కునాల్ షా, ఆంట్రప్రెన్యూర్

### అదే కదా ప్రశ్న?



స్కిన్ కేర్, కోల్డ్ డ్రింక్స్, పాన్ మసాలా లాంటి తాము ప్రచారం చేసే ఉత్పత్తులను బాలీవుడ్ సెలబ్రిటీలు వాడరని మనకు తెలుసు. అయినా అది మన మనసుల మీద ఎందుకు ప్రభావం చూపుతోంది?

– విజయ్ పటేల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

### తిమింగలాలు



చాలామంది భారతీయ వ్యాఖ్యాతలు, ట్విట్టర్ యోధులు విస్మరించిన ఒక ముఖ్యాంశాన్ని వీర్ సంఘ్వీ చక్కగా ఎత్తి చూపారు. మనం ఎంతసేపటికీ చిన్న చేపలైన ఖలిస్థానీలను వేటాడుతున్నాం తప్పితే... భారతీయులను దారుణంగా చంపిన దావూద్ ఇబ్రహీం, హఫీజ్ సయీద్ వంటి వారిని ఇంతవరకు తాకనైనా తాకలేకపోయాం!

– సదానంద్ ధూమే, కాలమిస్ట్

### ఇదేం కపటం?



పన్నూ (ఖలిస్తానీ నాయకుడు గుర్‌పత్‌వంత్ సింగ్ పన్నూ) జీవితం పట్ల అమెరికా చూపుతున్న పట్టింపులోని కపటం దిగ్భ్రాంతి గొలుపుతోంది. ఒసామా (బిన్ లాడెన్)ను చంపడానికేమో వాళ్లకు హక్కుంది. కానీ ఎయిర్ ఇండియా విమానాన్నీ, ఆఖరికి పార్లమెంటును కూడా పేల్చేస్తానన్న మనిషినేమో కాపాడుతారట. ఆయన్నెందుకు యూఎస్ చట్టాల కింద విచారించకూడదు?

– ప్రకాశ్ సింగ్, మాజీ పోలీస్ అధికారి

### అది సమర్థనీయమా?



ఇప్పుడు జరుగుతున్నదాన్ని సమర్థించడానికి, రెండు దేశాల పరిష్కారానికి ఒకప్పుడు పాలస్తీనా తిరస్కరించిందన్న వాస్తవాన్ని కొందరు ఎత్తిచూపుతున్నారు. ఒకవేళ ఎవరైనా మీ ఇంట్లో సగం (లేదా అంతకంటే ఎక్కువ) అడిగి, దాన్ని మీరు తిరస్కరిస్తే, ఇప్పుడు వాళ్లు మీ ఇల్లు మొత్తాన్ని తగలబెట్టడం సమర్థనీయం అవుతుందా?

– నిదా కిర్‌మానీ, సోషియాలజిస్ట్

ఇన్ బాక్స్

## పేదల అజెండాతోనే పాలన

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నాలుగున్నరేళ్ళ పాలన ఏపీ రాజకీయ చరిత్రలోనే ఉన్నత స్థానంలో నిలిచింది. అభివృద్ధినీ, సంక్షేమాన్నీ సమపాళ్ళలో నిర్వహిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. బడికి వెళ్లే బాలుని నుంచి ఇంట్లో విశ్రాంతి తీసుకొనే వృద్ధుల వరకు అందరూ ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సంక్షేమాన్ని పొందుతున్నారు. 'అమ్మ ఒడి' నుంచి 'వృద్ధాప్య పింఛను' వరకూ అనేక రూపాల్లో జనం ప్రయోజనం అందుకొంటున్నారు. 'వాలంటీర్', 'సచివాలయ' వ్యవస్థల వంటి ప్రత్యేక పాలనా విభాగాలతో ప్రభుత్వాన్ని ప్రజల గడపకు చేర్చారు జగన్. అంగన్‌వాడీ బాలల పోషకాహారం నుంచి ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం వరకూ... ఆహారాన్ని అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం జగన్ విజన్‌కు ప్రతీక. పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులంతా ఉన్నత చదువులు కొనసాగిస్తున్నారు. వీటికి తోడు విదేశీ విద్య పథకాన్ని అమలు చేస్తున్నారు. మనుషులతో పాటు పశువులకు కూడా వైద్య సదుపాయాలను మెరుగుపరిచారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఆరోగ్యశ్రీ' పథకం దేశంలోనే చరిత్ర సృష్టించింది. 'వైఎస్ఆర్ క్లినిక్'లు, 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్, మొబైల్ పశువైద్యశాలలు ప్రజా వైద్యరంగంలో విప్లవాన్ని తెచ్చాయి. 'రైతు భరోసా' పథకం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసింది. ఇలా అనేక పథకాలూ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్ర రూపురేఖలు మారిపోయాయని చెప్పొచ్చు.


సంక్షేమ పథకాల పేరిట డబ్బు వృథా చేసేస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్న కుహనా అభివృద్ధి విశ్లేషకులకు జగన్ తన సమర్థ పాలనతో గట్టి సమాధానం చెప్పారు. సంక్షేమాన్నీ, అభివృద్ధినీ సమాంతరంగా నడిపిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. కులాల ప్రాతిపదిక సంక్షేమం కంటే పేదరిక నిర్మూలనకు ప్రాధాన్యత నిచ్చి అన్ని వర్గాల అభిమానాన్నీ పొందారు. ప్రాంతీయ అభివృద్ధికి; మహిళా, బలహీనవర్గాల, మైనార్టీల సాధికార లక్ష్యాలకు అనుగుణంగా అనేక పథకాలను అమలు చేస్తున్నారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా ఆయన ప్రజల హృదయాల్లో సముచిత స్థానం సంపాదించుకున్నారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆకర్షణీయ పారిశ్రామిక విధానాలు అవలంబించారు. ఇటువంటి ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సాధికార సాధనతో కూడిన ప్రభుత్వం పది కాలాలపాటు కొనసాగాలని పేదజనం కోరుకుంటున్నారు.

– జి. యోగేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్

# రాజ్యాంగ విలువలు అమలవుతున్నాయా?

రాజ్యాంగ నిర్మాతలు జాతి లక్ష్యాలనూ వాటిని సాధించేందుకు అవసరమైన వ్యవస్థలనూ, ప్రక్రియలనూ రాజ్యాంగంలో పొందు పరచారు. జాతి సమైక్యత, సమగ్రత, ప్రజాస్వామిక సమాజం ఏర్పాటు అనేవి జాతి లక్ష్యాలుగా ఉద్దేశించబడ్డాయి. వీటిని సాధించేందుకు ప్రజాస్వామిక స్ఫూర్తితో రాజ్యాంగ ప్రజాస్వామిక వ్యవస్థలను వినియోగించుకుంటూ సామాజిక, ఆర్థిక విప్లవం ద్వారా నూతన సమాజాన్ని నిర్మించవలసి ఉంటుందని భావించారు. రాజ్యాంగ వ్యవస్థలు వాటికి అవే పనిచెయ్యవు. ఆ వ్యవస్థ ద్వారా ఎంపిక కాబడ్డ రాజకీయ యంత్రాంగం నడిపించాల్సి ఉంటుంది. ప్రముఖ న్యాయమూర్తి జాన్ మార్షల్ అన్నట్లు 'రాజ్యాంగం అనేది భావితరాల కోసం రూపొందించబడుతుంది, కానీ దాని నిర్దిష్ట క్రమం ఎప్పుడూ ఒడుదొడుకులు లేకుండా ఉండదు'. రాజ్యాంగం అంటే ఒక జాతి సామాజిక లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగించే దిక్సూచిలాగా భావించాలి. నిజానికి నిత్య జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకూ పరిష్కార మార్గం ఏ రాజ్యాంగంలోనూ లభించదు. వాటిని రాజ్యాంగ సూత్రాల పరిధిలో పరిష్కరించుకోవాల్సి ఉంటుంది.




రాజ్యాంగం ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలకూ, చారిత్రక అసమానతల మీద ఏర్పడ్డ సామాజిక వ్యవస్థకూ భిన్నత్వం ఉంది. ఈ వైరుధ్యాల నడుమనే భారత రాజకీయ వ్యవస్థ రాజ్యానికీ, వ్యక్తుల హక్కులకూ మధ్య సమన్వయం సాధిస్తూ ముందుకు సాగాలి. వ్యక్తి స్వేచ్ఛ, పౌరస్వేచ్ఛ ప్రధానమైనవిగా భావించాలి. అంబేడ్కర్ చెప్పిన 'చట్టం ముందర సమానత్వం' భావన కేవలం సూత్రప్రాయంగా కాక 'రూల్ ఆఫ్ లా' ప్రాతిపదికన ముందుకు సాగాలి.

వర్తమానంలో రాజ్యాంగానికి ఆవల ఉండే పద్ధతుల్లో ఎన్నో విధ్వంసకర విధానాలు 'సర్వసమ్మతి' పేరున జరుగుతున్నాయి. 1990ల్లో వచ్చిన నయా ఉదారవాద విధానాల నేపథ్యంలో ప్రభుత్వరంగ సంస్థల్లో పెద్ద ఎత్తున ప్రైవేటు పెట్టుబడులు పెరిగాయి. దీనితో 'సంక్షేమ రాజ్య' స్థాపన లక్ష్యానికి గండిపడింది. సామాజిక సంక్షేమం సందిగ్ధంలో పడింది. ఫలితంగా సమాజ సంక్షేమం స్థానే మార్కెట్ ప్రయోజనాలే ముందుకొచ్చాయి. వరల్డ్ బ్యాంక్ విధానాలు స్థానిక ప్రభుత్వాలను సైతం దెబ్బతీశాయి.

ఈ నేపథ్యంలోనే నేడు దేశంలో 'విశ్వాసమే' ప్రధానం అనే భావనను సర్వసమ్మతి పేరున రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్ర్యాన్నీ భిన్న అభిప్రాయాలనూ, నేర పూరిత కుట్రగా చలామణీ చేస్తున్నాయి. భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో నేడు ఏకతా సూత్రాల దిశగా దేశాన్ని నడిపిస్తున్నారు. ఆహార నియమాల పట్ల కూడ ప్రత్యక్ష ఆంక్షలు తలెత్తుతున్నాయి. చట్ట ప్రకారం పరిపాలన కంటే విశ్వాసమే చట్టంగా పాటించాల్సిన పరిస్థితుల్లోకి ప్రజలు నెట్టబడుతున్నారు.

ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే దేశ వ్యతిరేకిగా, దేశద్రోహిగా కేసులు వస్తున్నాయి. ఎమర్జెన్సీ తరువాత వచ్చిన 42వ రాజ్యాంగ సవరణలో సుప్రీంకోర్టు భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని పార్లమెంట్ కూడా మార్చలేదని చెప్పిన తీర్పు స్పష్టంగానే ఉంది. రాజ్యాంగ బద్ధంగా పరిపాలిస్తామని రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వాళ్ళే 'విశ్వాసమే' ప్రధానం అనే భావజాలాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగ విలువల సాక్షిగా ప్రజలు తమ హక్కులకు, జీవితాలకు, రాజ్యాంగ రక్షణకు, తామే నిబద్ధులుగా వ్యవహరించాల్సిన, కాపాడుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. భారతదేశంలో 'చట్టబద్ధ పాలన' (రూల్ ఆఫ్ లా) సజావుగా సాగాలంటే దేశ పౌరసమాజం ద్వారా మాత్రమే రూల్ ఆఫ్ లాను పొందగలరు.

– డా॥ నూతక్కి సతీష్, నాగార్జున విశ్వవిద్యాలయం డా॥ బి.ఆర్. అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ – రీసెర్చ్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ

# ప్రతి క్షణమూ మంచిదే!

కాల మహిమ తెలియరానిది. అంతా బాగానే జరుగుతూ వుందిలే అనుకుంటున్నంతలోనే ఊహించనిది జరిగి అంతా తారుమారవుతూండడం గమనిస్తాం. చెయ్యీ, కాలూ ఆడనంతగా ఒక్కొక్కపుడు పరిస్థితులలో మార్పులు వస్తాయి. ఎంత ఆలోచించినా కారణం అవగతం కాదు. దైవానుగ్రహం లేదు కాబోలు అన్న ఒక్క సమాధానం తప్ప మరోటి మనసుకు తట్టదు. అలాంటప్పుడే 'అయ్యో ఆలస్యం చేశామే!' అన్న ఆలోచన మనసులో ప్రవేశిస్తుంది. కలిసిరాని కాలం కొనసాగే కొలదీ ఈ ఆలోచన మనసులో పదే పదే మెదులుతూ మరింతగా బాధ




పెడుతుంది. చేయాల్సిన పనులను సత్వరం చేయడం, మంచి పనులు చేయడంలో జాప్యం జరగకుండా చూసుకోవడం ఎంతో ముఖ్యం అన్న విషయాన్ని పెద్దలు చెప్పడంలోని ఆంతర్యాన్ని బద్దెన పేరుతో ప్రసిద్ధుడైన భద్రభూపాలుడు రచించిన 'నీతిశాస్త్ర ముక్తావళి' గ్రంథంలోని ఈ చంపకమాల వృత్తంలోని పద్యం విశదీకరిస్తుంది.

**సిరిగలనాడె మేన దనజీవము గల్గిననాడె కాలముం**
**దిరుగనినాడె తేజ మెదద్రెవ్వనినాడె యనేక దుస్థితుల్**
**పొరయనినాడె మానవులు బుద్ధి దలంచి పరోపకారముల్**
**తిరముగ జేయుటొప్పు నది తీరిన జేయ విధాత శక్యమే!**

'పుష్కలంగా డబ్బు చేతనున్నప్పుడే, శరీరంలో ప్రాణం కుదురుగా ఉన్నప్పుడే, కాలం తాను తలచినట్లుగా జరుగుతున్నప్పుడే, అనేకానేక కష్టాలు చుట్టుముట్టి బ్రతుకును అతలాకుతలం చేయకుండా ఉన్నప్పుడే బుద్ధి కలిగిన మనిషి తాను చేయగలిగిన సహాయం సాటివానికి అవసరంలో చేయడం సరైనది. పరిస్థితులలో ఆ అనుకూలత తీరిన తరువాత చేయాలని సంకల్పించినా అలా చేయగలగడం విధాత వల్ల కూడా అయ్యే పని కాదు సుమా!' అని భావం. మంచిపని చేయడానికి మీనమేషాలు లెక్కిస్తూ కూర్చోవాల్సిన పని లేదు. అందుకు మంచి రోజు అంటూ ఏదీ ఉండదు. మానవ జీవితంలోని ప్రతి క్షణమూ మంచి పని చేయడానికి భగవంతుడి చేత ఉద్దేశించబడినదిగానే భావించి సాధ్యమైనంతలో ఆచరణలో పెట్టడం వివేకవంతుడి లక్షణం.

– భట్టు వెంకట రావు

## తమిళనాడు ఎల్‌ఏసీ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

- హాజరైన టీటీడీ చైర్మన్ భూమన


టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డితో కొత్త సభ్యులు

సాక్షి, చెన్నై: తమిళనాడు, పుదుచ్చేరి టీటీడీ స్థానిక సలహా కమిటీ (ఎల్‌ఏసీ) సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం చెన్నైలో జరిగింది. చెన్నై టీనగర్ వెంకటనారాయణ రోడ్డులోని తిరుమల శ్రీవారి ఆలయం సమాచార కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి హాజరయ్యారు. తమిళనాడు, పుదుచ్చేరిలోని టీటీడీ ఆలయాల నిర్వహణ స్థానిక సలహా మండలి నేతృత్వంలో జరుగుతున్నాయి. ఈ కమిటీకి చైర్మన్‌గా ఏజే శేఖర్ ఇప్పటికే నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో గత నెల 44 మంది సభ్యులను నియమిస్తూ టీటీడీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నలుగురు ఉపాధ్యక్షులు కాగా, మిగిలిన వారు సభ్యులుగా ఉన్నారు. గురువారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో 36 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ఎనిమిది మంది తదుపరి రోజులలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## రూ.3.61 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు స్వాధీనం

**కేసు నమోదు చేసిన కేంద్ర జీఎస్టీ అధికారులు**


గుంటూరు సీజీఎస్టీ అధికారులు స్వాధీనం చేసుకున్న విదేశీ సిగరెట్లు

సాక్షి, అమరావతి: అక్రమంగా రవాణా చేస్తున్న రూ.3.61కోట్ల విలువైన 72.30లక్షల విదేశీ సిగరెట్లను కేంద్ర జీఎస్టీ(సీజీఎస్టీ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గుంటూరు సీజీఎస్టీ కమిషనరేట్ అధికారులు ఈ నెల 5, 6 తేదీల్లో కోల్‌కత్తా–చెన్నై జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. నెల్లూరు సమీపంలో 33.30 లక్షల విదేశీ సిగరెట్లను తరలిస్తున్న ఓ వాహనాన్ని, బాపట్ల జిల్లా సంతమాగులూరు సమీపంలో 39 లక్షల విదేశీ సిగరెట్లను తరలిస్తున్న మరో వాహనాన్ని గుర్తించారు. ఆ విదేశీ సిగరెట్ల ప్యాకెట్లపై తయారీ కంపెనీ వివరాలు, ఎక్స్పైరీ తేదీ, ఇతర వివరాలు ఏవీ లేవు. వాటిని తరలిస్తున్న వాహనాల డ్రైవర్లు ఆ విదేశీ సిగరెట్లను దిగుమతి చేసుకున్నట్టు తగిన పత్రాలు గానీ పన్ను చెల్లించిన రశీదులను గానీ చూపించలేకపోయారు. దాంతో మొత్తం రూ.3.61కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను కస్టమ్స్ అధికారులు జప్తు చేసి కేసు నమోదు చేశారు. గుంటూరు సీజీఎస్టీ కమిషనరేట్ అధికారులు మూడు నెలల్లో అక్రమంగా రవాణా చేస్తున్న రూ.4.88కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.

## చెన్నైలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఏరియల్ సర్వే


హెలికాప్టర్ నుంచి ఏరియల్ సర్వే చేస్తున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్

సాక్షి, చెన్నై: ప్రధాని మోదీ ఆదేశాల మేరకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గురువారం హెలికాప్టర్‌లో చెన్నై నగరంతో పాటు శివారు జిల్లాల్లోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో తమిళనాడు సీఎం స్టాలిన్, ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. వరద సహాయక చర్యల కోసం రూ.450 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. చెన్నైలో వరద శాశ్వత నివారణ పథకం అమలు కోసం రూ.561 కోట్లు కేటాయించాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. కాగా, ఆవడి, తాంబరం కార్పొరేషన్‌తో పాటు ఉత్తర చెన్నై పరిధిలోని కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన చోట్ల వరద నీటిని అధికారులు తొలగించారు. చెన్నై సాధారణ స్థితికి చేరుకోవడంతో గురువారం నుంచి నగరంలోని అన్ని కార్యాలయాలు తెరచుకున్నాయి.

## 'బాబు అండ్ కో సర్దుకోవాల్సిందే'

తాడికొండ: కులోన్మాదంతో కొట్టుమిట్టాడుతున్న బాబు అండ్ కో రాజకీయాలకు కాలం చెల్లిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,166వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. ఏపీలో ఓ సామాజికవర్గం అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చేందుకు తీవ్ర యత్నాలు చేస్తుందని, వారి ఆగడాలు సాగనిచ్చేది లేదన్నారు. రాజధాని పేరుతో కులవాదులకు దోచిపెట్టేందుకు బాబు చేసిన దోపిడీ ప్రపంచమే నివ్వెరపోయేలా జరిగిందన్నారు. గ్రాఫిక్స్ డిజైన్లతో తాత్కాలిక భవనాలు నిర్మించి రియల్ ఎస్టేట్ వ్యాపారంతో బాబు అండ్ కో రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారని చెప్పారు. నేడు రాజధాని ప్రాంతంలో రైతులు, రైతు కూలీలకు చేసేందుకు వ్యవసాయం లేక, పనుల్లేక పక్క ప్రాంతాలకు వలస వెళుతున్నారంటే బాబు చేసిన తప్పిదాల వల్ల కాదా అని ప్రశ్నించారు.

## కేవీకే దత్తత రైతుకు మిలియనీర్ ఫార్మర్ అవార్డు


న్యూఢిల్లీలో మిలియనీర్ ఫార్మర్ అవార్డు అందుకుంటున్న రైతు జగదీష్ రెడ్డి

కలికిరి: అన్నమయ్య జిల్లా కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) పరిధిలోని చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలం దండువారిపల్లి గ్రామానికి చెందిన దత్తత రైతు వై.జగదీష్ రెడ్డికి మిలియనీర్ ఫార్మర్ అవార్డు లభించింది. న్యూఢిల్లీకి చెందిన భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ, కృషి జాగరణ్ సంస్థలు సేంద్రియ వ్యవసాయం విభాగంలో ఈ అవార్డును బుధవారం ఢిల్లీలో అందజేశాయి. వేరుశనగ, వరి, వివిధ రకాల పంటలు సేంద్రియ పద్ధతిలో సాగు చేసి అధిక లాభాలు సాధించినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డును గుజరాత్ రాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవ్‌వ్రత్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సదాశివ, నీతి ఆయోగ్ అధికారి నీలం పటేల్ తదితరుల నుంచి జగదీష్‌రెడ్డి అందుకున్నట్లు కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు.

## భూతాపం తగ్గించడంలో పరిశోధకుల పాత్ర కీలకం


జాతీయ సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, పరిశోధకులు

**వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్**

వైవీయూ: భూతాపం తగ్గించడంలో పరిశోధకుల పాత్ర కీలకమని యోగివేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) వీసీ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. వైవీయూ, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ రీసోర్స్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్–2023' పేరుతో రెండురోజుల జాతీయ సదస్సు కడపలోని వైవీయూలో గురువారం ప్రారంభమైంది. తొలుత అతిథులు మొక్కలకు నీరు పోసి సదస్సును ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ సుధాకర్ మాట్లాడుతూ మానవాళి సుస్థిర భవిష్యత్‌లో సంప్రదాయేతర ఇంధన వనరులు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. కర్బన ఉద్గారాలను తగ్గించుకుంటూ, సౌరవిద్యుత్, పవనశక్తి, జీవ ఇంధనాల వినియోగాన్ని పెంచుకుంటే భవిష్యత్ తరాలకు మంచి చేసిన వారవుతామన్నారు. విశిష్ట అతిథిగా వచ్చిన వైవీయూ పూర్వపు వైస్ చాన్సలర్ ఆచార్య అత్తిపల్లి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పునరుత్పాదక ఇంధన వనరులపై పరిశోధనలు నిర్వహించాలని సూచించారు. భారత సంప్రదాయేతర ఇంధన వనరుల మంత్రిత్వశాఖ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ నౌని మాట్లాడుతూ హరిత హైడ్రోజన్‌పై పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జీవ ఇంధనాల ఆధారిత వనరుల వినియోగం పెంచగలిగితే మానవాళి సుస్థిర భవిష్యత్తు సాధ్యమవుతుందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, సదస్సు కన్వీనర్ ఆచార్య పి.ఎస్.షావల్లీఖాన్ ప్రసంగించారు. అతిథులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ విశ్వవిద్యాలయాల పరిశోధకులు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డలను కాపాడిన సచివాలయ సిబ్బంది



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): తుపాను సమయంలో గాలివానలో చిక్కుకుని ఎటూ వెళ్లలేక సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో చలిగాలికి వణుకుతూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న ఓ తల్లి, ఇద్దరు బిడ్డలను సచివాలయ సిబ్బంది కాపాడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిట్టమూరు మండలం కుమ్మరిపాళెంకు చెందిన నందిని తుపాను ముందు కాన్పు కోసం చెన్నై వెళ్లింది. అక్కడ పండంటి మగ శిశువుకు జన్మనిచ్చి తిరిగి సొంత గ్రామానికి వెళ్లే క్రమంలో తుపాను కారణంగా సూళ్లూరుపేట బస్టాండ్‌లో చిక్కుకుపోయింది. ఆమె తల్లిదండ్రులు సూళ్లూరుపేట పట్టణంలోనే ఉన్నప్పటికీ ఫోన్ కమ్యూనికేషన్ లేకపోవడంతో బస్టాండ్‌లోనే చలికి వణుకుతూ ఉండిపోయింది. అంత గాలివానలో బిడ్డను రక్షించుకునేందుకు ఆమె పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. అయితే సచివాలయ సిబ్బంది పట్టణంలో తిరుగుతున్న సమయంలో బస్టాండ్ సెంటర్‌లో రోజుల బిడ్డను పొట్టకు కట్టుకుని గజగజ వణుకుతూ కనిపించడంతో వివరాలు అడిగారు. ఆమె జరిగిన విషయమంతా చెప్పడంతో వెంటనే ఆమెను బిడ్డలతో సహా అక్కడి నుంచి చెంగాళమ్మ ఆలయంలోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి కాపాడారు. వర్షాలు తగ్గడంతో ఆమెను బిడ్డలతో సహా కుమ్మరిపాళెంకు పంపించారు.

## 30న ఏయూ స్నాతకోత్సవం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం 91, 92వ సంయుక్త స్నాతకోత్సవం ఈ నెల 30వ తేదీన జరగనుంది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు మధ్యాహ్నం 1.30 నుంచి ప్రాంగణానికి చేరుకుని తమకు కేటాయించిన సీట్లలో ఆసీనులు కావాల్సి ఉంటుంది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి తేదీ ఖరారు చేస్తూ అధికారికంగా లేఖ ఏయూకు చేరింది.

# గుర్రపుడెక్క గుబులు

- మిచాంగ్ తుపానుతో భారీగా కొల్లేరుకు నీరు
- పెదఎడ్లగాడి వంతెన ఖానాలకు అడ్డుగా డెక్క
- వంతెన వద్ద 7 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఇటీవల రూ.8 లక్షలతో డెక్క తొలగింపు
- ఎగువ గ్రామాలకు ముంపు భయం


ఎదఎడ్లగాడి వంతెన వద్ద భారీగా పెరుకుపోయిన గుర్రపుడెక్క

కైకలూరు: గుర్రపుడెక్క కొల్లేరు గ్రామాలకు గుదిబండగా మారుతోంది. మిచాంగ్ తుపానుతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా కొల్లేరుకు వర్షపు నీరు వచ్చి చేరుతోంది. ఇప్పటికే కొల్లేరు నిండుకుండలా కనిపిస్తోంది. అయితే కొల్లేరుకు చేరిన నీటిని సముద్రానికి చేరవేసే ఏకైక మార్గమైన పెదఎడ్లగాడి వంతెన ఖానాలకు గుర్రపుడెక్క అవరోధంగా మారింది. సాధారణంగా వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత కొల్లేరుకు వరద పెరుగుతోంది. ఇప్పటికే పెదఎడ్లగాడి వద్ద 7 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. గతేడాది ఆగస్టులో వచ్చిన వరదలకు వంతెన వద్ద 7.2 అడుగుల నీటి మట్టానికి దిగువన పెనుమాలంక గ్రామ రోడ్డు వరద నీటిలో చిక్కుకుంది.

### 67 డ్రెయిన్లు.. 1.10 లక్షల క్యూసెక్కులు

భారీ వరదల సమయంలో కొల్లేరుకు చేరుతోన్నా నీటి ప్రవాహానికి గుర్రపుడెక్క పెద్ద అడ్డగోడగా మారుతోంది. వరదల సమయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 67 డ్రెయిన్ల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల నీరు కొల్లేరుకు చేరుతోంది. నీరంతా కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం పెదఎడ్లగాడి, పోల్‌రాజ్ కాలువల ద్వారా కై కలూరు మండలం ఆలపాడు శివారు ఉప్పుటేరు మీదుగా సముద్రంలోకి కలుస్తోంది. వాస్తవానికి కొల్లేరులో నీటిమట్టం 7 అడుగులు ఉంటే 15 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండాలని నిపుణులు సూచించారు. కొల్లేరుకు చేరుతున్న 1.10 లక్షల క్యూసెక్కుల నీటిలో కేవలం 10 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే దిగువకు చేరుతోంది.

### వదలని గుర్రపుడెక్క సమస్య

ఫోంటెడెరియా క్రాసిప్స్ అనే జాతికి చెందిన గుర్రపుడెక్కను బెంగాల్ టెర్రగా అభివర్ణిస్తారు. ఇవి సునాయాశంగా పెరుగుతాయి. కొల్లేరులోకి బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు, చంద్రయ్య, వల్లూరు, గుండేరు, దోసపాడు, మొండుకోడు, ఏలూరు కాల్వ, ఎస్నేపుల, పందికోడు, పోల్‌రాజ్, కైకలూరు శ్యాంప్ వంటి 67 మేజర్, మైనర్ డ్రెయిన్లు, కాల్వల ద్వారా నీరు చేరుతోంది. నీటి ద్వారా గుర్రపుడెక్క కొట్టుకొస్తోంది. ఇవి కొల్లేరుకు చేరే నీటిని సముద్రానికి పంపించే పెదఎడ్లగాడి వంతెన ఖానాలకు అడ్డుపడుతున్నాయి. ప్రస్తుతం పెదఎడ్లగాడి వంతెన 56 ఖానాల వద్ద గుర్రపుడెక్క పేరుకుపోయి ఉంది. దీంతో నీటి ప్రవాహం కిందకు వెళ్లడం లేదు. ఇదిలా ఉంటే కొల్లేరులో అక్రమ చేపల చెరువుల గట్లు కూడా నీటి ప్రవాహానికి అడ్డువస్తున్నాయి.

### డెక్కను తొలగిస్తాం

పెదఎడ్లగాడి వంతెన వద్ద ఈ ఏడాది రూ.8 లక్షలతో మనుషుల సాయంతో గుర్రపుడెక్కను తొలగించాం. ఏటా ప్రధాన సమస్యగా ఇది మారుతోంది. ఎగువ నుంచి భారీగా డెక్క వస్తోంది. నీటి ప్రవాహ వేగం తగ్గడంతో సమీప గ్రామాల రహదారులు ముంపుబారిన పడుతున్నాయి. ప్రస్తుతం అడ్డుగా మారిన గుర్రపుడెక్కను తొలగింపు చర్యలు చేపడతాం.

–ఇందిరా, డ్రెయినేజీశాఖ, జేఈఈ, కైకలూరు

### ఛానలైజేషన్ పరిష్కార మార్గం

కొల్లేరులో వివిధ మార్గాలను ఛానలైజేషన్ చేసి నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించాలని పలు కమిటీలు సూచించాయి. పెదఎడ్లగాడి నుంచి ఉప్పుటేరు వరకు ఛానలైజేషన్ చేయాలని 1895లో ఇరిగేషన్ ఎస్ఈ హుస్సేన్, 1964లో మిత్రా కమిటీ, 1986లో శ్రీరామకృష్ణయ్య కమిటీలు సూచనలు చేశాయి. కొల్లేరు సరస్సుకు 9 లక్షల ఎకరాల మెట్ట ప్రాంతాల నుంచి, మూడున్నర లక్షల ఎకరాల మాగాణి నుంచి నీరు చేరుతోంది. మొత్తంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 12 మండలాల పరిధిలో 2,22,300 ఎకరాల విస్తీర్ణంలో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. అధికారులు సరైన ప్రణాళికతో కొల్లేరు అధునికీకరణ పనులు చేపట్టాలని కొల్లేరు పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

**గతం**

తుపాను వస్తే ముందు ప్రభావితమై ఇబ్బంది కలిగించేది విద్యుత్ సరఫరా. బలమైన ఈదురు గాలులకు ఎక్కడికక్కడే వైర్లు తెగిపోతాయి. కొన్నిచోట్ల స్తంభాలు కూలిపోతాయి. ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరుగుతాయి. ప్రకృతి విపత్తు ఎదురైన ప్రతి సందర్భంలోనూ జరిగే సాధారణ పరిణామం ఇది. తుపాను కదా.. కరెంటు ఇంత తొందరగా రాదని ప్రజలూ సర్దుకుపోయేవారు. ఇదంతా గతం.

**నేడు**

తుపాను వస్తోంది. బలమైన గాలులూ వీస్తున్నాయి. దీంతో విద్యుత్ లైన్లు చాలాచోట్ల తెగి పడిపోతున్నాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బ తింటున్నాయి. నిన్నటి మిచాంగ్ తుపాను సందర్భంలోనూ ఈ పరిస్థితులు ఎదురయ్యాయి. అయితే విద్యుత్ సరఫరా నిలిచిపోయినా సాధ్యమైనంత తక్కువ సమయంలోనే ఆ శాఖ అధికారులు పునరుద్ధరించగలిగారు. ఈదురు గాలులు వీచినచోట కూడా గంటల్లోనే సరఫరా ఇవ్వగలిగారు.

# వాయువేగంతో వెలుగులు


కొత్తపేటలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది

- తుపాను వేళ విద్యుత్ శాఖ అప్రమత్తం
- తీవ్ర గాలులకు నేలకొరిగిన స్తంభాలు
- కొన్నిచోట్ల దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు
- 1,340 గ్రామాల్లో నెలకొన్న అంధకారం
- యుద్ధప్రాతిపదికన పని చేసిన ఈపీడీసీఎల్
- గంటల వ్యవధిలోనే సరఫరా పునరుద్ధరణ

| నష్టం జరిగినవి | తూర్పుగోదావరి | కాకినాడ | కోనసీమ |
|---|---|---|---|
| 33 కేవీ ఫీడర్లు | 46 | 14 | 24 |
| 11 కేవీ ఫీడర్లు | 238 | 118 | 178 |
| 33/11 కేవీ సబ్ స్టేషన్లు | 46 | 26 | 28 |
| 33 కేవీ స్తంభాలు | 14 | 2 | 0 |
| 11 కేవీ స్తంభాలు | 107 | 88 | 72 |
| ఎల్‌టీ స్తంభాలు | 66 | 90 | 108 |
| ట్రాన్స్‌ఫార్మర్లు | 32 | 30 | 57 |
| నష్టం (రూ. లక్షలు) | 68.20 | 87.81 | 81.84 |

సాక్షి ప్రతినిధి, కాకినాడ: తుపాను వంటి ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు విద్యుత్ సరఫరా చాలా కీలకం. మిగిలిన అన్ని విభాగాల కంటే విద్యుత్ వ్యవస్థ అప్రమత్తంగా పని చేయకుంటే తీరని ప్రాణ నష్టం సంభవిస్తుంది. ఎక్కువ ఇబ్బందులను కలిగిస్తుంది. అటువంటిది మిచాంగ్ తుపాను సంకేతాలు రాగానే ప్రభుత్వం ముందుగానే అన్ని కోణాల్లో అప్రమత్తమైంది. ఎక్కువగా ప్రభావితమయ్యే విద్యుత్ రంగంపై ఎక్కువ ఫోకస్ పెట్టింది. ఫలితంగా ఎక్కడా ప్రాణ నష్టం సంభవించలేదు. ప్రభుత్వ ఆదేశాలతో ఏపీ ఈపీడీసీఎల్ ముందుగానే మేల్కొని అహరహం శ్రమించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలను నియమించింది. 24 గంటలూ పని చేసేలా చూసింది. కరెంటు సమస్యలు ఎదురైన చోట వెనువెంటనే స్పందించింది. త్వరితగతిన సరఫరాను పునరుద్ధరించింది.

### వందల గ్రామాల్లో చీకట్లు

విద్యుత్ సరఫరాలో అత్యంత కీలకమైన 11 కేవీ ఫీడర్లు, 11 కేవీ లైన్లు, 11/33 కేవీ లైన్లు, సబ్ స్టేషన్లు, విద్యుత్ స్తంభాలు వందల సంఖ్యలో భారీ గాలులకు దెబ్బ తిన్నాయి. దీంతో, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని వందల గ్రామాలు, పట్టణాల్లో సోమవారం రాత్రి నుంచి చీకట్లు అలముకున్నాయి. ఈదురు గాలులు, ఎడతెరిపి లేని వర్షాలకు విద్యుత్ సరఫరా జరిగితే ఆస్తి నష్టం కంటే ప్రాణ నష్టం ఎక్కువగా ఉంటుందని అంచనా వేసిన ఏపీ ఈపీడీసీఎల్ యంత్రాంగం ముందుగానే అప్రమత్తమైంది. మెజార్టీ తీర ప్రాంత గ్రామాల్లో ముందు జాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపివేసింది. ఇటువంటి గ్రామాలు కోనసీమ జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మెట్ట ప్రాంతాల్లో మాత్రం తుపాను ప్రభావంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.


తొండంగిలో క్రేన్‌సహాయంతో విద్యుత్‌స్తంభాన్నిపునరుద్ధరిస్తున్న దృశ్యం


### గతంలో అయోమయం

గత ప్రభుత్వాల హయాంలో తుపానులు, వరదలు వస్తే అసలు విద్యుత్ సరఫరా ఎన్ని రోజులకు పునరుద్ధరిస్తారో తెలియని అయోమయ పరిస్థితులు ఉండేవి. కోనసీమలోని లంక గ్రామాల్లో మరీ దారుణంగా ఉండేది. రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. అయినా నాటి పాలకులు ఈ సమస్యను పెద్దగా పట్టించుకునేవారు కాదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరించింది. తుపాను తీరం దాటాక మంగళవారం సాయంత్రం నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. బలమైన ఈదురు గాలులు వీచాయి. కొన్నిచోట్ల అనూహ్యంగా సుడిగాలులు విధ్వంసం సృష్టించాయి. ఈ ప్రభావంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎల్‌టీ, కేవీ లైన్లతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలో 300 వరకూ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రూ.2.37 కోట్ల మేర నష్టం జరిగినట్టు ఈపీడీసీఎల్ అధికారులు నిర్ధారణకు వచ్చారు.

### ఆగమేఘాలపై చర్యలు

నష్టం మాటెలా ఉన్నా గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా చీకట్లు అలముకున్న అన్ని ప్రాంతాలకూ ఏక కాలంలో యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ప్రభుత్వం ఆదేశించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అప్రమత్తం చేశారు. దీంతో దిగువ స్థాయిలో అధికారులు, సిబ్బంది మరింత స్పందించి పని చేశారు. ఈపీడీసీఎల్‌లో సీనియర్ ఇంజినీర్ల నుంచి లైన్‌మెన్ వరకూ 350 మంది 35 బృందాలుగా ఏర్పడి పని చేశారు. విద్యుత్ లైన్లు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాయి. రికార్డు స్థాయిలో చాలాచోట్ల గంటల వ్యవధిలోనే సరఫరా పునరుద్ధరించారు. బుధవారం రాత్రికే 90 శాతం ప్రాంతాలకు మళ్లీ కరెంటు ఇవ్వగలిగారు. ఈ రకంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 36 మండలాల్లోని 752 గ్రామాలు, పట్టణాల్లో మళ్లీ విద్యుత్ వెలుగులు ప్రసరించేలా చర్యలు తీసుకోగలిగారు. ముంపు బారిన పడిన వ్యవసాయ, ఆక్వా విద్యుత్ కనెక్షన్లను మాత్రమే పునరుద్ధరించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మున్నెన్నడూ ఇలా స్పందించి వెంటనే కరెంటు వచ్చింది లేదని రాజమహేంద్రవరానికి చెందిన వ్యాపారి వెంకట్రావు చెప్పారు.

### సమన్వయంతోనే పునరుద్ధరణ



దాదాపు అన్ని గ్రామాలు, పట్టణాల్లోనూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాం. ఎక్కడికక్కడ సిబ్బంది, అధికారులు సమన్వయంతో పని చేశారు. దీంతో 24 గంటల్లోనే సమస్యలను చక్కదిద్దాం. తుపాను హెచ్చరికలతో తీర ప్రాంత మండలాల్లో ముందుగా స్తంభాలు, విద్యుత్ లైన్లు, మెటీరియల్ సిద్ధం చేసుకున్నాం. స్తంభాలకు మనుషులు గోతులు తవ్వే అవసరం లేకుండా డ్రిల్లింగ్ మెషీన్లు ఏర్పాటు చేశాం. దీంతో పని మరింత వేగంగా జరిగింది. ప్రజలు కూడా పెద్ద ఎత్తున స్పందించి స్వచ్ఛందంగా సహకరించారు. అందువల్లే త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం సాధ్యమైంది. స్తంభాలు ఎక్కువగా దెబ్బ తిన్నాయి.

– పీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ, ఈపీడీసీఎల్

## కేజీబీవీ కార్యదర్శి దుక్కిపాటికి జాతీయ అవార్డు


ఢిల్లీలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నుంచి అవార్డు తీసుకుంటున్న మధుసూదనరావు

సాక్షి, అమరావతి: చదువులో వెనుకబడిన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల పెంపునకు విశేషంగా చేసిన కృషికి గాను కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ఏపీ కార్యదర్శి దుక్కిపాటి మధుసూదనరావుకు జాతీయ పురస్కారం లభించింది. ఇటీవల ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, భారత ప్రభుత్వ కార్యదర్శి సంజయ్ కుమార్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (నిపా, న్యూఢిల్లీ) ఆధ్వర్యంలో 2020–21, 2021–22 విద్యా సంవత్సరాల్లో చేపట్టిన 'విద్యా బోధనలో ఆవిష్కరణలు, ఉత్తమ అభ్యాసాలు' (బెస్ట్ ప్రాక్టీసెస్)కు ఈ అవార్డును ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా 40 మందిని ఎంపిక చేయగా, వారిలో కేజీబీవీ కార్యదర్శి ఒకరు కావడం విశేషం.

## 'రెస్టారెంట్' ఘటనపై 'రామ్‌రాజ్' విచారం


నాగరాజన్

తిరుపూర్: మహారాష్ట్ర రాజధాని ముంబైలోని వన్ఎయిట్ కమ్యూన్ రెస్టారెంట్‌లో జరిగిన ఘటనపై రామ్‌రాజ్ సంస్థ వ్యవస్థాపకుడు కేఆర్ నాగరాజన్ విచారం వ్యక్తం చేశారు. దక్షిణ భారత సంప్రదాయ దుస్తులైన ధోతీ ధరించినందుకుగాను రావణ్‌రామ్ అనే వ్యక్తిని లోపలికి పంపడానికి రెస్టారెంట్ సిబ్బంది నిరాకరించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై నాగరాజన్ స్పందిస్తూ..ఇటువంటి ధోరణి భారతీయుల మనోభావాలను దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. ఏ వ్యక్తికి అయినా తనకు నచ్చిన దుస్తులు వేసుకునే హక్కును రాజ్యాంగం కల్పించిందని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని, వ్యక్తుల ఇష్టాలను ఎవరైనా గౌరవించాలని..మళ్లీ ఇటువంటి ఘటనలు పురావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని రెస్టారెంట్ యాజమాన్యానికి ఆయన విజ్ఞప్తి చేస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# గిరిజన ప్రాంతాల్లో స్వీప్


## బీజేపీ విజయ రహస్యం ఇదే

ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారాన్ని నిలబెట్టుకుంటుందన్న పోల్ పండితుల అంచనాలను, ఎగ్జిట్ పోల్స్‌ను బీజేపీ తలకిందులు చేసింది. సునాయాసంగా మెజారిటీ మార్కు దాటేసి భూపేశ్ బఘేల్ సర్కారును గద్దె దించింది. ఐదు సంవత్సరాల విరామం అనంతరం తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకుగాను ఏకంగా 54 సీట్లు నెగ్గింది. రాష్ట్రంలో బీజేపీకి ఇదే అత్యధిక మెజారిటీ కావడం విశేషం. గిరిజన ప్రాంతాలైన సర్గుజా, బస్తర్‌లను ఏకపక్షంగా కొల్లగొట్టడమే బీజేపీ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది.

ఛత్తీస్‌గఢ్

## బస్తర్, సర్గుజాలో హవా

ఛత్తీస్‌గఢ్‌లో తాజాగా వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు షాకివ్వడం నిజమే అయినా బీజేపీని కూడా ఒకింత విస్మయపరిచాయనే చెప్పాలి. ఎందుకంటే బఘేల్ సర్కారు ఐదేళ్ల పాలనపై ప్రజల్లో ఎక్కడా పెద్దగా వ్యతిరేకత వ్యక్తం కాలేదు. అందుకు ప్రధానంగా ఆయన పక్కాగా అమలు చేసిన పలు సంక్షేమ, ప్రజాకర్షక పథకాలే కారణంగా నిలిచాయి. ముఖ్యంగా 2018లో రాష్ట్ర చరిత్రలోనే భారీ మెజారిటీతో అధికారంలోకి రాగానే బఘేల్ ప్రవేశపెట్టిన వరికి బోనస్ పథకం రాష్ట్రంలో సూపర్‌హిట్టయింది. వరికి దేశంలోనే అత్యధిక బోనస్ ఇస్తున్న రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ నిలిచింది. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకం ఫలాలు అందేలా బఘేల్ జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ నేపథ్యాన్ని బట్టి చూస్తే ఈసారి బీజేపీ గెలుపు అందరినీ ఆశ్చర్యపరిచిన పరిణామమే. గిరిజన ప్రాంతాల్లో అసెంబ్లీ స్థానాలన్నింటినీ ఈసారి బీజేపీ ఏకపక్షంగా ఒడిసిపట్టడమే దాని మెజారిటీకి ప్రధాన కారణంగా నిలిచింది. దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, ఉత్తరాదిన ఉన్న సర్గుజా రెండూ బీజేపీకి జైకొట్టాయి. బస్తర్‌లోని 12 స్థానాలకు గాను బీజేపీకి 9 స్థానాలు దఖలుపడ్డాయి. సర్గుజాలోనైతే మొత్తం 14 సీట్లను గాను బీజేపీ ఏకంగా 13 స్థానాలను దక్కించుకుంది. ఈ ప్రాంతం ఉప ముఖ్యమంత్రి టీఎస్ సింగ్‌దేవ్ కంచుకోట కావడం విశేషం. రాజవంశీకుడైన ఆయన 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ప్రభావంతో సర్గుజా ప్రాంతంలో కాంగ్రెస్ హవా కొనసాగింది. ఆనాడు 14 స్థానాలకుగాను కాంగ్రెస్‌కు 12 సీట్లు దక్కాయి. ఈసారి పరిస్థితి దాదాపుగా తారుమారవడం విశేషం. ఇక్కడ బీజేపీ హవా దెబ్బకు చివరికి సింగ్‌దేవ్ సైతం ఓటమి చవిచూశారు. బస్తర్‌లో మాత్రం 3 స్థానాలతో కాంగ్రెస్ ఉనికి నిలుపుకోగలిగింది.




**రాజధాని ప్రాంతంలో కాంగ్రెస్‌కు మొగ్గు**

గిరిజన ప్రాంతాలతో పోలిస్తే రాజధాని రాయ్‌పూర్ ప్రాంతంలో మాత్రం కాంగ్రెస్ మెరుగైన ప్రదర్శనే చేసింది.

ఇక్కడి 20 స్థానాల్లో ఆ పార్టీ 11 సీట్లు నెగ్గింది. బీజేపీకి 9 స్థానాలు దక్కాయి.

బిలాస్‌పూర్ ప్రాంతంలో బీజేపీ 13, కాంగ్రెస్ 10 చోట్ల గెలిచింది. పాలి తనఖర్‌లో గోండ్వానా గణతంత్ర పార్టీ గెలిచింది.

దుర్గ్ ప్రాంతంలోనూ 20 స్థానాలుండగా బీజేపీ, కాంగ్రెస్ చెరో పదింటిని గెలుచుకున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్



క్లాస్‌మేట్స్‌పై

## బుల్లెట్ల వర్షం

**రష్యాలో పాఠశాలలో టీనేజర్ దుశ్చర్య | ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు**

**మాస్కో:** ప్రశాంత రష్యాలోనూ కాల్పుల ఘటనలు నమోదవుతున్నాయి. గురువారం ఉదయం ఉక్రెయిన్, బెలారస్ దేశాల సరిహద్దులోని బ్రియాన్స్‌క్ నగరంలో ఓ పాఠశాల ఈ కాల్పుల ఘటనకు వేదికైంది. 14 ఏళ్ల టీనేజీ అమ్మాయి తన తండ్రి కొన్న షాట్‌గన్‌ను స్కూల్‌కు తీసుకొచ్చి తోటి క్లాస్‌మేట్స్‌పైకి ఎక్కుపెట్టి బుల్లెట్ల వర్షం కురిపించింది. ఈ ఘటనలో ఒక విద్యార్థి ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. స్కూల్‌లో వివక్షకు గురికావడం వల్లే అమ్మాయి ఇంతటి ఘాతుకానికి పాల్పడి ఉంటుందని రష్యా ఉప ఆరోగ్య శాఖ మంత్రి అలెక్సీ కుజ్‌నెట్సోవ్ అనుమానం వ్యక్తంచేశారు.

నెవెడా వర్సిటీలో

## కాల్పుల మోత

**లాస్ వెగాస్:** తుపాకీల సంస్కృతికి బుధవారం ఆరుగురు బలైన ఘటన మరువకముందే గురువారం మరో కాల్పుల ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. నెవెడా రాష్ట్రంలోని లాస్ వెగాస్ నగరంలోని యూనివర్సిటీ ఆఫ్ నెవెడాలో ఒక మాజీ అధ్యాపకుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు ఘటనాస్థలి చేరుకుని సాయుధుడైన అధ్యాపకుడిని హతమార్చారు. దాదాపు 60ఏళ్ల మాజీ ప్రొఫెసర్ జరిపిన కాల్పుల్లో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు పోలీస్ అధికారులకు స్వల్ప గాయాలయ్యాయి. యూనివర్సిటీ క్యాంపస్ సమీప ప్రాంతంలోనూ కాల్పులు వినిపించాయన్న సమాచారంతో దగ్గర్లోని హ్యారీ రెయిడ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కొద్దిసేపు మూసేశారు. ఈ ప్రొఫెసర్ గతంలో జార్జియా, ఉత్తర కరోలినాలో యూనివర్సిటీల్లో పాఠాలు చెప్పారు. ఇటీవల ఒక స్కూల్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోగా అది తిరస్కరణకు గురైంది.

కాల్పుల్లో గాయపడ్డ

## వనీ కన్నుమూత



**న్యూఢిల్లీ:** అక్టోబర్‌లో ఉగ్రవాది కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ మస్రూర్ అహ్మద్ వనీ(30) గురువారం ఆస్పత్రిలో కన్నుమూశారు. రిటైర్డు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కుమారుడైన వనీ అక్టోబర్ 29వ తేదీన శ్రీనగర్‌లోని ఈద్గా మైదానంలో స్థానిక యువకులతో కలిసి క్రికెట్ ఆడుతున్నారు. ఆ సమయంలో వనీపైకి ఓ ఉగ్రవాది అతి సమీపం నుంచి కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన వనీని సౌరాలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించడంతో బుధవారం విమానంలో ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తీసుకువచ్చారు. గురువారం వనీ తుదిశ్వాస విడిచినట్లు అధికారులు వెల్లడించారు.

భారీగా కట్నం డిమాండ్

## యువ డాక్టర్ ఆత్మహత్య



**తిరువనంతపురం:** తమ కుటుంబం తాహతుకు మించి బాయ్‌ఫ్రెండ్ భారీగా కట్నం డిమాండ్ చేయడం ..పెళ్లి ఆగిపోవడంతో కలత చెందిన ఓ యువ వైద్యురాలు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన కేరళలోని తిరువనంతపురంలో చోటుచేసుకుంది. డాక్టర్ షహానా(26) తిరువనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలోని సర్జరీ విభాగంలో పీజీ చేస్తున్నారు. షహానా తండ్రి రెండేళ్ల క్రితమే చనిపోయారు. తల్లి, సోదరుడితో ఆమె కలిసి ఉంటున్నారు. డాక్టర్ రువాయిస్ అనే వ్యక్తితో కొంతకాలంగా ఆమె ప్రేమలో ఉన్నారు. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. కానీ, రువాయిస్ కట్నంగా సుమారు కిలో బంగారం, 15 ఎకరాల భూమి, ఒక బీఎండబ్ల్యూ కారు కావాలని డిమాండ్ చేశాడని షహానా కుటుంబసభ్యులు ఆరోపించారు. అంత భారీగా ఇవ్వలేమని చెప్పడంతో రువాయిస్ కుటుంబం ఈ పెళ్లిని రద్దు చేసుకుంది. మనస్తాపం చెందిన షహానా ఆత్మహత్య చేసుకున్నారు. 'ప్రతి ఒక్కరికీ డబ్బు మాత్రమే కావాలి' అని రాసి ఉన్న సూసైట్ నోట్ ఆమె వద్ద లభ్యమైంది. పోలీసులు రువాయిస్‌ను అదుపులోకి తీసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

# మార్చిలో రష్యా ఎన్నికలు

**పుతిన్ 5వ విడత ఎన్నికకు మార్గం సుగమం**

**మాస్కో:** రష్యా అధ్యక్ష పదవికి ఎన్నికల తేదీ ఖరారైంది. 2024 మార్చి 17న ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనపై రష్యా ఎగువ సభ ఫెడరేషన్ కౌన్సిల్ గురువారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీంతో, అధికారికంగా ఎన్నికల ప్రచారం ప్రారంభమయినట్లేనని స్పీకర్ వలెంటినా మట్వియెంకో ప్రకటించారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన 71 ఏళ్ల వ్లాదిమిర్ పుతిన్ మరో విడత పోటీ చేస్తానంటూ అధికారికంగా ఇప్పటి వరకు ప్రకటించలేదు. ఎన్నికల తేదీ ఖరారైనందున, ఐదో సారీ ఆయన బరిలో ఉంటారని భావిస్తున్నారు. ఆరేళ్ల ఆయన పదవీ కాలం 2024లో ముగియాల్సి ఉంది. కానీ, పుతిన్ తీసుకువచ్చిన రాజ్యాంగ సంస్కరణల ప్రకారం 2024 తర్వాత మరో రెండు పర్యాయాలు అంటే 2036 వరకు అధికారంలో కొనసాగేందుకు వీలుంది. రాజకీయ అధికార యంత్రాంగంపై పూర్తి స్థాయిలో పట్టున్న పుతిన్ మార్చిలో జరిగే ఎన్నికల్లో మరో విడత ఎన్నిక కావడం తథ్యమని భావిస్తున్నారు. ఆయన ప్రత్యర్థులుగా భావిస్తున్న వారు జైళ్లలోనో, విదేశాల్లోనో ఉండిపోయారు. చాలా వరకు స్వతంత్ర మీడియా సంస్థలపై నిషేధాలు, నియంత్రణలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పుతిన్‌ను ఎదుర్కొనే వారెవరనే విషయం ఇంకా వెల్లడికాలేదు. అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దిగనున్నట్లు ఇప్పటి వరకు ప్రకటించిన ఇద్దరిలో, మాస్కో ప్రాంత మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడు బోరిస్ నదేజ్దిన్, జర్నలిస్ట్, లాయర్ అయిన యక్తెరినా దుంట్‌సోవా ఉన్నారు.



ఉక్రెయిన్‌తో ఏడాదికి పైగా కొనసాగుతున్న యుద్ధం, ప్రైవేట్ సైన్యాధిపతి యెవ్‌గెనీ ప్రిగోజిన్ విఫల తిరుగుబాటు వంటివి పుతిన్ ప్రజాదరణపై పెద్దగా ప్రభావం చూపుతున్న దాఖలాలు ఏవీ లేవని పరిశీలకులు అంటున్నారు. అధ్యక్ష పదవికి పోటీ చేయాలనుకునే వారు.. రష్యా దిగువ సభ డూమాలో గానీ కనీసం మూడో వంతు ప్రాంతీయ శాసనసభలలో ప్రాతినిధ్యం లేని పార్టీ ద్వారా 40 లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల నుంచి కనీసం లక్ష సంతకాలను సేకరించాలి. ఏ పార్టీకీ సంబంధం లేకుండా పోటీ చేసే వారికి కనీసం 40 లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల నుంచి 3 లక్షల సంతకాలు అవసరం. ఈ నిబంధనలు పుతిన్‌కు సైతం వర్తిస్తాయి. 2018లో స్వతంత్రుడిగా పోటీ చేసిన పుతిన్ తరఫున ప్రచారకర్తలు సంతకాలు సేకరించారు. 2012 ఎన్నికల్లో యునైటెడ్ రష్యా పార్టీ ఆయనను నామినేట్ చేసింది. దీంతో, సంతకాల సేకరణ అవసరం లేకుండాపోయింది.



బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలకు మోదీ అభివాదం

# సుపరిపాలనకు మారుపేరు బీజేపీ

- బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రజలు బీజేపీకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు
- తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో మా పార్టీ బలం పెరిగింది
- అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సక్సెస్ రేటు 56%, కాంగ్రెస్ సక్సెస్ రేటు 18%

**న్యూఢిల్లీ:** సుపరిపాలనకు బీజేపీ ఒక పర్యాయపదంగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గత కొన్ని దశాబ్దాల అసెంబ్లీ ఎన్నికల గణాంకాలను పరిశీలిస్తే ప్రజలు బీజేపీకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తేటతెల్లం అవుతోందని అన్నారు. అధికారాన్ని నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్, ఇతర పార్టీల కంటే బీజేపీ రికార్డు చాలా మెరుగ్గా ఉన్నట్లు గుర్తుచేశారు. గురువారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది ఏ ఒక్కరి ఘనత కాదని, బృంద స్ఫూర్తితో అందరూ కలిసి పనిచేయడం వల్లే చక్కటి ఫలితాలు వచ్చాయని అన్నారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో గెలిచామని, తెలంగాణ, మిజోరం రాష్ట్రల్లో బీజేపీ బలం పెరిగిందని పేర్కొన్నారు. సామాన్య ప్రజలతో వారికి సులువుగా అర్థమయ్యే భాషలోనే సంభాషించాలని బీజేపీ నేతలకు, కార్యకర్తలకు మోదీ సూచించారు. ఉదాహరణకు 'మోదీజీ కీ గ్యారంటీ' బదులు 'మోదీ కీ గ్యారంటీ' అనాలని చెప్పారు.

**ఇదిగో మా సక్సెస్ రేటు**

కాంగ్రెస్ పార్టీ వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పుడు 40 సార్లు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొందని, కానీ, ఏడుసార్లు మాత్రమే గెలిచిందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. కాంగ్రెస్ సక్సెస్ రేటు 18 శాతంగా ఉందన్నారు. బీజేపీ 39 సార్లు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొని 22 సార్లు నెగ్గిందని ఉద్ఘాటించారు. బీజేపీ సక్సెస్ రేటు 56 శాతమని వివరించారు. ఈ విషయంలో కాంగ్రెస్ కంటే ప్రాంతీయ పార్టీలే మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. ప్రాంతీయ పార్టీలు 36 సార్లు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొని, 18 సార్లు గెలిచాయని, 50 శాతం సక్సెస్ రేటు సాధించాయని వెల్లడించారు. దీన్నిబట్టి చూస్తే అధికారం అప్పగించే విషయంలో ప్రజలు బీజేపీకి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలను సమర్థవంతంగా నడిపించే శక్తి బీజేపీకి ఉందని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. తమ పార్టీ ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకత లేదని, సానుకూలత ఉందని వివరించారు. పార్టీలో తాను ఒక సాధారణ కార్యకర్తను మాత్రమేనని చెప్పారు.

**'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో పాల్గొనండి**

తన దృష్టిలో దేశంలో పేదలు, యువత, మహిళలు, రైతులు అనే నాలుగు పెద్ద కులాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఆయా కులాల సంక్షేమం కోసం కృషి చేయాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి ఉద్దేశించిన 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో పాల్గొనాలని పార్లమెంట్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పనితీరు పట్ల తమ కార్యకర్తలు సంతోషంగా ఉన్నారని బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

చైనా విదేశాంగ మంత్రి అదృశ్యం..

# హత్యా? ఆత్మహత్యా?

**వివాహేతర బంధమే క్విన్‌గాంగ్ మరణానికి కారణమన్న అంతర్జాతీయ మీడియా**

**వాషింగ్టన్:** ఒకప్పుడు అమెరికాలో చైనా రాయబారిగా పనిచేసి వెంటనే అత్యున్నత పదవి పొంది చైనా విదేశాంగ మంత్రిగా సేవలందించిన క్విన్ గాంగ్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారనే విషయంపై అంతర్జాతీయ మీడియా కొత్త అంశాలను మోసుకొచ్చింది. చివరిసారిగా జూన్ నెలలో కనిపించిన ఆయన ప్రస్తుతం జీవించి లేరని మీడియాలో వార్తలొచ్చాయి. ఆత్మహత్య చేసుకున్నారని కొన్ని పత్రికల్లో, చైనా ప్రభుత్వమే హింసించి చంపిందని మరి కొన్నింటిలో భిన్న కథనాలు వెలువడ్డాయి. ఈ ఏడాది జూన్‌లో చివరిసారిగా కనిపించి అప్పటి నుంచి కనిపించకుండా పోయిన క్విన్‌గాంగ్ ఉదంతం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. జూలై నెలలో బీజింగ్‌లోని మిలటరీ ఆస్పత్రిలో ఆయన కన్నుమూశారని చైనా ప్రభుత్వంలోని ఇద్దరు అత్యున్నత స్థాయి అధికారులు చెప్పినట్లు 'పొలిటికో' వార్తాసంస్థ ఒక కథనం వెలువరిచింది. క్విన్ అమెరికాలో చైనా రాయబారిగా కొనసాగిన కాలంలో ఆయన నెరిపిన ఒక వివాహేతర సంబంధమే ఈ అదృశ్యం ఘటనకు అసలు కారణమని గతంలో వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. ఈ విషయంలో చైనా ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తునకు ఆయన సహకరించారట. ''అమెరికా పౌరసత్వమున్న చైనా అధికారిక ఫీనిక్స్ టీవీ మహిళా రిపోర్టర్ ఫ్యూ గ్జియోషియాన్‌తో వివాహేతర సంబంధం కారణంగా చైనా జాతీయ భద్రత ప్రమాదంలో పడిందని జిన్‌పింగ్ సర్కార్ బలంగా నమ్మింది. ఆ మహిళ సరోగసీ పద్ధతిలో ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఇప్పుడా తల్లీబిడ్డల ఆచూకీ సైతం గల్లంతైంది. క్విన్‌గాంగ్ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని జిన్‌పింగ్ వెంటనే ఆయనను జూన్‌లో చైనా విదేశాంగ శాఖ మంత్రి పదవి నుంచి తొలగించారు. ఆయన స్థానంలో మాజీ దౌత్యవేత్త వాంగ్ యీను పదవిలో కూర్చోబెట్టారు'' అని ఆ కథనం పేర్కొంది. కేవలం ఆరునెలలు పదవిలో ఉన్న క్విన్ గాంగ్ ఆ తర్వాత కనిపించకుండా పోయారు. 2014–2018 కాలంలో దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌కు చీఫ్ ప్రోటోకాల్ ఆఫీసర్‌గా పనిచేసి క్విన్ ఆయనకు అత్యంత ఆప్తుడయ్యాడు. అందుకే అత్యంత నమ్మకస్తులకు మాత్రమే దక్కే 'అమెరికాలో చైనా రాయబారి' పదవిని క్విన్‌కు జిన్‌పింగ్ కట్టబెట్టారు.



చర్చా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వివేక్ రామస్వామి

# ఫాసిస్ట్, అవినీతి అనకొండ

**నిక్కీ హేలీపై వివేక్ రామస్వామి ఆరోపణలు**

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ పడడానికి భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి తీవ్రంగా శ్రమిస్తున్నారు. పార్టీలో తన ప్రత్యర్థి అయిన భారతీయ–అమెరికన్ నిక్కీ హేలీపై పైచేయి సాధించాలని చూస్తున్నారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం కోసం వివేక్ రామస్వామి, నిక్కీ హేలీతోపాటు ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్, న్యూజెర్సీ మాజీ గవర్నర్ క్రిస్ క్రిస్టీ పోటీ పడుతున్నారు. నలుగురు ఆశావహుల మధ్య నాలుగో విడత చర్చా కార్యక్రమం యూనివర్సిటీ ఆఫ్ అలబామాలో హాట్‌హాట్‌గా జరిగింది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరు కాలేదు. చర్చలో పాల్గొన్న నలుగురు నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. వివేక్ రామస్వామి దాదాపు అరగంటపాటు మాట్లాడారు. ప్రధానంగా నిక్కీ హేలీపై విరుచుకుపడ్డారు. ఆమె ఫాసిస్ట్, అవినీతి అనకొండ అని ధ్వజమెత్తారు. ఆరోపణలపై మీడియాకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. రీడ్ హాఫ్‌మాన్ అనే ధనవంతుడి నుంచి నిక్కీ, ఆమె కుటుంబ సభ్యులు 2.5 లక్షల డాలర్లు దండుకున్నారని ఆరోపించారు. అయితే, వివేక్ రామస్వామి చేసిన ఆరోపణలపై నిక్కీ హేలీ పెద్దగా స్పందించలేదు. చర్చా కార్యక్రమంలో మౌనంగా ఉండిపోయారు. ఆమెకు క్రిస్ క్రిస్టీ మద్దతుగా నిలిచారు. వివేక్ రామస్వామి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ నేత, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్‌పై ఎవరు పోటీకి దిగుతారన్నది ఆసక్తికరంగా మారింది.

## 2024లో ఇస్రో 10 కీలక ప్రయోగాలు

**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) వచ్చే ఏడాది 10 కీలక ప్రయోగాలు చేపట్టనుందని కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో వెల్లడించింది. ఇందులో ఆరు పీఎస్ఎల్‌వీ మిషన్లు, మూడు జీఎస్ఎల్‌వీ ప్రయోగాలు, ఒక లాంచ్ వెహికల్ మార్క్–3 వాణిజ్య ప్రయోగం ఉందని తెలియజేసింది. ఈ మేరకు సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ఇస్రో అభివృద్ధి చేసిన నూతన స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్(ఎస్ఎస్ఎల్‌వీ) ద్వారా ఒక ఉపగ్రహాన్ని ప్రయోగాత్మకంగా నింగిలోకి పంపించనున్నట్లు వివరించారు. ప్రతిష్టాత్మక గగన్‌యాన్ కార్యక్రమంలో భాగంగా కక్ష్య మాడ్యూల్‌ను నిర్ధారించుకొనేందుకు రెండు మానవ రహిత మిషన్లు చేపట్టాలని ఇస్రో భావిస్తోందని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

## స్వల్ప దూర అగ్ని-1 ప్రయోగ పరీక్ష సక్సెస్

**బాలాసోర్(ఒడిశా):** స్వల్ప దూరాలను ఛేదించగల, ప్రయోగ దశలో ఉన్న బాలిస్టిక్ క్షిపణి అగ్ని–1ను విజయవంతంగా పరీక్షించినట్లు భారత రక్షణ శాఖ గురువారం ప్రకటించింది. ఒడిశాలోని ఏపీజే అబ్దుల్ కలామ్ ద్వీపంలో ఈ పరీక్షకు వేదికైంది. 'అగ్ని–1 అద్భుతమైన సత్తా ఉన్న క్షిపణి వ్యవస్థ. ఇప్పుడు దీనిని స్వల్ప దూర లక్ష్యాలకు పరీక్షించి చూస్తున్నాం. గురువారం నాటి ప్రయోగంలో ఇది అన్ని క్షేత్రస్థాయి, సాంకేతిక పరామితులను అందుకుంది. రాడార్, టెలిమెట్రీ, ఎలక్ట్రో–ఆప్టికల్ సిస్టమ్ వంటి అన్ని ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా దీని పనితీరును పరిశీలించాం. రెండు నౌకల ద్వారా క్షిపణి ఖచ్చితత్వాన్ని పర్యవేక్షించాం. ఇది చక్కగా పనిచేస్తోంది'' అని రక్షణ శాఖ ఉన్నతాధికారి ఒకరు మీడియాతో చెప్పారు. ఈ రకం క్షిపణిని చివరిసారిగా జూన్ ఒకటో తేదీన ఇదే వేదికపై విజయవంతంగా పరీక్షించారు.

## కెనడా హిందీ సినిమా హాళ్లలో కలకలం

**టొరంటో:** కెనడాలోని గ్రేటర్ టొరంటో ప్రాంతంలో హిందీ సినిమాలను ప్రదర్శించే మూడు వేర్వేరు సినిమా హాళ్లలో కలకలం రేగింది. మాస్క్ ధరించిన వ్యక్తులు గుర్తు తెలియని రసాయనాన్ని స్ప్రే చేయడంతో ప్రేక్షకులు అసౌకర్యానికి గురయ్యారు. యార్క్‌లోని వౌఘన్ సినిమా కాంప్లెక్స్‌లో మంగళవారం రాత్రి 9.20 గంటల సమయంలో ఇలాంటి ఘటన ఒకటి చోటుచేసుకుంది. ఆ సమయంలో థియేటర్‌లో 200 మంది ఉన్నారు. స్ప్రే కారణంగా ప్రేక్షకుల్లో కొందరు దగ్గడం ప్రారంభించారు. శ్వాసలో ఇబ్బందికి గురయ్యారు. పోలీసులొచ్చేసరికే అనుమానితులు పరారయ్యారు. కొందరు బాధితులకు పోలీసులు చికిత్స చేయించారు. ఈ వారంలోనే ఇలాంటి ఘటనలే జరిగినట్లు పీల్, టొరంటోల్లోనూ జరిగినట్లు అక్కడి మీడియా పేర్కొంది. స్కార్‌బరో టౌన్ సెంటర్‌లోని థియేటర్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి దుర్వాసన వెదజల్లే బాంబును అమర్చినట్లు తమకు ఫోన్ కాల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. విద్వేషపూరిత నేరం సహా పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టామన్నారు. ఇందుకు సంబంధించి ఎవరినీ అరెస్ట్ చేయలేదని చెప్పారు.

# సహజీవనం ప్రమాదకరమైన జబ్బు

**బీజేపీ ఎంపీ ధరంబీర్ సింగ్ వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ:** సహజీవనం ప్రమాదకరమైన జబ్బు అని బీజేపీ ఎంపీ ధరంబీర్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ విధానాన్ని సమాజం నుంచి పూర్తి నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సహజీవన విధానానికి వ్యతిరేకంగా చట్టం తీసుకురావాలని కోరారు. లోక్‌సభలో గురువారం జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'పాశ్చాత్య దేశాల్లో సహజీవన సంబంధాలు సర్వసాధారణం. కానీ, ఈ చెడ్డ విధానం మన సమాజంలో వ్యాధి మాదిరిగా వేగంగా వ్యాప్తి చెందుతోంది. దీని పరిణామాలు భయంకరంగా ఉంటున్నాయి. ఢిల్లీలో చోటుచేసుకున్న శ్రద్ధావాకర్, అఫ్తాబ్ పూనావాలా లివ్–ఇన్ రిలేషన్ షిప్ ఎంతటి దారుణానికి దారి తీసిందో చూస్తున్నాం' అని గుర్తుచేశారు. వివాహాన్ని పవిత్ర బంధంగా భావించే మనదేశంలో విడాకుల శాతం 1.1 శాతం మాత్రమేనన్నారు. అదే అమెరికాలో విడాకుల శాతం 40 శాతం వరకు ఉంటోందన్నారు. ప్రేమ వివాహాల్లో విడాకుల శాతం ఎక్కువగా ఉంటోందని చెప్పారు. ఇలాంటి బంధాల విషయంలో ఇరువైపులా తల్లిదండ్రుల ఆమోదం తప్పనిసరి చేయాలని సూచించారు. సామాజిక, వ్యక్తిగత విలువలు, కుటుంబాల నేపథ్యాలను బట్టి పెళ్లిళ్లను పెద్దలు కుదర్చటం మన దేశంలో అనాదిగా వస్తోందని గుర్తు చేశారు. 'వసుధైవ కుటుంబకమ్ అనే తత్వానికి భారతీయ సంస్కృతి ప్రసిద్ధి. మిగతా దేశాలతో పోలిస్తే మన సామాజిక వ్యవస్థ భిన్నమైంది. భిన్నత్వంలో ఏకత్వమన్న భారతీయ భావనను యావత్తు ప్రపంచమే మెచ్చుకుంది' అని ఆయన తెలిపారు.

## 'మెఫ్తాల్' ఔషధ రియాక్షన్‌లతో జాగ్రత్త

**అడ్వైజరీ జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం**

**న్యూఢిల్లీ:** నెలసరి, రుమటాయిడ్ ఆర్థరైటిస్ సందర్భాల్లో సాధారణంగా వినియోగించే మెఫ్తాల్ ఔషధానికి సంబంధించిన ప్రతికూల ప్రభావా(రియాక్షన్)లను గమనించి, అప్రమత్తమవ్వాలని ఆరోగ్యరంగ వృత్తి నిపుణులు, వ్యాధిగ్రస్తులకు కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నవంబర్ 30వ తేదీన ఒక అడ్వైజరీని జారీ చేసింది. సాధారణంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్, మహిళల్లో నెలసరి సమయంలో సంభవించే డిస్‌మెనోరోయియా, నొప్పి, వాపు, జ్వరం, దంతాల నొప్పి వంటి చికిత్సలో మెఫెనమిక్ యాసిడ్ పెయిన్ కిల్లర్‌ను వినియోగిస్తుంటారు. ఈ పెయిన్ కిల్లర్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్(ఐపీసీ) తాజాగా ఔషధ భద్రత హెచ్చరికను జారీ చేసింది. ఫార్మకోవిజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా(పీవీపీఐ) వారి డేటాబేస్‌ను ప్రాథమికంగా విశ్లేషించగా కొత్త విషయాలు వెలుగుచూశాయి. ఈ ఔషధాన్ని వినియోగించిన సందర్భాల్లో ఇసినోఫిలియా, సిస్టెమిక్ సింప్టమ్స్(డ్రెస్) సిండ్రోమ్ వంటి డ్రగ్ రియాక్షన్‌లు కనిపించాయి. పెయిన్ కిల్లర్‌ను వాడిన సమయంలో ఏమైనా దుష్ప్రభావాలు కనబడితే వెంటనే పీవీపీఐ అధికారిక www. ipc.gov.in వెబ్‌సైట్ లేదా హెల్ప్‌లైన్ నంబర్ 1800–180–3024ను సంప్రదించవచ్చు.

## పలువురు మంత్రులకు అదనపు బాధ్యతలు

**న్యూఢిల్లీ:** ఇటీవలి ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన కేంద్ర మంత్రులు నరేంద్ర తోమర్, ప్రహ్లాద్ జోషి, రేణూకా సింగ్ సరూటా మంత్రి పదవులకు రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను రాష్ట్రపతి ద్రౌపదీ గురువారం ఆమోదించారు. వీరు నిర్వహిస్తున్న శాఖలను ఇతర మంత్రులకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర మంత్రి అర్జున్ ముండాకు వ్యవసాయ శాఖ అదనపు బాధ్యతలను అప్పగించారు. కేంద్ర మంత్రి శోభా కరంద్లాజెకు అదనంగా ఆహారశుద్ధి పరిశ్రమల శాఖను, సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌కు అదనంగా జల్‌శక్తి శాఖ బాధ్యతను అప్పగిస్తూ ద్రౌపదీ ముర్ము ఆదేశాలిచ్చారని రాష్ట్రపతి భవన్ తెలిపింది.

డానిష్ అలీపై అభ్యంతరకర వ్యాఖ్యలు..

## క్షమాపణ చెప్పిన బీజేపీ ఎంపీ బిధూరి

**న్యూఢిల్లీ:** బీఎస్పీ ఎంపీ డానిష్ అలీపై అభ్యంతరకర వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ రమేశ్ బిధూరి లోక్‌సభ ప్రివిలేజ్ కమిటీ ఎదుట క్షమాపణ చెప్పారు. కమిటీ విచారణకు ఇద్దరు ఎంపీలు హాజరయ్యారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సమయంలో చంద్రయాన్–3 మిషన్ విజయవంతంపై లోక్‌సభలో జరిగిన చర్చలో బిధూరి పాల్గొన్నారు. బీఎస్పీకి చెందిన డానిష్ అలీపై ఈ సందర్భంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన తెలిపాయి. బిధూరి వ్యాఖ్యలపై మంత్రి రాజ్‌నాథ్ సభలో విచారం వ్యక్తం చేశారు. బిధూరికి బీజేపీ చీఫ్ జేపీ నడ్డా సైతం నోటీసులు జారీ చేశారు. బిధూరిపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు ప్రతిపక్ష ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. మరో వైపు, బీజేపీ సభ్యులు కూడా ప్రధాని మోదీపై ఎంపీ డానిష్ అలీ అమర్యాదకరంగా వ్యాఖ్యలు చేశారంటూ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ప్రివిలేజ్ కమిటీ గురువారం జరిపిన విచారణకు ఎంపీలు డానిష్ అలీ, రమేశ్ బిధూరి వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేశ్ బిధూరి క్షమాపణ తెలిపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. డానిష్ అలీ మాత్రం ప్రధానిపై తానెలాంటి అమర్యాదకర వ్యాఖ్యలు చేయలేదని స్పష్టం చేసినట్లు సమాచారం.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



## పుళల్‌జైలుకు మంత్రి సెంథిల్

• ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్

సాక్షి,చెన్నై: మంత్రి సెంథిల్ బాలాజీ ఆస్పత్రి నుంచి గురువారం ఉదయం డిశ్చార్జ్ అయ్యారు. ఆయన్ని భారీ భద్రత నడుమ పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు. మనీ లాండరింగ్ కేసులో సెంథిల్ బాలాజీ అరెస్టయిన విషయం తెలిసిందే. గత నెల ఆయన అనారోగ్యం బారిన పడడాన్ని అస్త్రంగా చేసుకుని బెయిల్ ప్రయత్నాలను న్యాయవాదులు తీవ్రతరం చేశారు. కింది కోర్టు, హైకోర్టుల్లో బెయిల్ దక్కక పోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు సైతం బెయిల్ నిరాకరించింది. అదే సమయంలో ఆయన జుడీషియల్ కస్టడీ గడువును కింది కోర్టు పొడిగిస్తూ వచ్చింది. ఈ పరిస్థితుల్లో మూడు వారాలుగా ఓమందూరార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సెంథిల్ బాలాజీని ఉదయం డిశ్చార్జ్ చేశారు. ఆస్పత్రి నుంచి ప్రత్యేక వాహనంలో ఆయన్ని భారీ భద్రత నడుమ పుళల్ కేంద్ర కారాగారానికి తరలించారు.

## న్యూస్‌రీల్

### చెన్నైలో వైఎస్ జార్జిరెడ్డికి ఘన నివాళి



వైఎస్ జార్జిరెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ సేవాదళ్ వర్గాలు

సాక్షి, చెన్నై : దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరులు వైఎస్ జార్జిరెడ్డి 24వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం చెన్నైలో వైఎస్‌ఆర్ సీపీ సేవాదళ్ నేతృత్వంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సేవాదళ్ ఉపాధ్యక్షుడు జకీర్ హుస్సేన్, వైఎస్‌ఆర్‌సీపీ నేత శరవణన్ నేతృత్వంలో వ్యాసర్‌పాడిలోని డాన్‌బాస్కో స్కూల్ ఆవరణలోని వృద్ధాశ్రమంలో తొలుత ఈ కార్యక్రమాలు చేపట్టారు. జార్జిరెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పేరిట ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇక్కడి వృద్ధులు, అనాథలకు అన్నదానం చేశారు. అనంతరం అంబత్తూరు సమీపంలోని టెండర్ కేర్ ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు జరిగాయి. ఇక్కడ వృద్ధులకు మధ్యాహ్నం బిర్యాని పంపిణీ చేశారు. బ్రెడ్లు, బిస్కెట్లు, బెడ్‌షీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ సేవాదళ్ నాయకులు శరవణన్, మణివన్నన్, భాస్కర్, కృతికా, చిన్నా, బాలాజీ, ఆనంద్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సేవాదళ్ నిర్వాహకులు

### కోయంబేడు మార్కెట్‌లో భారీగా పెరిగిన పువ్వుల ధరలు

తిరువొత్తియూరు: తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షానికి కోయంబేడు మార్కెట్‌లో అన్ని రకాల పువ్వుల ధరలు భారీగా పడిపోయాయి. అప్పట్లో కిలో మల్లి, ఐస్ మల్లి రూ. 100, ముల్లై, జాతి మల్లి రూ. 50, కనకాంబరమ్ రూ. 40, అరళి రూ. 50, బంతిపూలు, సంపంగి, పనీర్ రోజ్, చాక్లెట్ రోజ్ రూ. 10కి విక్రయించారు. ఈక్రమంలో గురువారం ఉదయం కోయంబేడు మార్కెట్‌లో అన్ని పూల ధర పెరిగింది. ఈ మేరకు కిలో మల్లి రూ. 1,300, కనకాంబరం రూ. 1,000 విక్రయిస్తున్నారు. ఐస్ మల్లి రూ.900, ముల్లై, జాతి మల్లి రూ. 600, అరళి రూ. 200, చామంతి రూ. 60, సంపంగి రూ. 80, పన్నీర్ రోజ్ రూ. 70, చాక్లెట్ రోజ్ రూ. 80 చొప్పున విక్రయించారు.

### విజయకాంత్ డిశ్చార్జ్

సాక్షి, చెన్నై: డీఎండీకే అధినేత, సినీ నటుడు విజయకాంత్‌ను గురువారం రాత్రి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. విజయకాంత్ గత నెల 18వ తేదీ రాత్రి అనారోగ్యం బారిన పడ్డ విషయం తెలిసిందే. ఆయన్ని మనపాక్కంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. ఇక్కడ ఆయనకు తీవ్ర చికిత్స అందించారు. ఓ దశలో ఆయన ఆరోగ్యంపై అనుమానాలు, పుకార్లు వచ్చాయి. ఆయన పరిస్థితి విషమించినట్లు వదంతలు వచ్చాయి. ఐసీయూలో ఉంచి ఆయనకు చికిత్స అందిస్తుండటం, తరచూ శ్వాస సమస్య తలెత్తినట్లుగా, కృత్రిమ శ్వాసను అందిస్తున్నట్లుగా సమాచారం వెలువడింది. అదే సమయంలో గత బుధవారం వెలువడ్డ బులిటెన్ డీఎండీకే వర్గాలలో ఆందోళన రేకెత్తించాయి. ఆ తదుపరి విజయకాంత్ సతీమణి ప్రేమలత విజయకాంత్ విడుదల చేసిన వీడియోతో ఆందోళన సద్దుమణిగింది. ఈ పరిస్థితులలో గురువారం రాత్రి ఆస్పత్రి నుంచి ఆయన డిశ్చార్జ్ చేసినట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఆయన ఆరోగ్యం కుదట పడడంతో విరుగంబాక్కంలోని ఇంటికి వెళ్లారు.

### రేవంత్ రెడ్డికి స్టాలిన్ శుభాకాంక్షలు

సాక్షి, చెన్నై: తెలంగాణ ముఖ్యమంత్రిగా గురువారం ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయనతో ఫోన్‌లో మాట్లాడి అభినందించారు. ముఖ్యమంత్రిగా విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు.

### విద్యార్థి ఆత్మహత్య

తిరువొత్తియూరు: తూతుకుడి జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి తాను ఉంటున్న హాస్టల్ గదిలో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తూతుకుడి జిల్లా పశువందనై సమీపంలోని తెర్క్ సెవవాల్ పట్టి గ్రామానికి చెందిన కూలీ కార్మికుడు ఎట్టు రాజన్. ఇతని కుమారుడు శీను (19). ఇతను నెల్లై సమీపంలోని మేళతిటూరులో ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఏరో నాటికల్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం శీను తన గదిలో విషం తాగి స్పృహ తప్పి పడిపోయాడు. ఇది చూసిన సహచర విద్యార్థులు, హాస్టల్ వార్డును అతన్ని పాలై మురుగన్ కురిచి ప్రాంతంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిక్షించిన డాక్టర్లు అప్పటికే శీను మృతి చెందినట్లు తెలిపారు. మున్నీరుపల్లం పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



సహాయకాలను పంపిణీ చేస్తున్న సీఎం స్టాలిన్



వరద బాధితులను శిబిరాలకు తరలిస్తున్న సిబ్బంది



సైదాపేటలో బాధితులకు పాల ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న మంత్రి సుబ్రమణియన్



పెరియమేడులో వైద్య శిబిరం

# వరదల నియంత్రణకు శాశ్వత చర్యలు



రాజ్‌నాథ్ సింగ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న స్టాలిన్

**తమిళనాడు రాజధాని నగరం చెన్నైలో వరద నివారణకు శాశ్వత పథకం అమల్లోకి రానుంది. ఇందుకోసం కేంద్రం రూ. 561 కోట్లను కేటాయించింది. అలాగే మిచాంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న చెన్నై నగరం, శివారు జిల్లాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు రూ. 450 కోట్లను విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వరద బాధిత ప్రాంతాలను హెలికాప్టర్ ద్వారా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం ఏరియల్ సర్వే నిర్వహించారు. ఇక సచివాలయంలో సీఎం ఎంకే స్టాలిన్ అధికారులతో సమావేశమై సహాయ చర్యల వివరాలను తెలుసుకున్నారు.**

- కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- రూ. 561 కోట్ల నిధులు కేటాయింపు
- మిచాంగ్ సహాయక చర్యలకు తక్షణ సాయం రూ. 450 కోట్లు
- త్వరలో కేంద్ర బృందం రాక
- అన్ని విధాలుగా ఆదుకుంటాం: కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్
- చెన్నైలో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే
- సీఎం స్టాలిన్‌తో కలిసి సమీక్ష


సాక్షి, చెన్నై: మిచాంగ్ తుపాను ప్రభావంతో చెన్నైలో వరుణుడు విలయతాండవం చేసి గురువారంతో నాలుగు రోజులు పూర్తయ్యింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఉరుకులు పరుగులు తీసి చెన్నై నగరం పరిధిలో నీటిని తొలగించి సాధారణ పరిస్థితి తీసుకొచ్చారు. ఆవడి, తాంబరం కార్పొరేషన్ పరిధిలలోని ప్రాంతాలు, ఉత్తర చెన్నై పరిధిలోని ప్రాంతాలను వరద నీటి తొలగింపు శ్రమగా మారింది. ఎట్టకేలకు యుద్ధ ప్రాతిపదికన ఆర్మీ, నేవీ, కోస్టుగార్డు, పోలీసులు, రెవెన్యూ తదితర విభాగాల సమన్వయంతో 80 శాతం మేర ప్రాంతాల్లో నీటిని తొలగించారు. వేళచ్చేరి, మడిపాక్కం, పళ్లికరణై, సెమ్మంజేరి , పెరుంగుడి, పెరుంబాక్కం, ముడిచ్చూర్, వరదరాజ పురం, భారతీ నగర్ పరిసరాల్లో అనేక వీధులు, కాలనీల్లో నీరు తొలగకపోవడంతో అక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడి 20 శాతం ప్రాంతాల్లో ఇంత వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించ లేదు. నీటిని పూర్తిగా తొలగించిన అనంతరం విద్యుత్‌ను సరఫరా అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. పూందమల్లి, కుండ్రత్తూరు, కొరట్టూరు, అంబత్తూరు పరిసరాల్లో అనేక వీధుల్లో నీరు నిల్వ ఉంటోంది. ఇక్కడ నీటి తొలగింపునకు తీవ్ర చర్యలు తీసుకుంటూ వస్తున్నారు. ఈ సమయంలో గురువారం ఉదయం అన్నానగర్, తిరుమంగళం, ఆవడి పరిసరాల్లో కాసేపు మోస్తరు వర్షం పడడంతో మళ్లీ జనంలో వరద కలవరం నెలకొంది. చెన్నైలో ఆకాశం మేఘావృతంగా మారింది. పలుచోట్ల చిరు జల్లులు కురిశాయి.

**అధికారులతో సమావేశం**

ఏరియల్ సర్వే అనంతరం సచివాలయానికి చేరుకున్న రాజ్‌నాథ్ సింగ్ సీఎం స్టాలిన్‌తో పాటు అధికారులతో సమావేశమయ్యారు. కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్, మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, సీఎస్ శివదాస్ మీన, హోం శాఖ కార్యదర్శి అముదా, డీజీపీ శంకర్ జివ్వాల్, రెవెన్యూ కార్యదర్శులు, ఆర్మీ, నేవీ అధికారులు, వాతావరణ శాఖ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. చెన్నై, శివార్లలో వరదలు సృష్టించిన విలయతాండవం గురించిన సమగ్ర సమాచారాన్ని రాజ్‌నాథ్ సింగ్‌కు అధికారులు వివరించారు. మిచాంగ్ రూపంలో కురిసిన వర్షం, ఆ తదుపరి తాము చేపట్టిన సహాయక చర్యలను గుర్తు చేశారు.

**ముందు జాగ్రత్తలతోనే నష్టం తప్పింది**

ఈ సమావేశంలో సీఎం స్టాలిన్ మాట్లాడుతూ.. వరదలు విలయ తాండవం చేసినా తాము చేపట్టిన ముందు జాగ్రత్తలతో భారీ ప్రాణ నష్టం తప్పినట్లు వివరించారు. వర్షం ఆగగానే రాత్రికి రాత్రే యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు జరిగాయని, మెజారిటీ శాతం ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రోడ్లు, వంతెనలు, భవనాలు తదితర ఆస్తినష్టం జరిగి ఉన్నట్లు, ప్రజలను ఆదుకునేందుకు వీలుగా రూ. 5,060 కోట్లు తక్షణం విడుదల చేయాలని కోరారు. అలాగే కేంద్ర బృందాన్ని పంపించి త్వరితగతిన సర్వే చేయించాలని కోరారు. ఇందుకు రాజ్‌నాథ్ సింగ్ సమాధానం ఇస్తూ ప్రసంగించారు. ప్రధాని నరేంద్రమోదీ తమిళనాడును అన్ని విధాలుగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇక్కడి వరదల సమాచారంతో ఆయన ఆందోళన చెందారని, తక్షణం ఆర్మీ, నేవీ, కోస్టుగార్డును రంగంలోకి దించి సహాయక చర్యలు ముమ్మరం చేయించారన్నారు. అలాగే తనను తమిళనాడుకు వెళ్లాలని ఆదేశించారని గుర్తు చేశారు. ఇక్కడి పరిస్థితులను తాను సమగ్రంగా పరిశీలించామని, అన్ని వివరాలను ప్రధానికి తెలియజేస్తానన్నారు. చెన్నైలో వరద నివారణకు శాశ్వత పథకం అవశ్యం అని కేంద్రం గుర్తించినట్టు పేర్కొన్నారు. ఈ పథకం అమలుకు రూ.561 కోట్లను కేంద్రం కేటాయించేందుకు నిర్ణయించినట్లు వివరించారు. అలాగే వరద సహాయక చర్యలకు తొలి విడతగా రూ. 450 కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మరికొద్ది రోజుల్లో కేంద్రం బృందం ఇక్కడకు వస్తుందని, సమగ్ర పరిశీలన, అధ్యయనంతో నష్టం తీవ్రతపై దృష్టి పెట్టి కేంద్రానికి నివేదికను సమర్పిస్తుందన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం స్టాలిన్

### రాజ్‌నాథ్ ఏరియల్ సర్వే



మిచాంగ్ బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు రూ. 5,060 కోట్లు కేటాయించాలని కేంద్రాన్ని సీఎం స్టాలిన్ విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాలతో రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం ఉదయం చెన్నైకు వచ్చారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. చెన్నై శివార్లలో జల దిగ్బంధంలో ఉన్న ప్రాంతాలను వీక్షించారు. చెన్నై, శివారులలోని చెంగల్పట్టు, తిరువళ్లూరు, కాంచీపురం జిల్లాల మీదుగా ఏరియల్ సర్వే సాగింది.



రాజ్‌నాథ్ సింగ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీఎం



వృద్ధురాలికి అన్నం వడ్డిస్తున్న సీఎం స్టాలిన్



ట్యాన్సీ నగర్‌లో బాధితులను శిబిరాలకు తరలిస్తున్న జవాన్లు



తిరువొత్తియూరు మార్గంలో రైలు సేవలు



సెమ్మంజేరి: వరద నీటిని తొలగిస్తున్న సిబ్బంది



కామరాజర్ సాలైలో పొగ మంచు



ఎంజీఆర్ యువజన విభాగం నేత సునీల్ సాయం



వెప్పేరిలో పెట్రోల్ బంకు వద్ద గుమిగూడిన వాహన చోదకులు

### శ్వేత పత్రం విడుదలకు 'పళణి' డిమాండ్



పళణి స్వామి

సాక్షి, చెన్నై: చెన్నైలో నిర్మించిన వర్షపు నీటి కాలువల నిర్మాణాలపై సమగ్ర సమాచారంతో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి డిమాండ్ చేశారు. చెన్నై వరద ముంపునకు గురైన నేపథ్యంలో వర్షపు నీటి కాలువల నిర్మాణాలపై ఆరోపణలు, విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణిస్వామి గురువారం స్పందించారు. ఆయన పేర్కొంటూ చెన్నైలో వర్షపు నీటి కాలువల నిర్మాణాలు సక్రమంగా జరిగి ఉంటే, నగరం నీట మునిగి ఉండేది కాదన్నారు. గతంలో వాతావరణ కేంద్రం నుంచి తమకు సమాచారం అందగానే ముందు జాగ్రత్తలు సిద్ధం చేసి ఉంచామన్నారు. ఈ సారి ఐదు రోజులకు ముందుగానే వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ ప్రకటించినా, ఈ పాలకులు చివరి క్షణంలో స్పందించడంతో ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన పరిసితి ఏర్పడినట్లు ఆరోపించారు. చెన్నై, శివారులలో వర్షపు నీటి కాలువల నిర్మాణాలపై అనుమానాలు బయలుదేరాయని, వీటిపై సమగ్ర సమాచారంతో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్షం ఆగి నాలుగు రోజులు అవుతున్నా, శివారులు ఇంకా జల దిగ్బంధంలోనే ఉండడం ఈ పాలకుల అసమర్థకు నిదర్శనంగా పేర్కొన్నారు. అంటు రోగాలు ప్రబలే పరిస్థితులు నెలకొని ఉన్నాయని తక్షణం వైద్య శిబిరాలను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, ఇంటింటా వెళ్లి ప్రజలకు వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు పాలు, నిత్యావసర వస్తువులు సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోకుండా, సహాయక చర్యల పేరిట మాయాజాలం సృష్టిస్తున్నారని విమర్శించారు.



మౌళివాక్కం వీధిలో వరద నీరు

# 97 శాతం ప్రాంతాలు మునక

- అన్నావర్సిటీ సర్వేతో వెలుగులోకి..
- బస్సులు, రైళ్ల సేవల పునరుద్ధరణ
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- మొదలైన ట్రాఫిక్ కష్టాలు

సాక్షి, చెన్నై : మిచాంగ్ రూపంలో చెన్నై మహానగరం పరిధిలో 97 శాతం ప్రాంతాలు నీట మునిగినట్లు అన్నావర్సిటీ పరిశీలనలో తేలింది. కేవలం 3 శాతం ప్రాంతాలు మాత్రమే వరద ముంపునకు గురి కాలేదు. ఈ నేపథ్యంలో సీఎస్ శివదాస్ మీన స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. శివారు ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆహారం, వస్తువులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెన్నైలో 800 వీధుల్లో నీళ్లు ఉన్నట్టు, మిగిలిన ప్రాంతాలలో సాధారణ పరిస్థితి నెలకొంది. దీంతో అన్ని రకాల సంస్థలు, కార్యాలయాలు తెరచుకున్నాయి. జనం విధుల బాట పట్టారు. నగరంలోని రోడ్లపై వాహనాల రద్దీ గురువారం నుంచి పెరిగింది. బస్సులు, ఎలక్ట్రిక్ రైళ్ల సేవలను పునరుద్ధరించడంతో బస్టాండ్‌లు , రైల్వే స్టేషన్లు కిట కిటలాడాయి. వరద నీరు తొలగిన ప్రాంతాలలోని ప్రజలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే పనిలో వాటర్ బోర్డు వర్గాలు నిమగ్నమయ్యాయి. ఇదిలా ఉండగా, ఉదయాన్నే మంచు దుప్పటి చెన్నై, శివారులలో ఆవహించినట్లు పరిస్థితి నెలకొంది. దీంతో 23 విమానాలు ఆలస్యంగా బయలుదేరాయి.

**తండ్రి కోసం వెళ్లి..**

పళ్లికరణై కామకోటి నగర్‌కు చెందిన మురుగన్, రేవతి దంపతులకు అరుణ్ (28) కుమారుడు. వరద విలయంలో వీరి నివాసం పూర్తిగా మునిగింది. తల్లిదండ్రులను రక్షించి చెన్నైలోని స్నేహితుడి నివాసంలో ఉంచాడు. మరుసటి రోజున ఇంటి పరిస్థితిని తండ్రి చూసేందుకు వెళ్లాడన్న సమాచారంతో అరుణ్ పళ్లికరణైకు వెళ్లాడు. ఆతర్వాత కనిపించకుండా పోయాడు. మురుగన్, అరుణ్ కోసం బంధువులు స్నేహితులు గాలించారు. ఆ మరుసటి రోజున మురుగన్ ఓ చోట ఉన్నట్టు గుర్తించారు. అరుణ్ జాడ కాన రాలేదు. ఈపరిస్థితులలో పళ్లికరణైలోని ఓ పొదళ్లల్లో అరుణ్ మృత దేహం గురువారం ఉదయం బయట పడింది. దీంతో ఆ తల్లిదండ్రుల వేదన వర్ణణాతీతంగా మారింది. ఇదిలా ఉండగా, కూవం నదీ తీరంలోని అమింజికరైలో ఓ మృత దేహం బయట పడింది. 35 ఏళ్ల గుర్తు తెలియని ఆ యువకుడి మృత దేహం ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. అలాగే, వేళచ్చేరిలో నిర్మాణ ప్రాంతంలో గోతిలో పడ్డ కంటైనర్‌లో ఇద్దరు చిక్కుకుని ఉన్నట్లు తేలింది. ఈ ఇద్దరు మరణించి ఉంటారని భావిస్తున్నారు. ఈ గోతి నుంచి నీటి తొలగింపు శ్రమగా మారి ఉంది. కాగా, అడయార్ నది ఉధృతికి సైదా పేట పరిసరాలలోని నివాసాలు నీట మునిగి విషయం తెలిసిందే. ఇక్కడ వరద ఉధృతి తగ్గడంతో బాధితులు తమ ఇళ్ల వైపుగా వెళ్లి కన్నీటి పర్యంతం అవుతున్నారు. కట్టుకున్న బట్టలతో మిగలాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుల్లి తెర హాస్య నటుడి సాయం బుల్లి తెరలో హాస్యనటుడిగా చిన్న చిన్న పాత్రులు చేసుకుంటూ వస్తున్న నటుడు బాల వరద బాధితులకు తన వంతు సాయం అందించాడు. అనకాపుత్తూరు పరిసరాలలో నితీవ్ర ముంపునకు గురైన 200 కుటుంబాలకు తాను సంపాదించిన మొత్తంలో ఒక్కో కుటుంబానికి రూ. 1000 నగదు అందజేస్తూ, తన వంతు సాయంగా మానవత్వాన్ని చాటుకున్నాడు.

**మరో తుపాన్ వదంతులు నమ్మవద్దు**

మరో తుఫాన్‌చెన్నై వైపుగా దూసుకు రాబోతున్నట్టుగా వస్తున్న వదంతులు నమ్మ వద్దు అని వెదర్ మెన్ ప్రదీప్ తెలిపారు. డిసెంబరు 10న అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, అయితే ఇది అరేబియా సముద్రం గుండా భారత సరిహద్దులను దాటుతోందన్నారు. దీని ప్రభావంతో దక్షిణ తమిళనాడులో వర్షాలు కొంత మేరకు ఉంటాయని, చెన్నై వైపుగా మరో తుపాన్ వస్తుందనే పుకార్లను నమ్మ వద్దని సూచించారు. కన్యాకుమారి తీరంలోని అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి తదితర జిల్లాలో చిరు జల్లులు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా వారం అనంతరం చేపల వేటకు వెళ్లిన జాలర్లపై శ్రీలంక సేనలు దాడి చేశారు. 21 మందిని బందీలుగా గురువారం ఉదయం పట్టుకెళ్లినట్లు సమాచారం.



చెన్నై శివార్లలో నీటమునిగిన ప్రాంతాలు

### కుశస్థలిలో చమురు తెట్టు

కుశస్థలి నది పరివాహక ప్రాంతాల్లో వరద నీటికి చమురు తెట్టు తోడైంది. దీంతో ఆ పరివాహక ప్రదేశాలలోని ప్రజలలో ఆందోళన నెలకొంది. ఎన్నూరు సమీపంలోని చమురు శుద్ధీకరణ కేంద్రాలను వరదలు చుట్టుముట్టడంతో అక్కడి నుంచి చమురు తెట్టు బయటకు వచ్చినట్టు గురువారం వెలుగు చూసింది. చమురు తెట్లను తొలగించని పక్షంలో సముద్రంలో జలరాశులకు ప్రమాదం తప్పదనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

## క్లుప్తంగా

### పతాక దినోత్సవ నిధి సేకరణ



నిధి సేకరణ ప్రారంభిస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం(పళ్లిపట్టు): పతాక దినోత్సం నిధి సేకరణను కలెక్టర్ కలైసెల్వి గురువారం ప్రారంభించారు. కాంచీపురం జిల్లా కుండ్రత్తూరు మున్సిపాలిటీలో మాజీ సైనికుల పతాక దినోత్సవ నిధి సేకరణ కార్యక్రమంలో కలెక్టర్ కలైసెల్వి పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వెటరన్స్ ఫ్లాగ్‌డే ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న దేశ వ్యాప్తంగా జరుపుకుంటారన్నారు. మాజీ సైనికుల త్యాగాలకు గుర్తింపుగా వారి సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వశాఖల కార్యాలయాల ద్వారా జెండా దినోత్సవ నిధి సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. యుద్ధంలో మరణించిన, వికలాంగులైన మాజీ సైనికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసేందుకు వీలుగా పౌరులుగా స్వచ్ఛందంగా నిధులు అందజేసి తమ దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు.

### మతబోధకుడి హత్య

- లైంగిక వేధింపులు తట్టుకోలేక చంపిన మహిళ

కొరుక్కుపేట: పుదుకోట్టై సమీపంలో లైంగిక వేధింపులకు పాల్పడిన మత బోధకుడిని ఇనుప రాడ్‌తో కొట్టి చంపినందుకు అక్కడ పని చేస్తున్న మహిళను అరెస్టు చేశారు. కడలూరుకు చెందిన వీరసామి(అలియాస్) డేనియల్(62) క్రైస్తవ బోధకుడు. కొన్నేళ్లుగా పుదుకోట్టై జిల్లా మాథూరు పక్కనే ఉన్న మండై ఊరులో అద్దె ఇంట్లో ఉంటూ చుట్టుపక్కల గ్రామాల్లో మత ప్రచారం చేస్తున్నాడు. డేనియల్ ఇంట్లో ఒక నెల రోజులుగా సెల్వి (అలియాస్) ప్రిన్సీ(46) వంట మనిషిగా పనిచేస్తున్నారు. డేనియల్ తరచూ ఆమెను లైంగికంగా వేధించేవాడు. ఈ స్థితిలో బుధవారం అర్థరాత్రి డేనియల్ మళ్లీ లైంగికంగా హింసించాడు. దీంతో తీవ్ర ఆవేశానికి గురైన పనిమనిషి సెల్వి ద్విచక్ర వాహనంలో ఉన్న ఇనుప రాడ్డును తీసుకుని డేనియల్‌పై దాడి చేసింది. ఇందులో ముఖం, తల బలంగా తీవ్రంగా గాయపడి అదే స్థలంలో రక్తపు మడుగులో మృతి చెందాడు. సమాచారం మేరకు గురువారం ఉదయం మండయూరు పోలీసు లు వెళ్లి డేనియల్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుచ్చి ప్రభుత్వ మార్చురీకి తరలించారు. కేసు నమో దు చేసి మహిళను అరెస్టు చేసి విచారణ నిమి త్తం మండయూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మత బోధకుడిని ఓ మహిళ కొట్టి చంపిన ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది.

### వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ




నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్.గాంధీ

తిరుత్తణి: మిచాంగ్ తుపాను బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున నిత్యావసరాలను మంత్రి ఆర్.గాంధీ గురువారం పంపిణీ చేశారు. తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేట యూనియన్‌లో తుపాను ప్రభావంతో భారీవర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలతోపాటు కొండజాతి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శిబిరాల్లో ఉంచి వారికి ఆహారంతోపాటు కనీసవసతులు కల్పించారు. భారీ వర్షంతో ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న కొండజాతి ప్రజలకు ప్రభుత్వం వరద సాయంగా బియ్యం, కిరాణా వస్తువులు పంపిణీ చేసింది. ఇందులో భాగంగా ఆర్కేపేట, తిరుత్తణి యూనియన్‌లో 200 కుటుంబాలకు పది కేజీల బియ్యం కిరాణా వస్తు సామగ్రి పంపిణీ కార్యక్రమం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. తిరుత్తణి యూనియన్ కేజీ కండ్రిగ, ఆర్కేపేట యూనియన్ ఎస్‌వీజీ పురం పంచాయతీ ఎస్‌బీ కండ్రిగలో నిర్వహించిన నిత్యావసరాల పంపిణీ కార్యక్రమంలో చేనేత పరిశ్రమ శాఖ మంత్రి ఆర్.గాంధీ, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. డీఆర్‌ఓ రాజ్‌కుమార్, తిరుత్తణి ఆర్డీఓ దీప, తహసీల్దార్లు మదన్, విజయకుమార్, డీఎంకే మండల కార్యదర్శులు హరతిరవి, కృష్ణన్, పళని, షణ్ముగం, ఎస్‌వీజీ.పురం పంచాయతీ సర్పంచ్ సత్యం రాజు, కేజీ కండ్రిగ యూనియన్ కౌన్సిలర్ జ్యోతి చిరంజీవులు పాల్గొన్నారు.

### రైతులను ముంచిన మిచాంగ్

- 3276.73 హెక్టార్లలో పంట నష్టం
- పరిహారం కోసం 5814 మంది రైతుల ఎదురుచూపులు



తిరువళ్లూరు: మిచాంగ్ తుపాను సృష్టించి బీభత్సంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పంటలు దెబ్బతిన్నాయి. సర్వస్వం కోల్పోయిన రైతులు సాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షపాతం నమోదు కావడంతో పాటు ఈదురు గాలులు వీచాయి. ఫలితంగా జిల్లాలో ఆస్తి నష్టం జరిగింది. జిల్లాలో ఎక్కువగా వ్యవసాయం సాగులో ఉంది. తుపాను ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలోని రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

# త్వరలోనే కొత్త రిజర్వాయర్ల నిర్మాణం

- రామంజేరి, తిరుకండలం వద్ద నిర్మాణం: మంత్రి దురైమురుగన్



పూండి సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్, మంత్రులు మూర్తి, గాంధీ కలెక్టర్, ఎమ్మెల్యేలు

తిరువళ్లూరు: వర్షపు నీటిని నిల్వ చేయడానికి రామంజేరి, తిరుకండలం రెండు ప్రాంతాల్లో కొత్త రిజర్వాయర్ల నిర్మాణాలను త్వరలోనే చేపడుతామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ స్పష్టం చేశారు. చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే పుళల్, పూండి సత్యమూర్తిసాగర్ రిజర్వాయర్లను మంత్రి దురైమురుగన్, ఇన్‌చార్జ్ మంత్రులు మూర్తి, రాణిపేట గాంధీ తదితరులతో కలిసి గురువారం ఉదయం పరిశీలించారు. పుళల్ రిజర్వాయర్ కరకట్టలో స్వల్పంగా ఏర్పడిన లీకేజీ మరమ్మతు పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పూండికి వచ్చిన మంత్రి దురైమురుగన్ రిజర్వాయర్‌లో నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి దురైమురుగన్ మీడియాతో మాట్లాడుతూ తిరువళ్లూరు జిల్లాలోని కూవం, కుశస్థలి, ఆరణియార్ ద్వారా వందలాది క్యూసెక్కుల నీరు వర్షాకాలంలో వృథా పోతోందన్నారు. వర్షపు నీటిని ఆదా చేయడానికి అదనపు ఆనకట్టలను నిర్మిస్తామన్నారు. 47 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా వర్షాలు పడ్డాయని, దీంతో భారీగా వర్షపు నీరు నివాసాలకు చేరి ప్రజలకు ఇబ్బంది కలిగించిందన్నారు. అయితే సీఎం స్టాలిన్ తీసుకున్న ప్రత్యేక చొరవతో ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం మంత్రులు, ఐఏఎస్ అధికారులను నియమించి పనులను ముమ్మరం చేశారన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న ప్రత్యేక చొరవతోనే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించామన్నారు. ముంపు ప్రాంతాలకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలోనూ ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. జిల్లాలోని పూండి, పుళల్ రిజర్వాయర్లకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇన్‌ఫ్లో వచ్చినా అధికారులు, మంత్రుల సమన్వయంతో పని చేయడంతోనే భారీ నష్టాన్ని నివారించామన్నారు. దీంతో పాటు రిజర్వాయర్ల భద్రతకు ముప్పు లేకుండా చర్యలు తీసుకున్నట్టు మంత్రి దురైమురుగన్ తెలిపారు. పుళల్ రిజర్వాయర్‌లో చిన్నపాటి లీకేజీ ఉందని, అధికారులు ఇప్పటికే సరి చేశారన్నారు. అయితే కొన్ని పత్రికలు రిజర్వాయర్ భద్రతకే ముప్పు ఉందని పతాక శీర్షికల్లో వార్తలు రాయడంతో ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. అయితే పుళల్ రిజర్వాయర్‌కు ఎలాంటి ముప్పు లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం అన్ని రిజర్వాయర్‌లు వందశాతం నిండాయని, రిజర్వాయర్‌లకు వస్తున్న ఇన్‌ఫ్లోను అలాగే అవుట్‌ఫ్లో రూపంలో బయటకు పంపుతున్నట్టు వివరించారు. రామంజేరి, తిరుకండంలం రెండు గ్రామాల్లో పెద్ద రిజర్వాయర్లు నిర్మించాలని గతంలో డీఎంకే అధికారంలో ఉన్నప్పుడే నిర్ణయించామని అయితే అక్కడ భూసేకరణ ఇబ్బందికరంగా మారడంతో ప్రాజెక్టుల నిర్మాణం సాధ్యం కాలేదన్నారు. అయితే ప్రస్తుతం భారీగా వర్షపు నీరు వృథా పోతున్న నేపథ్యంలో రెండు ప్రాంతాల్లోని రైతులకు రెట్టింపు పరిహారాన్ని ఇచ్చి భూసేకరణ జరిపి, ప్రాజెక్టులను నిర్మిస్తామన్నారు. ఎన్నూరులో రసాయనాలతో కలుషిత నీరు బయటకు వస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పర్యావరణం, పరిశ్రమల శాఖ అధికారులతో చర్చించి రసాయన నీరు బయటకు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నదులు, చెరువులు ఆక్రమణలకు గురి కావడంతోనే నివాసాలకు నీరు చేరుతోంన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇప్పటికే కొన్ని ఆక్రమణలను తొలగించామని తెలిపారు. భవిష్యత్‌లో నీటి ఆధారిత ప్రాంతాల్లోని ఆక్రమణలను వందశాతం తొలగిస్తామన్నారు. నాలుగు వేల కోట్లు రూపాయలు ఖర్చు చేసి, కాలువలు నిర్మించడంతో చెన్నైలో గతంలో ఎన్నడూ లేని విధంగా నీరు వచ్చినా 24 గంటల్లో సమస్యలను పరిష్కరించామన్నారు. మంత్రి వెంట కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్, ఎమ్మెల్యేలు కృష్ణస్వామి, తిరుత్తణి చంద్రన్, వీజీ రాజేంద్రన్, టీజే గోవింద రాజన్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అరుణాచలేశ్వరాలయానికి చేరిన కొప్పరి



కొండపై నుంచి రాగి రాక్షస కొప్పరిని కిందకు దించుతున్న ఆలయ సిబ్బంది

వేలూరు: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వెలిగించిన మహా దీప రాగి రాక్షస కొప్పరిని గురువారం ఉదయం కొండపై నుంచి ఆలయానికి తీసుకొచ్చారు. కార్తీక బ్రహ్మోత్సవాలు గత నెల 17వ తేదీన ధ్వజారోహణంతో ప్రారంభమై 26వ తేదీన అరుణాచలేశ్వరాలయం వెనుక వైపునున్న 2,668 అడుగుల ఎత్తుగల కొండపై భక్తుల హరోం.. హరా నామస్మరణ మధ్య మహా దీపాన్ని వెలిగించారు. ఈ దీపం 11 రోజులపాటు భక్తులకు దర్శనమిచ్చింది. దీంతో గురువారం ఉదయం 6 గంటలకు రాగి రాక్షస కొప్పరిని ఆలయ సిబ్బంది కొండపై నుంచి కింద ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఆలయ జాయింట్ కమిషనర్ జ్యోతి పర్యవేక్షణలో శివాచార్యులు వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, రాగి రాక్షస కొప్పరికి పూజలు చేశారు. ఈ సందర్భంగా కొప్పరిలోని కాటుకను ప్రసాదంగా తీసుకునేందుకు భక్తులు బారులు తీరారు. అనంతరం పుష్పాలంకరణలో ఉన్న ఉన్నామలై సమేత అన్నామలైయార్, పంచ మూర్తులను భక్తులు దర్శించుకున్నారు. అదే విధంగా దీపోత్సవం రోజున మహా దైవంగా భావించే అరుణాచలేశ్వరాలయ మహా కొండపైకి భక్తులు ఎక్కుతారు. కొండకు పరిహార పూజలు చేసేందుకు కలశ నీటిని ఆలయ సిబ్బంది కొండపైకి తీసుకెళ్లి చల్లారు.

## గుంతలో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి

తిరువొత్తియూరు: చెంగల్పట్టు సమీపంలో గుంత నీటిలో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందినవారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా చెంగల్పట్టు జిల్లాలో వర్షపు నీటి గుంటలో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెంగల్పట్టు జిల్లా తిరుకలికుండ్రం సమీపంలో 6 కిలోమీటర్ల దూరంలో నరపాక్కం గ్రామానికి చెందిన వ్యక్తి నందగోపాల్, ఇతని సోదరి ఉష. వీరిద్దరూ నరపాక్కం గ్రామంలో ఒకే ఇంటిలో నివాసం ఉంటున్నారు. నందగోపాల్ కుమారుడు ఆనందన్(8), ఉష కుమారుడు దేవరాజు(13) వీరిద్దరు బుధవారం సాయంత్రం ఇంటికి ఎదురుగా ఒక గుంటలో స్నానం చేయడానికి వెళ్లారు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీట మునిగిపోయారు. అక్కడ స్నానం చేస్తున్న కొందరు వారిద్దరిని బయటకు తీశారు. వెంటనే వారిని తిరుక్కలికుండ్రం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన డాక్టర్లు ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్లు తెలిపారు.

## విద్యుత్ బిల్లు చెల్లింపు కేంద్రాల మూసివేత

- వినియోగదారుల ఇక్కట్లు



క్యూలో వేచివున్న వినియోగదారులు

తిరుత్తణి: తిరుత్తణిలో విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాలు మూసివేతతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత చెన్నై బైపాస్ రోడ్డు మార్గంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లోని విద్యుత్ కార్యాలయంలో టౌన్, రూరల్ రెండు కార్యాలయాలున్నాయి. అందులో టౌన్, రూరల్ విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా నాలుగు కేంద్రాల్లో బిల్లు చెల్లించేవారు. అయితే విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించడం ఇటీవల పెరగడంతో మొత్తం నాలుగు బిల్లుల చెల్లింపు కేంద్రాల్లో మూడు మూసివేశారు. దీంతో ప్రస్తుతం ఒక్క కేంద్రంలో మాత్రమే బిల్లులు చెల్లించుకుంటున్నారు. దీంతో వినియోగదారులు గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సి వస్తోంది. ఫలితంగా వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## మాజీ సైనికుల కుటుంబాల కోసం విరాళాల సేకరణ



ఫ్లాగ్‌డే విరాళాల సేకరణను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: మాజీ సైనికుల కుటుంబాలను ఆదుకునేందుకు విరివిగా విరాళాలు సేకరించాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అన్నారు. డిసెంబర్ 7 ఫ్లాగ్‌డేను పురస్కరించుకొని గురువారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌సీసీ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం రూ.50 లక్షల విరాళాల సేకరణ లక్ష్యంగా ఎంచుకున్నామని, ఈ సంవత్సరం రూ.70 లక్షలు సేకరించడమే లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. వీటిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ నిధులను దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన కుటుంబాలకు, వికలాంగులకు, వితంతవులకు అందజేస్తామని, వీటికి జిల్లాలోని ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం ఈ ర్యాలీ పాత బస్టాండ్, అన్నారోడ్డు, మండి వీధి, గాంధీ రోడ్డు తదితర ప్రాంతాల్లో విరాళాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, సబ్ కలెక్టర్ కవిత, వేలూరు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శశికళ, మాజీ సైనికుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసన్, తహశీల్దార్ సెంథిల్, ఎన్‌సీసీ విద్యార్థులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

## • బోటులో వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం



కాంచీపురం జిల్లాలో మిచాంగ్ తుపాను తీవ్ర ప్రభావంతో నివాస ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. వర్షం వీడి మూడు రోజులు కావస్తున్నా వరదనీరు తగ్గకపోవడంతో జనం సమస్యలు ఎదుర్కొంటున్నారు. వరదరాజపాళ్యంలో వరదనీరు చుట్టుముట్టడంతో కలెక్టర్ కలైసెల్వి బోటులో వెళ్లి ముంపులో చిక్కుకున్న కుటుంబాలతో మాట్లాడారు. వారి సమస్యలు పరిష్కరించారు.

- కాంచీపురం(పళ్లిపట్టు)

**కోలీవుడ్ టాక్స్**


## శాండిల్ వుడ్‌కు సాయిపల్లవి?



సాయిపల్లవి

తమిళసినిమా: మలయాళంలో ప్రేమమ్ చిత్రం ద్వారా కథానాయకిగా పరిచయం అయిన తమిళ నటి సాయి పల్లవి. తొలి చిత్రంతోనే దక్షిణాది సినీ పరిశ్రమలో తన పేరును వ్యాపింపజేసుకున్న ఈ సహజ నటికి ఆ తరువాత తెలుగు, తమిళం భాషల్లో అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. అలా నటించిన ప్రతి భాషలోనూ తన ముద్రను వేసుకుంది. ముఖ్యంగా తెలుగులో మంచి విజయాలను అందుకుంది. తమిళంలో సూర్య, ధనుష్ వంటి స్టార్ హీరోల సరసన నటించింది. ఇక మలయాళంలో గార్గీ వంటి హీరోయిన్ ఓరియంటెడ్ కథా చిత్రంలో నటించి విజయాన్ని అందుకుంది. కాగా ఇటీవల కొంత కాలం నటనకు దూరంగా వున్న సాయిపల్లవి ఇప్పుడు మళ్లీ బిజీ అయ్యింది. ప్రస్తుతం తెలుగులో నాగచైతన్య సరసన ఒకచిత్రం, తమిళంలో శివకార్తికేయన్‌కు జంటగా ఒక చిత్రంలో నటిస్తోంది. తాజాగా శాండిల్ వుడ్ లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు టాక్ స్ప్రెడ్ అవుతోంది. కేజీఎఫ్ చిత్రం ఫేమ్ యాష్ చిన్న గ్యాప్ తరువాత తన తాజా చిత్రానికి సిద్ధం అవుతున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇటీవలే మీడియాకు విడుదల చేశారు. గోవా నేపథ్యంలో సాగే మాఫియా కథాంశంతో సాగే ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కనున్నట్లు సమాచారం. కాగా ఈ చిత్రం ద్వారా నటి సాయిపల్లవి కన్నడ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదే నిజం అయితే ఈమె దక్షిణాది కథానాయకి కేటగిరిలో చేరినట్లే. కాగా ఈ చిత్రంలో సాయి పల్లవి నటించే విషయమై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## ఇద్దరు మిత్రుల కథతో సలార్..!



శృతిహాసన్



సలార్ చిత్రంలో ప్రభాస్

తమిళసినిమా: నటుడు ప్రభాస్ కెరీర్‌కు చాలా ముఖ్యమైన చిత్రం సలార్. ఎందుకంటే బాహుబలి 1–2 చిత్రాల తరువాత ఈయన నటించిన రాధేశ్యామ్, ఆదిపుష్ చిత్రాలు పాన్ ఇండియా స్థాయిలో రూపొందినా పూర్తిగా నిరాశ పరిచాయి. దీంతో తాజా చిత్రం సలార్‌తో కచ్చితంగా హిట్ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభాస్‌పై పడింది. ఇక ఈ చిత్రం హీరోయిన్ శృతిహాసన్ సలార్‌పై చాలా నమ్మకం పెట్టుకున్నారు. మరో ప్రధాన పాత్రలో మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ నటించడం విశేషం. పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కిన ఇందులో తమిళ నటుడు పశుపతి కూడా కీలక పాత్రను పోషించారు. కెజీఎఫ్ చిత్రం ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని హోమ్ బలే సంస్థ నిర్మిస్తోంది. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ నెల 22వ తేదీన భారీ అంచనాల నడుమ తెరపైకి రానున్న సలార్ చిత్రం గురించి దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ ఇది ఇద్దరు మిత్రుల ఇతివృత్తంతో రూపొందించిన కథా చిత్రం అని చెప్పారు. అయితే ఆ ఇద్దరు శత్రువులుగా మారితే జరిగే పరిణామాలు ఎలా ఉంటాయన్న పలు ఆసక్తికరమైన అంశాలతో కూడిన యాక్షన్ థ్రిల్లర్ కథా చిత్రం ఇదని చెప్పారు. ఇటీవల విడుదలైన చిత్ర ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. తన గత చిత్రం కేజీఎఫ్ ఛాయలు సలార్‌లో కనిపిస్తున్నాయనే వాదన కరెక్ట్ కాదన్నారు. ఆ చిత్రంకు సలార్ అస్సలు పోలిక ఉండదన్నారు. ఇంకా చెప్పాలంటే కేజీఎఫ్ చిత్రాన్ని రూపొందించడానికి ముందే సలార్ చిత్ర కథను రాసుకున్నానని చెప్పారు. అదే విధంగా సలార్ చిత్రానికి కచ్చితంగా సీక్వెల్ ఉంటుందని, త్వరలోనే సీక్వెల్‌కు సంబంధించిన షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు ప్రశాంత్ నీల్ చెప్పారు.

## కవిన్ స్టార్ విడుదల ఎప్పుడంటే?



సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజాతో స్టార్ చిత్ర యూనిట్

తమిళసినిమా: యువ నటుడు కవిన్ కథానాయకుడిగా నటించిన దాడా అనూహ్య విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. కాగా ఈయన తాజాగా నటిస్తున్న చిత్రానికి స్టార్ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దీనికి ప్యార్ ప్రేమ కాదల్ చిత్రం ఫేమ్ ఇళన్ దర్శకత్వం వహిస్తున్నారు. బీవీఎస్ ఎన్ ప్రసాద్, శ్రీనిధి సాగర్ కలిసి నిర్మిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇందులోని పాటలన్నీ యూత్‌ను అలరించే విధంగా ఉంటాయంటున్నారు చిత్ర వర్గాలు. ఈ చిత్ర ప్రోమో వీడియోను యువన్ శంకర్ రాజా పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేశారు. దీనికి మంచి రెస్పాన్స్ వచ్చిందని పేర్కొన్నారు. ఇటీవల ఇందులోని ఇంటిలో సాంగ్ కోసం భారీ సెట్ వేసి చిత్రీకరించినట్లు యూనిట్ వర్గాలు తెలిపాయి. ఇది నటుడు కవిన్ ఇంతకు ముందు నటించిన చిత్రాల కంటే భిన్నంగానూ, భారీగానూ రూపొందిస్తున్న చిత్రం అని పేర్కొన్నారు. కాగా ఇది సినీ నేపథ్యంలో సాగే విభిన్న ప్రేమ కథా చిత్రంగా ఉంటుందట. తెర వెనుక పలు ఆసక్తికరమైన అంశాలను ఆవిష్కరించే చిత్రంగా స్టార్ ఉంటుందని సమాచారం. కాగా ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటున్న స్టార్ చిత్రాన్ని ఫిబ్రవరి 9వ తేదిన తెరపైకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

## విజయ్ 68వ చిత్రం అప్‌డేట్



విజయ్‌తో మీనాక్షి చౌదరి

తమిళసినిమా: అభిమానులు దళపతిగా పిలుచుకునే విజయ్ బ్లాక్‌బస్టర్ చిత్రం ఇచ్చి చాలా కాలమైంది. మాస్టర్ చిత్రం తరువాత ఈయన నటించిన బీస్ట్ చిత్రం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఆ తరువాత నటించిన వారీసు మిశ్రమ స్పందననే తెచ్చుకుంది. ఇక తాజాగా విజయ్ నటించిన లియో చిత్రం ఆయనకున్న స్టామినాతో వసూళ్ల వర్షం కురిపించినా, మంచి రిజల్ట్‌ను మాత్రం పొందలేకపోయింది. ఈయన తాజాగా నటిస్తున్న తన 68వ చిత్రం పైనే అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఇంతకు ముందు బిగిల్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని నిర్మించిన ఏజీఎస్ సంస్థ రూపొందిస్తోంది. మీనాక్షి చౌదరి నాయకిగా నటిస్తున్న ఇందులో నటి స్నేహ, ప్రశాంత్, ప్రభుదేవా, వైభవ్, ప్రేమ్‌జీ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. యువన్ శంకర్ రాజా సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చెన్నైలో ప్రారంభమై తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుని, ఆ తరువాత థాయ్‌లాండ్‌లో ఫైట్ సీక్వెన్స్, కొన్ని కీలక సన్నివేశాలను జరుపుకుని ప్రస్తుతం మళ్లీ చెన్నైలో షూటింగ్ జరుపుకుంటోంది. ఇలా బ్రేక్ లేకుండా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రానికి ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. త్వరలోనే చిత్ర టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేయడానికి యూనిట్ వర్గాలు రెడీ అవుతున్నట్లు తాజా సమాచారం. చిత్రాన్ని వచ్చే ఏడాది ఉగాది సందర్భంగా తెరపైకి రావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం కోసం యువన్ శంకర్ రాజా కొన్ని ట్యూన్స్ సిద్ధం చేస్తున్నట్లు, అవి ఊరా మాస్‌గా వచ్చాయని సమాచారం. మరో విషయం ఏమిటంటే సీనియర్ దర్శకుడు, సంగీత దర్శకుడు, గీత రచయిత గంగై అమరన్ ఈ చిత్రం కోసం ఒక పాట రాసినట్లు తెలిసింది.

## క్లుప్తంగా

### మరదలిపై అత్యాచారం

సేలం: ధర్మపురి జిల్లా పాపిరెడ్డి పట్టి పరిధిలోని పిల్‌పరుత్తి ప్రాంతానికి చెందిన ఆనందరాజ్(27) ప్రైవేటు బ్యాంకులో లోన్ డబ్బు వసూలు చేసే సిబ్బందిగా ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన ఒక మహిళకు ఆరు నెలల క్రితం వివాహం జరిగింది. ఆనందరాజ్ తన భార్య చెల్లెలికి ఆశ మాటలు చెప్పి, ఆమెను సేలం జిల్లా తీవట్టి పట్టి సమీపంలోని డేనిస్‌పేట పరిధిలోని లోకూర్ అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. ఈ కారణంగా ఆమె ప్రస్తుతం రెండు నెలల గర్భవతి. దీనికి సంబంధించి ఆనందరాజ్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తీవట్టిపట్టి పోలీసులు ఆనందరాజ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

### ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కేసు కొట్టివేత

కొరుక్కుపేట: పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు రిజర్వేషన్లు కోరుతూ విడుదలై సిరుత్తైగల్ పార్టీ నాయకుడు తిరుమావలవన్ దాఖలు చేసిన కేసును మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. గిరిజనులకు, మహిళలకు సరైన రిజర్వేషన్లు ఇవ్వలేదని, మద్రాస్ హైకోర్టు మధురై బ్రాంచ్‌లో చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో సహా 132 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉండగా, 19 శాతం రిజర్వేషన్లు లేదా మొత్తం పోస్టులలో 25 శాతం మంది ప్రాతినిధ్యం వహించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. సెలక్షన్ కమిటీని ఎలా ఏర్పాటు చేశారన్నది స్పష్టంగా తెలియరాలేదని, పబ్లిక్ కోర్టు పండితుల నియామకంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు తగిన రిజర్వేషన్లు ఇవ్వాలని ఆయన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. 2017లో దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి గంగా పూర్వాలా, న్యాయమూర్తి భరత చక్రవర్తి కొట్టివేశారు.

### బస్సు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తిరువొత్తియూరు: చెన్నై కోయంబేడు ప్రాంతంలో బస్సు ముందుకు దూసుకు వెళ్లి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నై కోయంబేడు బస్టాండ్ నుంచి సెంట్రల్‌కు బస్సు నెంబరు 15 ప్రభుత్వ బస్సు బయల్దేరింది. ఆ సమయంలో అక్కడ నిలబడి ఉన్న సుమారు 35 సంవత్సరాల వయసు గల వ్యక్తి హఠాత్తుగా పరుగెత్తుకొచ్చి బస్సు ముందు చక్రం కింద పడ్డాడు. దీంతో బస్సు చక్రం అతని తలపై ఎక్కి దిగడంతో అతను అదే చోట మృతి చెందాడు. ఇది చూసిన ప్రయాణికులు దిగ్భ్రాంతి చెంది కేకలు పెట్టారు. ఈ సంఘటనకు సంబంధించి డ్రైవర్, కండక్టరు కలిసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోయంబేడు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. వ్యక్తి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి పేరు, ఏ ప్రాంతానికి చెందిన వాడు అనే వివరాలు తెలియరాలేదు.

### అమ్మవారి సేవలో సినీనటి సంగీత



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని సినీనటి సంగీత గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజ స్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూల మూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### డబుల్ వాటర్ ప్రూఫ్ టెంట్లు వితరణ

తిరుపతి కల్చరల్: ఓటేరులోని గంగిరెద్దుల కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత తహసున్నీషా భేగం గురువారం డబుల్ వాటర్ ప్రూఫ్ టెంట్లను వితరణ చేశారు. గంగిరెద్దుల కాలనీలో నిరుపేదలకు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వారి పూరి గుడిసెల్లోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఇక్కట్లను గుర్తించిన తహసున్నీషా భేగం తన సొంత నిధులతో డబుల్ వాటర్ ప్రూఫ్ టెంట్లను 12 మందికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మౌల, సుజాత, స్థానిక నేతలు ఓటేరు కృష్ణ, రామకృష్ణ, పద్మనాభం పాల్గొన్నారు.

### 10 నుంచి తిరువడి సన్నిధి ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో కార్తీక మాసంలో చివరి ఆదివారమైన ఈనెల 10వ తేదీన తిరువడి సన్నిధి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు స్వామివారి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామివారి మూలవర్లకు తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఉభయ నాంచారులతో కలిసి శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులను ఆంజనేయస్వామివారి సన్నిధికి వేంచేపు చేసి అక్కడ ఏకాంతంగా తిరుమంజనం చేపడతారు. అక్కడ ఆస్థానం చేసిన అనంతరం ఉభయనాంచారులతో కూడిన శ్రీగోవిందరాజస్వామి వారు, శ్రీఆంజనేయస్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగింపుగా శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి తీసుకెళ్తారు. దీంతో తిరువడి సన్నిధి ఉత్సవం పరిసమాప్తం కానుంది.

# నిరాడంబరంగా ఎల్‌ఏసీ సభ్యుల ప్రమాణ స్వీకారం

- హాజరైన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి



భూమన కరుణాకర రెడ్డి, ఏజే శేఖర్‌తో సలహా మండలి కొత్త సభ్యులు

సాక్షి, చెన్నై: తమిళనాడు, పుదుచ్చేరి టీటీడీ స్థానిక సలహా కమిటీ (ఎల్‌ఏసీ) సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం చెన్నైలో జరిగింది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వివరాలు.. చెన్నై టీనగర్ వెంకటనారాయణ రోడ్డులో తిరుమల శ్రీవారి ఆలయం, సమాచార కేంద్రం ఉన్న విషయం తెలిసిందే. తమిళనాడుతో పాటు పుదుచ్చేరిలోని టీటీడీ ఆలయాలను స్థానిక సలహా కమిటీ పర్యవేక్షించడం జరుగుతోంది. ఇప్పటికే స్థానిక సలహా కమిటీ చైర్మన్‌గా ఏజే శేఖర్ నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో గత నెల 44 మంది సభ్యులను నియమిస్తూ టీటీడీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నలుగురు ఉపాధ్యక్షులు కాగా, మిగిలిన వారు సభ్యులుగా ఉన్నారు. వీరి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం టీనగర్‌లోని శ్రీవారి ఆలయం ఆవరణలో నిరాడంబరంగా జరిగింది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక సలహా మండలి చైర్మన్ ఏజే శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ్యులుగా నియమితులైన వారు ప్రమాణ స్వీకారం చేశారు. వీరికి నియామక ఉత్తర్వులను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అందజేశారు.

**36 మంది ప్రమాణ స్వీకారం**

కమిటీ ఉపాధ్యక్షులుగా ఎస్ఎస్ సుదంతిరం, వీఎల్ వెంకట సుబ్రమణియం, మరు శ్రీ శరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సలహా మండలి సభ్యులుగా ఎం.శ్రీనివాసరెడ్డి, కె. అనిల్‌కుమార్ రెడ్డి, కల్కి రంగారెడ్డి, పీవీఆర్ కృష్ణారావు, రవీంద్ర సన్నారెడ్డి , బి.మోహన్‌పద్మనాభరావు, అజయ్ తాతినేని, ఈ. కృష్ణారెడ్డి, జీఏ పృథ్వీ, వీఆర్ వెంకటాచలం, ఎస్.కార్తికేయన్, కేఎస్ జయరామన్, ఇందిరా రాజేంద్రన్, నరేష్ సుబ్రమణి, మలా శంకర్, టీఎల్ యువరాజ్, గిరిధరన్, ఎస్.నాగరాజన్, ఊరా లక్ష్మీ నరసింహరావు, వేమిరెడ్డి సందీప్ రెడ్డి, షణ్ముగమూర్తి, ఎల్.సుధాకరరెడ్డి, మల్లిపెద్ది అశోక్ కృష్ణ, జె.మురుగేశన్, ఎం.ప్రతాప్‌రెడ్డి, డీబీ సుబ్రమణ్యం, ఎం.రాజేంద్రకుమార్, వి.సత్యనారాయణన్, డాక్టర్ సీఎం కిషోర్, ఎంపీ జయదేవరావు, సి.శరవణన్, డి.రాధాకృష్ణమూర్తి, కె.గాయత్రి దేవీ ప్రమాణ స్వీకారం చేశారు. మరో ఎనిమిది మంది ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు. తదుపరి తేదీల్లో వీరు వేరువేరుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది.



కరుణాకర రెడ్డి నుంచి నియామక ఉత్తర్వు అందుకుంటున్న రవీంద్ర సన్నారెడ్డి, శ్రీనివాస రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, పీవీఆర్ కృష్ణారావు, కల్కి రంగారెడ్డి, బి.మోహన్‌పద్మనాభరావు

### ఐదుగురు పాఠశాల విద్యార్థుల అదృశ్యం

తిరువొత్తియూరు: ఈరోడ్ జిల్లా భవానీ వెస్ట్ వీధి కల్లుగీత కార్మిక వీధికి చెందిన ఐదుగురు విద్యార్థులు భవానీలోని ఓ పాఠశాలలో 7,8,10 వ తరగతి చదువుతున్నారు. స్నేహితులైన వీరందరూ తరచూ పాఠశాలకు వెళ్లకుండా విలాసాలకు వెళ్తున్నట్లు తెలిసింది. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఐదుగురు తిరిగి ఇంటికి రాలేదు. పలు ప్రాంతాలలో వారి కోసం తల్లిదండ్రులు బంధువులు గాలించారు. కానీ వారి ఆచూకీ తెలియ రాలేదు. దీంతో భవానీ పోలీసులకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. విచారణలో వీరు రైళ్లో బెంగళూరుకు వెళ్లినట్లు తెలిసింది.

### రోడ్డు ప్రమాదంలో నగల దుకాణం యజమాని మృతి

కొరుక్కుపేట: మినీ లారీ.. బైక్ ఢీకొన్న ప్రమాదంలో నగల దుకాణం యజమాని బలయ్యాడు. ఆయన సతీమణికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గుణశీలన్ (65) ధర్మపురిలో నగల దుకాణం నడుపుతున్నాడు. బుధవారం అతను, తన భార్య పళనియమ్మాళ్‌తో కలిసి బైక్‌పై కృష్ణగిరిలోని కులదేవత ఆలయానికి వెళ్లాడు. అక్కడ స్వామిని దర్శనం చేసుకున్న తర్వాత, వారు రాత్రి తిరిగి వచ్చారు. కృష్ణగిరి–ధర్మపురి జాతీయ రహదారిపై వస్తుండగా ఎదురుగా మినీలారీ బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుణశీలన్ అక్కడికక్కడే మృతి చెందగా, పళనియమ్మాళ్ తీవ్రంగా గాయపడ్డారు.

# పెళ్లి చేసుకుంటానని నగదు వసూలు

- ఎలక్ట్రికల్ వర్కర్ నుండి రూ.1.5 లక్షలు వసూలు



అరెస్ట్ అయిన భార్యాభర్తలు

కొరుక్కుపేట: ఫేస్‌బుక్‌లో పరిచయమై, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఎలక్ట్రికల్ వర్కర్ నుండి రూ.1.5 లక్షలు వసూలు చేసిన భార్యాభర్తలను అరెస్ట్ చేశారు. సుకుమార్(41) తిరుచ్చి జిల్లాలోని మనచ్చనలూర్ సమీపంలోని వెంగంగుడికి చెందినవాడు. మైలా డిపార్ట్‌మెంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. అతను అవివాహితుడు. అతను అద్దెకు మైలాడుదురైలో ఒంటరిగా ఉంటున్నాడు. అతను గత ఆగస్టులో తన స్వస్థలమైన వెంగంగుడికి వచ్చాడు. అప్పుడు ఒక మహిళ ఫేస్‌బుక్ ద్వారా సుకుమార్‌కు పరిచయమైంది. దీన్ని అంగీకరించిన సుకుమార్ రోజూ అమ్మాయితో కబుర్లు చెప్పుకుంటున్నాడు. తర్వాత ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. రూ.10,000 కావాల్సి ఉండగా పంపాలని సుకుమార్‌ను కోరింది. ఇది నమ్మిన సుకుమార్ గూగుల్ పే ద్వారా ఆమె ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్‌కు డబ్బు పంపాడు. ఇలా ఆ మహిళ డబ్బు అడిగినప్పుడల్లా ఇస్తూ వివిధ వాయిదాలలో రూ.1.5 లక్షలు ఇచ్చాడు. ఆ సమయంలో, ఆ అమ్మాయి తనకు పెళ్లి కాలేదని, తనను పెళ్లి చేసుకోవాలని సుకుమార్‌తో చెప్పింది. తదనంతరం కరూర్ జిల్లా మావడియన్ కోవిల్ స్ట్రీట్‌కు చెందిన ఫాతిమా(38) అనే మహిళే సుకుమార్‌ను మోసం చేసినట్లు వెల్లడైంది. ఆమె భర్త బాలమురుగన్(41) కూడా ఈ మోసంలో భాగస్వామి అని స్పష్టమైంది. దీంతో సుకుమార్ మనచ్చనల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం పోలీసులు బుధవారం కరూర్‌కు వెళ్లి బాలమురుగన్, ఫాతిమాలను అరెస్టు చేసి, వారిని విచారించడానికి మనచ్చనల్లూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.

# మద్యం మత్తులో భార్యకు వేధింపులు

- ఇటుక రాళ్లతో భర్తను కొట్టి చంపిన మహిళ

తిరువొత్తియూరు: మద్యం మత్తులో లైంగికంగా వేధిస్తున్న భర్తను ఇటుక రాళ్లతో దాడి చేసి హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లా అరూరు సమీపంలో ఉన్న కీరైపాత్తికి చెందిన రాజా(40) లారీ డ్రైవర్. ఇతను గత ఒకటో తేదీ వరటారు వంతెన సమీపంలో అనుమానాస్పద రీతిలో మృతి చెందిపడి ఉన్నాడు. అతని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలపకుండా అతని మృతదేహాన్ని పాతిపెట్టారు. ఈ క్రమంలో తన కుమారుడి మృతిపై సందేహం ఉన్నట్లు రాజా తల్లి ఆరూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అతని కుటుంబ సభ్యుల వద్ద విచారణ చేపట్టారు. పాతిపెట్టిన రాజా మృతదేహాన్ని బయటకు తీశారు. శవపరీక్ష కోసం ఆరూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టులో రాజా హత్య చేయబడినట్లు తెలిసింది. ఈ క్రమంలో కీరపట్టి వీఏఓ వద్ద రాజా భార్య కనక, భర్తను హత్య చేసినట్లు చెప్పి సరెండరైంది. దీంతో ఆమెను పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆమెను అరెస్టు చేసి విచారణ చేశారు. పోలీసులకు ఆమె వచ్చిన వాంగ్మూలంలో రాజాకు మద్యం అలవాటు ఉందని, ప్రతి రోజు మద్యం తాగి వచ్చి ఆమెను లైంగికంగా వేధిస్తున్నట్టు తెలిపింది. ఇద్దరి మధ్య తరచూ గొడవలు వచ్చాయని, ఈ క్రమంలో గత 30వ తేదీ మద్యం తాగి వచ్చిన రాజా వేధించడంతో విరక్తి చెందిన ఆమె అక్కడ ఉన్న ఇటుక రాళ్లతో భర్తపై దాడి చేసింది. దీంతో అతను మృతి చెందాడు. మృతదేహాన్ని రాత్రి సమయంలో ఎవరికీ తెలియకుండా లాక్కెళ్లి వంతెన వద్ద పడవేసినట్లు ఆమె చెప్పారు. దీంతో పోలీసులు ఆమెను కోర్టులో హాజరపరిచి జైలుకు తరలించారు.

### నగల దుకాణం దొంగ తండ్రి ఉరి వేసుకుని ఆత్మహత్య

తిరువొత్తియూరు: తన కుమారుడు నగల దుకాణంలో చోరీ చేసినట్టు తెలిసి ఆవేదన చెందిన తండ్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. ధర్మపురి జిల్లా కంబైనల్లూరు సమీపంలోని దేవరెడ్డియార్ ప్రాంతానికి చెందిన మునిరత్నం (50) కూలీ కార్మికుడు. ఇతని భార్య మారమ్మాల్. వీరి కుమారుడు విజయ్. ఇతనికి తల్లిదండ్రులకు గత రెండేళ్లుగా సంప్రదింపులు లేవు. ఈ క్రమంలో కోవై గాంధీపురంలో ఉన్న ప్రముఖ నగల దుకాణంలో 4.6 కిలోల నగలు చోరీ అయ్యాయి. దీనికి సంబంధించి రత్నపురి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అందులో మునిరత్నం కుమారుడు విజయ్ మాస్క్ ధరించి నగలను చోరీ చేసినట్లు తెలిసింది. దీంతో విజయ్‌ని పట్టుకోవడానికి పోలీసులు తీవ్రంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం విజయ్ తండ్రి ఇంటికి ప్రత్యేక బృందం పోలీసులు వచ్చారు. వారు మునిరత్నం, మారమ్మాల్‌ల వద్ద తీవ్రంగా విచారణ చేశారు. ఇంటిలో తనిఖీ చేయగా అక్కడ విజయ్‌కి చెందిన రెండు సెల్ ఫోన్లు ఉన్నట్లు తెలిసింది. సెల్‌ఫోన్ లను 38 గ్రాముల నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో అక్కడికి విజయ్ వచ్చి ఉండొచ్చని పోలీసులకు సందేహం ఏర్పడింది. ఈ క్రమంలో తన కుమారుడు దొంగగా మారాడని ఆవేదన చెందిన మునిరత్నం బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్ష చేయగా అతను మృతి చెందినట్లు తెలిసింది. అతని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ధర్మపురిలోని అటవీ ప్రాంతంలో విజయ్ దాగి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంలో అతని కోసం గాలిస్తూ ఉన్నారు.

# వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు

- అగ్నిమాపక సిబ్బంది సహకారం
- కన్నీళ్లతో బంధువుల కృతజ్ఞతలు



పడవలో వృద్ధురాలి మృతదేహాన్ని తీసుకుని వచ్చిన అగ్నిమాపక సిబ్బంది

కొరుక్కుపేట: చెన్నైలోని పులియాంతోపులో మరణించిన వృద్ధురాలి మృతదేహాన్ని పూడ్చడంలో అగ్నిమాపక సిబ్బంది సహకరించారు. వృద్ధురాలి బంధువులు కన్నీళ్లతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 4వ తేదీన తుపాను కారణంగా చెన్నై శివారు ప్రాంతాలు, మిగతా అన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో పలు ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యాయి. గర్భిణులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు పులియాంతోపు వెంకటేశపురం కాలనీ 3వ వీధికి చెందిన పూసమ్మ(76) వయోభారంతో గత సోమవారం మృతి చెందింది. అయితే భారీ వర్షాల కారణంగా పులియాంతోపు ప్రాంతమంతా నడుము వరకు జలమయమైంది. దీంతో వృద్ధురాలు పూసమ్మ మృతదేహాన్ని ఖననం చేయడం ప్రజలకు చాలా ఇబ్బందిగా మారింది. ఈ సందర్భంలో 5వ తేదీ పులియాంతోపు ప్రాంతంలో వరదనీరు తగ్గుతుందని బంధువులు అంచనా వేశారు. అయినా అక్కడ పేరుకుపోయిన నీటి పరిమాణం మాత్రం తగ్గలేదు. అనంతరం వ్యాసర్పాడి అగ్నిమాపక శాఖను ఆశ్రయించగా బంధువులకు అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఆపన్నహస్తం అందించారు. దీంతో వ్యాసర్పాడి అగ్నిమాపక స్టేషన్ అధికారి ఎడ్విన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అగ్నిమాపక సిబ్బంది పూసమ్మ ఇంటికి వెళ్లారు. గణేశపురం జీవా ఫ్లై ఓవర్ మీదుగా వ్యాసర్పాడికి తీసుకొచ్చి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అక్కడ నుంచి సమాధి వద్దకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

# అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీ లభ్యం

- నిజామాబాద్‌లో విద్యార్థులను గుర్తించిన రైల్వే పోలీసులు
- తిరుమల పోలీసులకు సమాచారం
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు



నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో చిన్నారులు

తిరుమల : తిరుమల నుంచి అదృశ్యమైన ముగ్గురు విద్యార్థులను నిజామాబాద్ రైల్వేపోలీసులు పట్టుకుని తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం స్థానిక ఎస్వీ హైస్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న ఎస్.చంద్రశేఖర్(13), వైభవ్ యోగేష్(13), జీ.శ్రీవర్ధన్(13)లు పాఠశాలలో మధ్యాహ్నం జరిగే పరీక్షకు హాజరుకాలేదు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో వారు గాలించినా కనపడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన తిరుమల టూటౌన్ ఎస్ఐ సాయినాథ్ చౌదరి దర్యాప్తులో భాగంగా తిరుమలలోని సీసీ కెమెరాల ద్వారా విద్యార్థులు తిరుపతి బస్టాండ్‌లో దిగినట్లు గుర్తించారు. అనంతరం అక్కడి నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్లి రైల్లో ప్రయాణం చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో పోలీసులు తమిళనాడు, హైదరాబాద్, బెంగళూరు వైపు వెళ్లే అన్ని రైళ్లకు సంబంధించి విద్యార్థులను ఫొటోలను ఆయా పోలీస్‌స్టేషన్లు, రైల్వే పోలీసులకు పంపారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా ఒంటరిగా ఉన్న ముగ్గురు విద్యార్థులను గుర్తించిన రైల్వే పోలీసులు పట్టుకుని విచారించడంతో తిరుమల వాసులుగా గుర్తించారు. అనంతరం తిరుమల పోలీసులకు సమాచారాన్ని అందించారు. విద్యార్థులు తప్పిపోయిన 24 గంటల్లో గుర్తించడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులను తిరుమలకు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించేందుకు తిరుమల టూటౌన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సాయినాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేకబృందం నిజామాబాద్‌కు వెళ్లి విద్యార్థులను తీసుకువస్తున్నారు.

### తైక్వాండోలో విద్యార్థినుల ప్రతిభ




పతకాలను సాధించిన విద్యార్థులను అభినందించిన వీసీ భారతి, రిజిస్ట్రార్ రజిని

తిరుపతి సిటీ: కర్ణాటకలోని గ్రాండ్ ట్రిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ నుంచి జరిగిన ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్–2023 పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినులు ప్రతిభ చూపి పతకాలు గెలుచుకున్నారు. అండర్–45 వెయిట్ కేటగిరీలో న్యాయవిభాగం విద్యార్థినులు దివ్య, పూజ, కాంస్య పతకాలను సాధించగా, అండర్–57 వెయిట్ కేటగిరీలో పూజ కాంస్య పతకం , అండర్–62 వెయిట్ కేటగిరీలో లావణ్య కుమారి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య భారతి, రిజిస్ట్రార్ ఆచార్య రజిని, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ సారా సరోజిని గురువారం విద్యార్థులను, కోచ్ రమణన్‌ను అభినందించారు.

# సహాయక చర్యలు విస్తృతంగా చేపట్టండి



ఎల్లప్పనాయుడుపేటలో నిత్యావసర సరుకులు అందజేస్తున్న మంత్రి రాణిపేట గాంధీ, ఎమ్మెల్యేలు

- మంత్రి రాణిపేట గాంధీ

తిరువళ్లూరు: ముంపు ప్రాంతాల్లో నిర్వాసితులను తమ వంతు సాయంగా డీఎంకే నేతలు, కార్యకర్తలు స్పందించి ఆదుకోవాలని రాష్ట్ర చేనేతశాఖ మంత్రి రాణిపేట గాంధీ పిలుపు నిచ్చారు. తిరువళ్లూరు జిల్లా పూండి యూనియన్ ఎల్లప్పనాయుడుపేట ఎస్టీకాలనీలో ముంపునకు గురైన వారికి సహాయకాలను అందజేసే కార్యక్రమం గురువారం ఉదయం జరిగింది. దాదాపు 327 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, నూనె తదితర సామగ్రిని మంత్రి తన సొంత నిధుల ద్వారా అందజేశారు. దీంతోపాటు వెన్మనంబుదూరు, తచ్చూరు తదితర రెండు గ్రామాల్లోని మరో 300 కుటుంబాలకు సైతం సహాయకాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గాంధీ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షం పడడంతో తీవ్ర నష్టం కలిగిందన్నారు. పలు లోతట్టు ప్రాంతాల్లో నివాసాలకు నీరు చేరడంతో జనం తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. వారికి తమ వంతు సాయం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. ఎమ్మెల్యేలు వీజీ రాజేంద్రన్, తిరుత్తణి చంద్రన్, పంచాయతీ ఉపాధ్యక్షురాలు గౌరీనాగరాజ్, డీఎంకే నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మారువేషంలో చోరీలు

- ఇద్దరు పట్టభద్రుల అరెస్టు

వేలూరు: వేలూరు సత్‌వచ్చారి సమీపంలోని పోస్టల్ నగర్‌కు చెందిన కుప్పుస్వామి భార్య గౌరీ. ఈమె గత నెల 16వ తేదీన ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా ఇద్దరు యువకులు గౌరీ మెడలో ఉన్న ఆరు సవర్ల బంగారు చైన్‌ను చోరీ చేసి బైకులో పరారయ్యారు. బైకులో వచ్చిన వ్యక్తులు హెల్మెట్, రెయిన్ కోట్ ధరించి ఉన్నారు. దీంతో గౌరీ సత్‌వచ్చారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో డీఎస్పీ తిరునావుక్కరసు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పడి చోరీ జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీటీవీ కెమెరాలను తనఖీ చేశారు. వీడియోలో యువకులు రోడ్డుపై వెళ్లకుండా కొండ వద్దకు వెళ్లినట్లు తెలిసింది. మరిన్ని సీసీటీవీ కెమరాలలో నిందితుల మొహం కనిపించడంతో పోలీసులు విచారణ చేపట్టారు. అలిమేలు రంగాపురానికి చెందిన ఇళంగోవన్ అని తెలిసింది. ఇతను పట్ట భద్రుడని తెలిసింది. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా గౌరీ వద్ద చైన్ చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. ఇతనితో పాటు పల్లిగొండకు చెందిన మరో పట్టభద్రుడు విమల్‌కుమార్‌తో కలిసి చోరీ చేసినట్లు తెలిపారు. ఈ చైన్‌ను సమీపంలోని దుకాణంలో విక్రయించినట్లు తెలిపారు. ఇద్దరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరూ కలిసి వేలూరులోని ప్రైవేటు బ్యాంకులో పనిచేసేవారని తెలిసింది. కరోనా కాలం నుంచి పనులు లేక పోవడంతో వేలూరు పాత బైపాస్ రోడ్డులో కారు వాషింగ్ దుకాణం నడిపి, నష్టాలు రావడంతో దుకాణాన్ని మూసి వేశారు. ప్రస్తుతం ఉపాధి లేక పోవడంతో మారువేషాల్లో పలు చోరీలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి వారి వద్ద నున్న బైకుతో పాటు చైన్‌ను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు.

# క్రీడాకారుడికి తుడా చైర్మన్ చేయూత



తైక్వాందో క్రీడాకారుడు మహేష్‌కు ఆర్థికసాయం అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తన దాతృత్వ సేవలను నిరంతరం కొనసాగిస్తూనే ఉన్నారు. జాతీయ స్థాయి తైక్వాండో క్రీడలో రాణిస్తున్న తిరుపతి రూరల్ పరిధిలోని లింగేశ్వర నగర్‌కు చెందిన మహేష్‌కు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. గురువారం తుమ్మలగుంట నివాసంలో క్రీడాకారుడు మహేష్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 2024 ఒలింపిక్స్‌లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. తాను జాతీయస్థాయిలో 2022లో నేపాల్‌తో పోటీ పడి విజేతగా నిలిచినట్లు మోహిత్‌రెడ్డికి తెలిపాడు. ప్రస్తుతం తాను ఢిల్లీలోని జాతీయ క్రీడా అకాడమీలో ఉంటూ 2024 ఒలింపిక్స్ పోటీలకు సిద్ధమవుతున్నట్లు చెప్పాడు. తన ఓ పెయింటర్ అని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు చెప్పడంతో మోహిత్‌రెడ్డి నగదు సాయం అందించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్‌కు మహేష్ కృతజ్ఞతలు తెలిపాడు.

# సైనికులు మాతృభూమికి విశిష్ట సేవలు



త్రిసాయిధ దళాల దినోత్సవం సందర్భంగా బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: సైనికులు మాతృభూమికి విశిష్ట సేవలు అందిస్తున్నారని డీఆర్వో పెంచల కిషోర్ అన్నారు. గురువారం త్రిసాయుధ దళాల పతాక దినోత్సవాన్ని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణకు వారు చేస్తున్న సేవలను కొనియాడారు. జవాన్లు త్యాగాన్ని స్మరించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. దేశంలోని ప్రతిపౌరుడు వారికి పెద్దఎత్తున వారికి విరాళాలు అందిస్తూ అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమ పర్యవేక్షకులు రజాక్ ఖాన్, వెంకట ప్రమోద్, వినాయక్‌రెడ్డి, వరదరాజులు, ఆనంద్‌రెడ్డి, కేసీ రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### తుపాను కారణంగా కులగణన వాయిదా

**మంత్రి వేణుగోపాల్ వెల్లడి**



**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఈ నెల 9వ తేదీ నుంచి జరగాల్సిన కులగణనను తుపాను కారణంగా వాయిదా వేసినట్టు సమాచార, బీసీ సంక్షేమ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వెల్లడించారు. తాడేపల్లిలో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో పంటనష్టం సంభవించిందని, అధికార యంత్రాంగం అంతా సహాయ కార్యక్రమాలలో నిమగ్నమై ఉన్నందున కులగణనను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నాక త్వరలో కులగణన తేదీని ప్రకటిస్తామన్నారు. తుపానుపై ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందని తెలిపారు. చంద్రబాబు అధికారం కోసం అసత్యాలు ప్రచారం చేస్తున్నాడని.. విపత్కర పరిస్థితులలో రాజకీయాలు కూడదని హితవు పలికారు.

### తుపాను ప్రభావిత ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటన

**సాక్షి, అమరావతి:** టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు గురువారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. శుక్రవారం గుంటూరు జిల్లాలోని పొన్నూరు, వేమూరు, తెనాలి, బాపట్ల నియోజకవర్గాల్లోని పలు గ్రామాలను సందర్శిస్తారు. రాత్రికి బాపట్లలో బస చేస్తారు. శనివారం పర్చూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని తుపానుతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులను పరామర్శించనున్నారు.

### రేవంత్‌రెడ్డి వియ్యంకుడి షోరూం వద్ద సంబరాలు



కేక్ కటింగ్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, షోరూం సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్):తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడాన్ని పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆయన వియ్యంకుడు వెంకటరెడ్డికి చెందిన రెడ్డి అండ్ రెడ్డి బైక్ షోరూం వద్ద గురువారం సంబరాలు నిర్వహించారు. షోరూం సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. రేవంత్‌రెడ్డి కుమార్తెను వెంకటరెడ్డి కుమారుడు వివాహం చేసుకున్నారు.

### ధాన్యం మొత్తం ప్రభుత్వం కొంటుంది

**రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి**



**తణుకు టౌన్ :** తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొంటుందని, రైతులందరినీ ఆదుకుంటుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంత్రి గురువారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో భారీ వర్షాల కారణంగా కల్లాల్లో తడిసిన ధాన్యం రాసులను పరిశీలించి, రైతులకు ధైర్యం చెప్పారు. వయ్యేరు గట్టుపై గుడిసెలలో నివసించేవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల నుంచి ధాన్యాన్ని కొనాలని మిల్లర్లను ఆదేశించినట్టు తెలిపారు. తుపాను కారణంగా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా సీఎం జగన్ ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారని, సహాయక చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

### శిష్యులు సీఎంలు.. చంద్రబాబు ఏడుపులు: నాని



**గుడ్లవల్లేరు :** తెలంగాణలో తన శిష్యులు వరుసగా సీఎంలు అవుతుంటే.. వెక్కెక్కి ఏడ్చే వంతు చంద్రబాబు తీసుకున్నాడని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) ఎద్దేవా చేశారు. కృష్ణా జిల్లా వడ్లమన్నాడులో పంట నష్ట పరిహారం పరిశీలించేందుకు గురువారం వచ్చిన కొడాలి నాని.. మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బాబు శిష్యులు సీఎంలు అవుతుంటే ఆయన మాత్రం తాను ఎన్నటికీ ఇక సీఎం కాలేనని తనలో తాను కుమిలిపోతున్నాడని నాని చెప్పారు. హైదరాబాద్ గాంధీ భవన్ ఎదుట టీడీపీ జెండాలతో సిగ్గు లేకుండా పచ్చ బ్యాచ్ సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంబరాలను టీడీపీ చేస్తుంటే ఆ పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆత్మ క్షోభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు దూరమైన బాబు అండ్ కో.. ఇలాంటి ఎన్ని వేషాలు వేసినా ఆయనను జనం సీఎం పీఠం దరిదాపులకు కూడా రానివ్వరని చెప్పారు. సీఎం జగనే కొన్ని దశాబ్దాల పాటు ఏపీ సీఎంగా వర్ధిల్లేందుకు ప్రజల ఆశీర్వాదం ఉందని కొడాలి నాని తెలిపారు.

# తెలియక కాదు.. అతితెలివి!!

**రైతులను గందరగోళ పరిచేలా రామోజీ కట్టు కథలు ● పంటల బీమాపై రహస్యాలంటూ పనికిమాలిన రాతలు**

- రైతుల వివరాలన్నిటినీ నెల కిందటే కేంద్రానికి పంపిన రాష్ట్రం
- రికార్డుల డిజిటలైజేషన్ సైతం పూర్తి చేసిన కేంద్రం
- ప్రీమియం ఖరారు చేసి చెల్లించేందుకు ఏప్రిల్ దాకా సమయం
- వచ్చే సీజన్ మొదలయ్యేలోగా (జూన్) బీమా పరిహారం చెల్లింపు
- ఈ వాస్తవాలన్నిటినీ తొక్కిపట్టి 'ఈనాడు' దొంగనాటకాలు
- రైతులను గందరగోళ పరిచేలా రహస్యమంటూ పిచ్చిరాతలు
- రైతులపై రూపాయి భారం పడకుండా బీమా కల్పిస్తున్నది ఇక్కడే
- 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఇలాంటి ఆలోచన చేస్తే ఒట్టు
- అయినా బాబు హయాంలోనే రామరాజ్యం అన్నట్టుగా రాతలు
- 2014–19 మధ్య ఐదేళ్లూ కరువు; అయినా బాబు చెల్లించిన బీమా అంతంతే
- కేవలం 30.85 లక్షల మంది రైతులకు రూ.3,411 కోట్ల చెల్లింపు
- 2019 నుంచీ ప్రతి ఎకరాకూ ఉచిత బీమాను అమలు చేస్తున్న జగన్
- దీంతో ఇప్పటికే 54.48 లక్షల మంది రైతులకు రూ.7,802 కోట్ల చెల్లింపు
- ఎవరి హయాంలో రైతులు ధీమాగా ఉన్నారో ఈ అంకెలే చెబుతాయి

**సాక్షి, అమరావతి:** నూటికి నూరుశాతం రైతులంతా ఈ–క్రాప్ చేసుకున్నారు. ఆ జాబితాను అక్టోబరు నెలాఖరు నాటికే... అంటే దాదాపు నెల కిందటే కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపించింది. జాతీయ పంటల బీమా పోర్టల్‌లో నమోదు కూడా పూర్తయింది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వ సాంకేతిక బృందం పరిశీలించి... అనంతరం డేటాను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పోర్టల్‌లో ప్రదర్శిస్తారు. రాష్ట్రప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియంను కూడా నిర్ధారించేది అప్పుడే. దీనికి ఏప్రిల్ దాకా సమయం ఉంది. ఇక బీమా చెల్లింపులనేవి వచ్చే సీజన్ మొదలయ్యేలోగా... అంటే జూన్‌లోగా జరుగుతాయి. ఇదీ ప్రక్రియ.

మరి రామోజీరావుకు అంత కంగారెందుకు? రైతులంతా నూటికి నూరుశాతం బీమా ఉందన్న ధీమాతో ఉంటే... రామోజీకెందుకు అంత గుబులు పుడుతోంది? ఎక్కడో కేంద్ర వెబ్‌సైట్లో 'ఈనాడు'కు డేటా కనిపించకపోతే.. దానిక్కూడా ముఖ్యమంత్రి జగన్‌ను బాధ్యుడిని చేస్తూ దిగజారుడు రాతలు రాస్తున్నారంటే వీళ్లనేమనుకోవాలి?

2023 ఖరీఫ్ సీజన్లో ఈ–క్రాప్‌లో ఏకంగా 70.80 లక్షల ఎకరాల్లోని పంటల వివరాలు, సాగు చేసిన 34.70 లక్షల మంది రైతుల పేర్లు కేంద్రానికి ఎప్పుడో చేరాయి. ఆ సంగతి 'ఈనాడు'కూ తెలుసు. కేంద్ర సాంకేతిక బృందం పరిశీలన పూర్తవకపోవడం వల్ల వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌డేట్ కాకపోయి ఉండొచ్చు. దాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్రంపై బురద జల్లాలనుకుంటున్న రామోజీరావు మానసిక స్థితిని ఎలా అర్థం చేసుకోవాలి? కనీసం కేంద్రం ఆ వివరాలను ఇచ్చే వరకూ ఆగే ఓపిక కూడా లేదా? రాష్ట్రంలో రైతులపై రూపాయి కూడా బీమా ప్రీమియం భారం పడకుండా ప్రభుత్వమే మొత్తం చెల్లిస్తున్న విషయాన్ని ఎన్నడైనా ప్రశంసించారా రామోజీ? నష్టపోయిన ప్రతి రైతు ఖాతాకూ నేరుగా బీమా మొత్తం జమవుతుండటాన్ని ఏనాడైనా గ్రహించారా? చంద్రబాబు నాయుడి హయాంలో జరగనివన్నీ ఇపుడు జరుగుతుండటాన్ని ఏనాడైనా గుర్తించారా అసలు?

▲ అభూత కల్పనలు.. కట్టు కథలతో వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద జల్లటమే 'ఈనాడు' పని. రైతులను గందరగోళపరిచి బాబుకు లబ్ధి చేకూర్చే ప్రయత్నమే గురువారం నాటి 'ఉచిత బీమాపై జగన్నాటకం!' కథనం. ఈ క్రాప్ నమోదే ప్రామాణికంగా నోటిఫై చేసిన ప్రతి పంటకు, సాగు చేసిన ప్రతి ఎకరాకు యూనివర్సల్ బీమా కవరేజ్‌తో రైతులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయటమంటే సెల్ఫ్ గోల్ కొట్టుకోవటమేనన్న కనీస జ్ఞానం కూడా 'ఈనాడు'కు లోపించటమే దారుణం.

**బాబు హయాంలో ఐదేళ్లూ కరువే.. అయినా!!**

చంద్రబాబు సీఎంగా ఉన్న ఐదేళ్లూ కరువు తాండవిస్తూనే వచ్చింది. పైపెచ్చు అప్పుడప్పుడూ వచ్చిన అకాల వర్షాలు రైతాంగాన్ని దారుణంగా దెబ్బతీశాయి. అయినా సరే... ఆ ఐదేళ్లలో చెల్లించిన బీమా పరిహారం కేవలం కేవలం రూ.3,411 కోట్లు. అది కూడా 30.85 లక్షల మంది రైతులకు. అయితే వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ×డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకా×న్ని ప్రవేశ పెట్టారు. రైతు జేబు నుంచి పైసా చెల్లించాల్సిన అవసరం లేకుండా పూర్తి ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేలా ఈ పథకాన్ని రూపొందించారు. నూరుశాతం పంటల్ని ఈ క్రాప్‌లో నమోదు చేస్తూ.. నమోదైన ప్రతి ఎకరాకూ నష్టపోయిన పక్షంలో బీమా పరిహారం అందిస్తున్నారు. నిజానికి ఈ నాలుగున్నరేళ్లలో పెద్దగా కరువు లేదు. విపత్తులూ తక్కువే. అయినా సరే... ప్రతి ఎకరాకూ కవరేజీ ఉండటంతో ఈ నాలుగేళ్లలో 54.48 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.7,802 కోట్ల బీమా పరిహారం అందింది. అంటే బాబు హయాంకన్నా దాదాపు ఒకటిన్నర రెట్లు అధికం. దీన్నిబట్టి బాబు హయాంలో బీమా ఏ స్థాయిలో అందిందో ఊహించుకోవచ్చు. కానీ రామోజీరావు ఎన్నడూ చంద్రబాబును ప్రశ్నించనే లేదు. పైపెచ్చు ఈ ప్రభుత్వంపై దారుణమైన విమర్శలు చేస్తూ అంతకంతకూ దిగజారిపోతున్నారు.

**ఇంత పారదర్శకంగా ఎక్కడా ఉండదు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రతి సీజన్లో నోటిఫై చేసిన పంటలకు బీమా వర్తింపజేస్తున్నారు. సామాజిక తనిఖీ, గ్రామ సభల అనంతరం ఈ–క్రాప్ జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. తొలుత డిజిటల్ రశీదులో సాగు చేసిన పంట వివరాలను రైతులకు పంపుతారు. ఈ క్రాప్‌తో పాటు ఈ కేవైసీ నమోదు పూర్తికాగానే భౌతిక రశీదులు ఇస్తారు. ఇందులో ఉచిత పంటల బీమా పథకం వర్తించే నోటిఫై చేసిన పంటలను (స్టార్ గుర్తుతో) ప్రత్యేకంగా తెలియజేస్తూ సంబంధిత సాగుదారు సంతకంతో ఇస్తారు. ఇందులో 'డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద నోటిఫై చేసిన మీ పంటకు మీరు చెల్లించాల్సిన ప్రీమియం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి తద్వారా పంట బీమా చేయబడినది' అని స్పష్టంగా పేర్కొంటున్నారు. ఇదీ పారదర్శకత అంటే.

**సర్కారు చిత్తశుద్ధికి ఇంతకంటే నిదర్శనం ఉంటుందా?**

వైఎస్ జగన్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే నోటిఫై చేసిన పంటలకు సాగైన ప్రతి ఎకరాకు బీమా రక్షణ కల్పిస్తోంది. కేంద్ర నిబంధనల మేరకు ఏ జిల్లాలోనైనా కనీసం 2 వేల హెక్టార్లకు పైబడి సాగవ్వాలి. ఇది కొత్త నిబంధనేమీ కాదు. దశాబ్దాలుగా ఉన్నదే. మరింత మంది రైతులకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా ఈ పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత వ్యవసాయ సీజన్ నుంచి మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చింది. గతంలో చంద్రబాబు ఏలుబడిలో ఒకే పంటకు కొన్ని చోట్ల దిగుబడి ఆధారంగా, మరికొన్ని చోట్ల వాతావరణ ఆధారంగా బీమా వర్తింపజేసేవారు. దీంతో ఒకేలా నష్టం వాటిల్లినా పరిహారంలో వ్యత్యాసంతో రైతులకు నష్టం జరిగేది. ఈ పరిస్థితిని చక్కదిద్ది నోటిఫై చేసిన పంటలు ఏ కేటగిరీ కింద సాగైనా ఒకే రీతిలో బీమా రక్షణ కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ చర్యలు చేపట్టారు. అంతే కాదు.. పెరిగిన సాగు విస్తీర్ణాన్ని బట్టి కొత్త పంటలను బీమా పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ సీజన్‌లో జిల్లాలవారీగా కవరేజ్ కల్పించే కంపెనీలతో పాటు నోటిఫైడ్ పంటల వివరాలు, పూర్తి మార్గదర్శకాలతో ఇటీవలే నోటిఫికేషన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఖరీఫ్‌లో మిరప, పసుపు, జొన్న పంటలకు దిగుబడి ఆధారంగా, పత్తి, వేరుశనగ పంటలకు వాతావరణ ఆధారంగా బీమా కవరేజ్ కల్పించారు. అలాగే దానిమ్మ, బత్తాయి, నిమ్మ, జీడిమామిడి, పంటలకు వాతావరణ ఆదారం గా బీమా కల్పించగా, కొత్తగా కొన్ని జిల్లాల్లో ఆముదం పంటకు కూడా బీమా రక్షణ కల్పించారు. ఇంతకంటే చిత్తశుద్ధి ఇంకేంకావాలి?

**పొరుగు రాష్ట్రాలు ఏపీ బాట పట్టడం కన్పించదా రామోజీ..!**

రైతులపై పైసా భారం పడకుండా నోటిఫై చేసిన పంటలన్నింటికీ ఈ క్రాప్ ఆధారంగా యూనివర్సల్ బీమా కవరేజ్ కల్పిస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిగడించింది. ఉచిత పంటల బీమా పథకంగా జాతీయ స్థాయిలో కేంద్రం నుంచి అవార్డు కూడా లభించింది. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన ఈ అత్యుత్తమ పథకాన్ని మిగతా రాష్ట్రాలూ ఇప్పుడు మొదలుపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఏపీ స్ఫూర్తితో 2023–24 వ్యవసాయ సీజన్ నుంచి కేవలం రూపాయి ప్రీమియంతో నోటిఫైడ్ పంటలు సాగు చేసే రైతులందరికీ బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, మేఘాలయ రాష్ట్రాలు ఇటీవలే ప్రకటించాయి. మరికొన్ని రాష్ట్రాలూ ఏపీ బాటలో నడిచేందుకు సిద్ధమవుతున్నాయి.

### రైతులకు రక్షణ కల్పిస్తున్నది ఎవరు?

చంద్రబాబు సీఎంగా ఉన్న 14 ఏళ్లలో ఉమ్మడి రాష్ట్రంలోకానీ, విభజన తర్వాత ఏర్పడ్డ ఏపీలో గానీ ఎన్నడూ రైతులకు ఉచిత పంటల బీమా కల్పించాలన్న ఆలోచనే చేయలేదు. అధిక ప్రీమియం చెల్లించాల్సి రావడంతో ఆర్థిక స్థోమత లేక లక్షలాది రైతులు బీమా చేయించుకోలేకపోయేవారు. భారీగా నష్టపోయేవారు. బీమా చేయించుకున్న వారికి కూడా ఏళ్ల తరబడి ఎదురు చూస్తే తప్ప పరిహారం ఇచ్చేవారు కారు. ఏ పంటకు ఎంత పరిహారం వచ్చేదో కూడా దాపరికమే. పైగా ఆయన హయాంలో 6.19 లక్షల మందికి బీమా సొమ్ము ఎగ్గొట్టారు. ఇలా ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల పంటల బీమా పరిహారాన్ని సైతం చెల్లించి రైతుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌దే. బాబు హయాంలో 2014–18 మధ్య 2.32 కోట్ల ఎకరాల్లో సాగైన పంటలకు బీమా కవరేజ్ కల్పించగా, 74.4 లక్షల మంది బీమా పరిధిలోకి వచ్చారు. ఈ ప్రభుత్వ పాలనలో 2019–23 మధ్య ఏకంగా 3.97 కోట్ల ఎకరాల్లో సాగైన పంటలకు, 170.34 లక్షల మంది రైతులకు బీమా రక్షణ కల్పించారు. అంటే రైతులను ఆదుకుంటున్నదెవరు? రైతును కుదేలు చేసిందెవరు? ఆ మాత్రం తెలుసుకోలేరా రామోజీరావు గారూ?



ఉచిత బీమాపై జగన్నాటకం!

బలహీనపడిన తుపాను

**టీడీపీ హయాంలో చెల్లించిన బీమా వివరాలు**

| సీజన్ | రైతులు (లక్షల్లో) | లబ్ధి పొందిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2014-15 | 1.03 | 132.24 |
| 2015-16 | 4.35 | 339.7 |
| 2016-17 | 8.70 | 954.75 |
| 2017-18 | 6.77 | 720.6 |
| 2018-19 | 10 | 1263.91 |
| (ఖరీఫ్-2018) మొత్తం | 30.85 | 3,411.20 |

**వైఎస్ జగన్ ప్రభుత్వం గత నాలుగేళ్లలో చెల్లించిన బీమా వివరాలు**

| సీజన్ | రైతులు (లక్షల్లో) | బీమా మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| గత ప్రభుత్వ బకాయిలు | 6,19,641 | 715.84 |
| ఖరీఫ్ 2019 | 9,48,000 | 1,252.18 |
| ఖరీఫ్ 2020 | 13,00,000 | 1,739 |
| ఖరీఫ్-2021 | 15,60,703 | 2,977.82 |
| ఖరీఫ్-2022 | 10,20,000 | 1,117.21 |
| మొత్తం | 54,48,344 | 7,802.05 |

# బుచ్చయ్యకు పొత్తు సెగ!

- రాజమండ్రి రూరల్ టీడీపీ ఎమ్మెల్యేకి వచ్చే ఎన్నికల్లో మొండిచేయే
- బుచ్చయ్య చౌదరి స్థానం జనసేనకు ఇచ్చేందుకు రంగం సిద్ధం
- ఆ దిశగా ఇప్పటికే అధిష్టానం నుంచి సంకేతాలు
- పార్టీలో సీనియర్ నేతను పక్కన పెట్టడంపై కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి

**సాక్షి, రాజమహేంద్రవరం:** టీడీపీ, జనసేన పొత్తు సెగ టీడీపీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరికి తగిలిందా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాజమండ్రి రూరల్ అసెంబ్లీ స్థానం జనసేనకు కేటాయించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతుండటంతో బుచ్చయ్యకు భంగపాటు తప్పదు అని చెబుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న బుచ్చయ్య.. టీడీపీలో చంద్రబాబు కంటే సీనియర్. ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఒకసారి మంత్రిగా పనిచేశారు. పొలిట్ బ్యూరో సభ్యుడిగా క్రియాశీల పాత్ర పోషించారు. అలాంటి బుచ్చయ్యకు జనసేనతో పొత్తు వల్ల ఇప్పుడు సీటు దక్కే పరిస్థితి లేకుండా పోతోంది. వచ్చే ఎన్నికల్లో బుచ్చయ్య స్థానంలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నేత కందుల దుర్గేష్ పోటీకి ఇరు పార్టీల అధినేతల నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఇప్పటికే బుచ్చయ్యకు స్పష్టత ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనికి తోడు తానే అభ్యర్థినంటూ దుర్గేష్ కూడా ఇప్పటికే ప్రచారం



చేసుకుంటున్నారు. తాను నమ్ముకున్న పార్టీయే తన సీటుకు ఎసరు పెడుతోందని తెలిసి బుచ్చయ్య ఆగ్రహంగా ఉన్నారని తెలిసింది. సీనియర్ నేతకు ఇలాంటి పరిస్థితి తీసుకురావడం పట్ల స్థానిక టీడీపీ కార్యకర్తలు, బుచ్చయ్య అభిమానులు అధిష్టానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చూపేందుకు సిద్ధమవుతున్నారు.

**లోక్‌సభ పేరుతో సాగనంపేందుకు..**

పొమ్మనలేక పొగబెట్టే క్రమంలో రాజమండ్రి పార్లమెంట్ స్థానం నుంచి బరిలోకి దిగాలని బుచ్చయ్యకు టీడీపీ అధిష్టానం సూచించినట్లు తెలిసింది. తనకు ఇష్టం లేకపోవడంతో బుచ్చయ్య ససేమిరా అన్నట్లు సమాచారం. తాను రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగానే పోటీ చేస్తానని చెప్పినట్లు తెలిసింది. మరోపక్క రాజమండ్రి సిటీ స్థానం టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ భర్త ఆదిరెడ్డి వాసుకు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు ఇక్కడి జైల్లో ఉన్నపుడు ఆయన కుటుంబం రాజమండ్రిలోనే బస చేసింది. అందుకు తగ్గ ఏర్పాట్లు చేసి వాసు అధిష్టానం దృష్టిలో పడ్డాడని దాంతో అతనికే టికెట్ ఇస్తారని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో బుచ్చయ్యకు సిటీ ఆశ కూడా అడియాసగా మారింది. పైగా చంద్రబాబు జైల్లో ఉన్నపుడు ఒక్కసారి కూడా బుచ్చయ్యకు ములాఖత్ అవకాశం ఇవ్వలేదు. అంతేగాక టీడీపీ, జనసేన నేతల ఉమ్మడి సమన్వయ కమిటీలో కూడా సీనియర్ నేత బుచ్చయ్యకు చోటు కల్పించలేదు. ఇలా అధిష్టానం బుచ్చయ్యను అవమానిస్తూ మానసిక క్షోభకు గురి చేస్తోందంటూ ఆయన అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సీఎం పదవిపై బాబు, నేను నిర్ణయించుకుంటాం!

- ఏదైనా ముందుగా చెప్పే చేస్తా
- టీడీపీకి వెనుక కాదు.. ఆ పార్టీతో కలిసి నడుస్తున్నా
- నా ఓటమి ఆగలేదు.. కొనసాగుతూనే ఉంది
- విశాఖ సభలో పవన్ కళ్యాణ్



పవన్ ప్రసంగిస్తుండగా జనం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

**సాక్షి, విశాఖపట్నం:** ముఖ్యమంత్రి పదవి ఎవరు చేపట్టాలనే విషయంపై చంద్రబాబు, తాను నిర్ణయించుకుంటామని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. గురువారం సాయంత్రం విశాఖలో ఏర్పాటు చేసిన సభలో పవన్ ప్రసంగించారు. తాను ఏదైనా ముందుగా చెప్పే చేస్తానని.. లోపాయికారీ పనులు చేయనన్నారు. తనను అందరూ టీడీపీ వెనుక వెళ్తున్నానని అంటున్నారని, కానీ ఆ పార్టీతో కలిసి నడుస్తున్నానని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితుల దృష్ట్యా తనను తాను తగ్గించుకుంటున్నానని, తనకు పొత్తు తప్ప మరో మార్గం లేదన్నారు. దశాబ్ద కాలంగా నుంచి తాను ఎదురు దెబ్బలు తింటున్నానని, తనను ఓటమి వెంటాడుతూనే వుందని ఆవేదన చెందారు. తన పోరాటం అధికారం కోసం కాదని, ఓట్ల మార్పు కోసమేనన్నారు. గెలిచిన ఒక్క ఎమ్మెల్యే కూడా చేజారిపోతే ఎంతో బాధపడ్డానన్నారు. తన వెంట ఎవరు వచ్చినా.. రాకున్నా ఒంటరిగానైనా ముందుకెళ్తాను తప్ప మరో పార్టీలో విలీనం చేయనని చెప్పారు. తన వద్ద డబ్బు లేకపోయినా అందుకే పార్టీని నడుపుతున్నానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన అభ్యర్థులను ఎక్కువ సంఖ్యలో గెలిపిస్తే అప్పుడు ఏర్పడబోయే ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసే అవకాశం ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎవరైనా ఓటుకు డబ్బు ఇస్తే తీసుకోవాలని, కానీ మార్పు కోసం ఓటేయాలని కోరారు. జనసేన అధికారంలోకి వస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తానే తప్ప రద్దు చేయనని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్ జాబ్ కేలండర్ అమలులో విఫలమయ్యారని విమర్శించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ వల్ల పంచాయతీలు నిర్వీర్యమయ్యాయన్నారు. తన కృషి వల్లే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తాత్కాలికంగా ఆగిందని.. ఆ విషయం బీజేపీ జాతీయ నాయకులు తనకు చెప్పారని పవన్ చెప్పుకున్నారు.

**జనం లేక వెలవెల**

పవన్ కళ్యాణ్ సభ జనం లేక వెలవెలబోయింది. జనం రాకపోవడంతో తాను బస చేసిన హోటల్ లోనే సాయంత్రం వరకు ఉండిపోయారు. ఎట్టకేలకు సభకు వచ్చినా కుర్చీలు ఖాళీగా ఉండటంతో కంగుతిన్నారు. ఖాళీ కుర్చీలను చూసిన నాయకులు బయట ఉన్న జనం లోపలకు రావాలని అభ్యర్థించినా ప్రయోజనం లేకపోయింది. ఉన్న కొద్దిపాటి జనం కూడా పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తుండగానే నిష్క్రమించారు. కాగా.. జనసేన నాయకుడు సుందరపు విజయకుమార్ సోదరుడు వెంకట సతీష్‌కుమార్ పార్టీలో చేరుతున్న సందర్భంగా విశాఖలో ఈ సభ ఏర్పాటు చేశారు. అయితే సతీష్‌కుమార్ పదేళ్లుగా జనసేనకు సానుభూతిపరుడిగా ఉన్నారు. ఇన్నాళ్లూ పార్టీకి పనిచేస్తుండగా ఇప్పుడు కొత్తగా పార్టీలో చేరడమేమిటని జనసేన కార్యకర్తలు సభలో చర్చించుకున్నారు.

# తెలంగాణలో కొలువు తీరిన కొత్త సర్కారు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో గురువారం మధ్యాహ్నం 1:19 గంటలకు ఆయన చేత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రమాణం చేయించారు. రేవంత్‌తోపాటు ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, కేబినెట్ మంత్రులుగా ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు ప్రమాణం చేశారు. కాంగ్రెస్



ప్రమాణ స్వీకారం చేస్తున్న రేవంత్‌రెడ్డి

పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ, కర్ణాటక, హిమాచల్ సీఎంలు



ప్రమాణ స్వీకారానికి వెళుతూ పూజా మందిరంలో వైఎస్ ఫొటోకు నమస్కరిస్తున్న భట్టి

సిద్దరామయ్య, సుఖ్విందర్‌సింగ్ సుక్కు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌లతోపాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా మంత్రులందరిలో సీతక్క ప్రమాణ స్వీకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంత్రిగా సీతక్క పేరు ప్రకటించగానే ఎల్బీ స్టేడియం మొత్తం హర్షధ్వానాలతో హోరెత్తింది.

**టీడీపీ కార్యకర్తల హల్‌చల్..**

ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం మొదలైన సమయంలో.. ఏపీకి చెందిన టీడీపీ నాయకులు ఆ పార్టీ జెండాలు పట్టుకొని స్టేడియంలో హల్‌చల్ చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై కాంగ్రెస్ కార్యకర్తలు మండిపడుతూ.. టీడీపీ కార్యకర్తలను చితకబాదడంతో అక్కడి నుంచి పారిపోయారు. కాంగ్రెస్ సభలో టీడీపీ జెండాలు ఏమిటని, మళ్లీ టీడీపీ జెండాలు కనిపిస్తే పీకి పారేయాలని సీనియర్ లీడర్లు కార్యకర్తలకు సూచించారు.

### తెలంగాణ కొత్త ప్రభుత్వానికి సీఎం జగన్ శుభాకాంక్షలు

**సాక్షి, అమరావతి:** తెలంగాణలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, మంత్రులకు శుభాకాంక్షలు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదరభావం, సహకారం పరిఢవిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు గురువారం సీఎం జగన్ ట్వీట్ చేశారు.

**తెలుగు రాష్ట్రాల సంబంధాలు బాగుండాలి: మంత్రి బొత్స**

తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి అభినందనలు తెలిపారు.

### చంద్రబాబు కారుకూతలు.. రామోజీ రోత రాతలు

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి**

**సాక్షి ప్రతినిధి, నెల్లూరు:** ఖరీఫ్ సీజన్‌కు నోటిఫై చేసిన పంటలను 70.8 లక్షల ఎకరాలకు 34.7 లక్షల మంది రైతుల సమాచారాన్ని అక్టోబర్ నెలలోనే కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. కానీ రైతులకు మేలు జరగలేదనే విధంగా ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు కారుకూతలు కూస్తుంటే.. రామోజీరావు పచ్చపత్రిక రోత రాతలు రాస్తోందని మంత్రి కాకాణి విమర్శించారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా డాక్టర్ వైఎస్సార్ పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఏపీనేనన్నారు. బీమాకు సంబంధించి రైతు వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించి కేంద్రానికి పంపిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ టెక్నికల్ బృందం రైతువారీ వివరాలను పరిశీలన చేస్తూ టెస్టింగ్ కోసం కొన్ని వివరాలు అప్‌లోడ్ చెయ్యగా వాటి మీద రామోజీ రోత రాతలు రాశారని చెప్పారు. ఈ క్రాప్‌లో నమోదు చేసిన నోటిఫైడ్ పంటలకు బీమా వర్తిస్తుందని, ఇన్‌పుట్ సబ్సిడీ మాత్రం అన్ని పంటలకు అందజేస్తామని అన్నారు.

**వేగంగా సహాయక చర్యలు**

మిచాంగ్ తుపాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయకచర్యలు వేగంగా జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంతో తుపాను నష్టం తగ్గిందని అన్నారు. పంట నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామన్నారు. నష్టం వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి రైతులకు వెల్లడిస్తామని చెప్పారు.

### స్టీల్‌ప్లాంట్‌పై పవన్ కళ్యాణ్ ప్రకటన సత్యదూరం

**ఉక్కు పోరాట కమిటీ నాయకులు**

**ఉక్కు నగరం:** తాను మాట్లాడిన తర్వాతే హోంమంత్రి అమిత్ షా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ ఆపారని పవన్ కళ్యాణ్ చేసిన ప్రకటన సత్యదూరమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ నూరు శాతం ప్రైవేటీకరణ చేస్తాం.. చేయనివ్వకపోతే మూసేస్తామని ప్రకటనలు చేసిందన్నారు. అప్పటి నుంచి ఒక్కో విభాగాన్ని మూసేస్తూ.. ఉత్పత్తిని పూర్తిగా తగ్గించి, ఉత్పత్తికి కావాల్సిన ముడి పదార్థాలు కొనుగోలు చేయకుండా కృత్రిమ కొరత సృష్టిస్తోందన్నారు. 3 లక్షల కోట్ల ఆస్తులు కలిగిన స్టీల్‌ప్లాంట్‌కు బ్యాంకు రుణాలు ఇవ్వకుండా ఒత్తిడి తెచ్చి బ్యాంకులపై భారీ ఆంక్షలు విధిస్తోందన్నారు. ఉక్కు ఉత్పత్తికి 45 రోజులు ఐరన్ ఓర్, బొగ్గు, నిల్వలు ఉండాలని.. కానీ ఒకట్రెండు రోజుల ఉత్పత్తికి కావాల్సిన ముడి సరుకు నిల్వలతో ప్రమాదపు అంచుల్లో ఉందన్నారు. ఉద్యోగులకు సరిగా జీతాలు చెల్లించలేని పరిస్థితికి నెట్టబడిన ప్రస్తుత తరుణంలో ప్రైవేటీకరణ ప్రక్రియ ఆగిందని పవన్ కళ్యాణ్ ప్రకటించడం ఆయన స్థాయికి తగదన్నారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాతో నేరుగా మాట్లాడి ప్లాంట్‌ను చంపకుండా పవన్ ఆపాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

### పల్లెల్లో తిరిగే అర్హత చంద్రబాబుకు ఎక్కడిది?

**అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి**

**సాక్షి, అమరావతి:** రైతులను ఏనాడూ పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని 'మన గ్రామం–ఆత్మగౌరవం' పేరిట జిల్లాల్లో పర్యటిస్తారని రాష్ట్ర అగ్రి మిషన్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పల్లెల్లో ఉండే రైతు ఆత్మగౌరవం గురించి ఏ రోజైనా తెలుసుకోవాలనే ఆలోచన చంద్రబాబుకు కలిగిందా అని నిలదీశారు.

**పంట నష్టంపై చంద్రబాబు విష ప్రచారం**

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతుల్లో ఆత్మస్థైర్యం కలిగించాలే గానీ వారిలో ఆందోళన కలిగించేలా విష ప్రచారం చేయడం చంద్రబాబుకు ఏమాత్రం సబబు కాదని నాగిరెడ్డి పేర్కొన్నారు. తిత్లీ తుపాను సమయంలో హెక్టారుకు రూ.20 వేల చొప్పున వరికి నష్టపరిహారం చెల్లించేలా జీవో ఇచ్చినట్టు చంద్రబాబు చెప్పుకుంటున్నారని.. నిజానికి తిత్లీ తుపాను వల్ల నష్టపోయిందంతా ఉద్దానం ప్రాంతంలోని ఉద్యాన పంటలు మాత్రమేనని గుర్తు చేశారు. తిత్లీ తుపాను వల్ల నష్టపోయిన ఉద్యాన రైతులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రూ.182.63 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశారని గుర్తు చేశారు.

**రైతుల ఆశలపై తుపాను నీళ్లు చల్లింది**

ఈ ఏడాది ఖరీఫ్‌లో కృష్ణా, గోదావరి డెల్టాల్లో వరి బ్రహ్మాండంగా పండిందని నాగిరెడ్డి చెప్పారు. ఎకరాకు 38 నుంచి 45 బస్తాల మధ్య దిగుబడులొస్తున్న తరుణంలో మిచాంగ్ తుపాను రైతుల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. రైతులు సంతోషంగా కోతలు మొదలుపెట్టే సమయానికి తుపాను ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టిందని ఆయన అన్నారు.






## బ్యూటిప్స్

● ముల్తాని మట్టిలో గంధంపొడి, కొద్దిగా రోజ్‌వాటర్ వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా రాసి చక్కగా ఎండిన తరువాత కడిగేయాలి. వారానికి నాలుగు సార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖం మరింత అందంగా మెరిసిపోతుంది.

● పెరుగులో టొమాటో గుజ్జును వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసుకుని పదిహేను నిమిషాలు మర్దన చేయాలి. తరువాత పూర్తిగా ఆరాక కడిగేయాలి. ఇలా చేయడం వల్ల ముఖం మీద ట్యాన్ పోతుంది.

## ఇంటిప్స్

● చింతపండు గుజ్జులో కొద్దిగా ఉప్పు కలిపి రాగి పాత్రలను తోమితే తళతళా మెరుస్తాయి.

● కాకర కాయ ముక్కలపై కొద్దిగా ఉప్పు, నిమ్మరసం చల్లి ఇరవై నిమిషాలు పక్కన పెట్టాలి. తరువాత ముక్కలను గట్టిగా పిండి కూర వండుకుంటే చేదుగా ఉండదు.

## ఇలా తరిమేయండి!

● చెదలు ఉన్న దగ్గర వేపనూనె రాస్తే కొద్దిరోజుల్లోనే చెదలు అక్కడి నుంచి పోతాయి ● అరకప్పు వెనిగర్‌లో రెండు నిమ్మకాయల రసాన్ని పిండాలి. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి స్ప్రే బాటిల్‌లో వేయాలి. ఈ స్ప్రేను చెదల పైన చల్లాలి. చెదలు దానంతట అదే పోతుంది ● చెదలు మీద కారం చల్లినా పోతాయి ● కప్పు వేడినీటిలో టేబుల్ స్పూను ఉప్పు కలపాలి. ఈ మిశ్రమాన్ని సిరంజిలోకి తీసుకుని చెదల పుట్టలో వేయాలి. చెదలు అక్కడి నుంచి పోతుంది.

### కొటేషన్స్

మహిళ శక్తిని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కోట్స్ బ్యాక్ డిజైన్‌గా రూపొందుతున్నాయి. ఇవి ఎంబ్రాయిడరీగా కన్నా పెయింటింగ్‌గా క్యాజువల్ వేర్ శారీస్‌గా బాగా నప్పుతున్నాయి.

### పెయింటింగ్

పురాణ గాథలను దృశ్యరూపకంగా బ్యాక్ బ్లౌజ్ కొత్తగా రూపుకడుతుంది. దీంట్లో మధుబని ఆర్ట్, కలంకారీ ప్రధానంగా ఉంటున్నాయి. కొత్తగా తంజావూర్ పెయింటింగ్ కూడా బ్యాక్ డిజైన్ మీద అందంగా మెరిసిపోతోంది.

శారీ బ్లౌజ్ బ్యాక్ డిజైన్స్ ఎప్పుడూ ట్రెండ్‌లో ఉండేవే. వేడుకలలో ప్రత్యేకంగా కనిపించే బ్లౌజ్ బ్యాక్‌ను డిజైనర్లు కాన్వాస్‌గా మార్చేస్తున్నారు. ఈ డిజైన్స్‌లో పురాణ కథల దృశ్యాల నుంచి సందేశాల వరకు ఉంటున్నాయి.


# సమ్‌థింగ్ స్పెషల్

పెళ్లికి గ్రాండ్‌లుక్‌ని తీసుకువచ్చే ఎంబ్రాయిడరీ డిజైన్
పార్టీలో ప్రత్యేకం అనిపించే మోడర్న్ డిజైన్
క్యాజువల్ వేర్‌గా ధరించినా స్పెషల్ అనిపించే కోట్స్‌తో మరో డిజైన్
చీరకట్టును చూపులతో కట్టడి చేసే బ్లౌజ్ బ్యాక్ డిజైన్
ఇప్పుడు ప్రతిరోజూ ప్రత్యేకమే!
చూసేవారు సమ్‌థింగ్ స్పెషల్ అనకుండా ఉండలేరు.











### ఎంబ్రాయిడరీ

రాజమహాళ్లు, పువ్వులు, లతలు... స్వరోస్కి, జరీ దారాలతో చేసిన ఎంబ్రాయిడరీ పెళ్లి వేడుకలలో గ్రాండ్‌గా మెరిసిపోతోంది.

### త్రీడీ డిజైన్

బ్లౌజ్ బ్యాక్ పైన క్లాత్‌తో చేసిన డిజైన్‌ను జత చేయడంతో పాటు దీనికి అదనంగా హంగుగా అమర్చిన త్రీడీ ప్రింట్స్ మరింత ఆకర్షణీయంగా మారుతున్నాయి.

థక్ థక్ గ్యాంగ్

# కాలు తొక్కారు అద్దం దించండి



ఢిల్లీలో ఒంటరిగా కారు నడుపుతున్న స్త్రీల వస్తువుల చోరీకి ఒక గ్యాంగ్ ప్రయత్నిస్తోంది.
ఆ గ్యాంగ్‌ను థక్‌థక్ గ్యాంగ్ అంటారు.
వీరు ఎలా చోరీ చేస్తారు?
ఒంటరి స్త్రీలు కారు ప్రయాణం చేసేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?
విస్తృతంగా వాహనాలు నడుపుతున్న స్త్రీలూ... బహుపరాక్.
థక్‌థక్ గ్యాంగ్ ఎక్కడైనా ఉండొచ్చు.

**సంఘటన 1:** నిర్మానుష్య ప్రాంతం అక్కర్లేదు. బాగా రద్దీ ఉన్న రోడ్డు మీదే. ట్రాఫిక్ సమయంలోనే. మీరు కారు మెల్లగా పోనిస్తుంటారు. ఒక మనిషి మీ కారు ముందు నుంచి దాటుతాడు. ఆ తర్వాత వేగంగా వెనక్కు వచ్చి మీ పక్క అద్దం మీద 'టక్ టక్'మని వేలితో కొట్టి అద్దం దించమని కోపంగా అంటాడు. 'నా కాలు తొక్కావు. అద్దం దించు' అని హడావిడి చేస్తాడు. మీరు కంగారులో అద్దం దించుతారు. అంతే! మీ పక్క సీటులో మీరు ఉంచుకున్న హ్యాండ్‌బ్యాగ్, పర్స్, ల్యాప్‌టాప్ తీసుకుని తుర్రుమంటాడు. మీరు కారు దిగి వెంటాడ లేరు. ట్రాఫిక్‌లో ఉంటారు. ఇదీ 'టక్ టక్' లేదా 'థక్‌థక్ గ్యాంగ్' నేరం చేసే తీరు.

**సంఘటన 2:** ఇలాగే ట్రాఫిక్‌లో మీరు వెళుతుంటారు. మెల్లగా వెళుతున్న మీ కారు వెనుక టైరు ఏదో ఎక్కి దిగినట్టుగా అవుతుంది. వెంటనే ఒక మనిషి డ్రైవింగ్ సీట్ దగ్గరకు వచ్చి అద్దం మీద బాది 'నా కాలు తొక్కావ్' అంటాడు. మీరు ఇంజన్ ఆఫ్ చేసినా, కారు పక్కకు తీసి ఆ మనిషితో వాదనకు దిగినా, మరో మనిషి మీ కారు వెనుక సీటులో ఉన్న వస్తువు తీసుకుని ఉడాయిస్తాడు. మీరు స్లోగా వెళుతున్నప్పుడు వెనుక టైరు కింద రాయి పెట్టి కాలు తొక్కిన భావన కలిగిస్తారు.

**ఇంకా ఏం చేస్తారు?:** మీ కారు బైక్ మీద వెంబడించి ఇంజన్ లీక్ అవుతుంది అంటారు. అలా అనిపించడానికి వారే వెనుక కొంత ఆయిల్ వేస్తారు. మిమ్మల్ని అలెర్ట్ చేసిన వారు మిమ్మల్ని దాటి వెళ్లిపోతారు. కాని మీరు కారు ఆపి ఇంజన్ ఆయిల్‌ను చెక్ చేస్తుంటే ఇంకో బ్యాచ్ వచ్చి డోర్లు తీసి దోచుకుని పోతుంది. కారు ఎక్కేటప్పుడు కొన్ని నోట్లు కింద పడేసి మీ డబ్బు పడింది అంటారు. మీరు నోట్లు ఏరుకుంటుంటే కారులో ఉన్న వస్తువులు పట్టుకెళతారు. బ్యాక్ టైర్ పంక్చర్ అయ్యిందని చెప్తారు. కారు ఆపితే అంతే సంగతులు. కొన్నిసార్లు క్యాటపల్ట్ (క్యాట్‌బాల్)తో రాయి విసిరి అద్దం మీద కొడతారు. టప్పున అద్దం తాకితే మీరు కంగారులో కారు ఆపి దిగుతారు. వారు చేతివాటం చూపుతారు. ఒంటరి స్త్రీలు ఉన్నప్పుడు ఇవన్నీ థక్ థక్ గ్యాంగ్ చాలా సులువుగా చేస్తుంది. కాబట్టి జాగ్రత్త.

### ఏం చేయాలి?

అద్దాలు ఎప్పుడూ ఎత్తి పెట్టాలి

* * *

ఎవరు వచ్చి వాదనకు దిగినా అద్దం దించకుండా పోలీసులకు ఫోన్ చేయాలి. ఇంజన్ ఆఫ్ చేయకూడదు. చేస్తే డోర్లు తెరుచుకుంటాయి.

* * *

మీ పక్క సీటులో, వెనుక సీటులో విలువైన ఏ వస్తువులూ కనిపించేలా పెట్టకూడదు.

* * *

ఏదైనా రాయి వచ్చి అద్దాన్ని కొట్టినా వెంటనే ఆపకుండా బాగా దూరం వెళ్లి ఎవరూ వెంబడించడం లేదని గమనించుకుని ఆపాలి.

* * *

ముఖ్యంగా ఫ్లై ఓవర్లు దిగేప్పుడు, ట్రాఫిక్ ఉంటే ఇలాంటి దాడులు చేస్తారు. ఫ్లై ఓవర్ మీద కారు పక్కకు తీసి మీరు వారిని పట్టుకునే ప్రయత్నం చేయలేకపోవడమే ఇందుకు కారణం. కాబట్టి ఫ్లై ఓవర్ల మీద జాగ్రత్తగా ఉండాలి.

# వంట పండింది!





జీవితంలో సమస్యలు రావడం సాధారణం. ఒక్కోసారి ఇవి ఊపిరాడనివ్వవు. అయితే ఇలాంటి పరిస్థితుల్లోనే ధైర్యంగా వాటిని ఎదుర్కొనాలి. తానేమిటో నిరూపించుకోవాలి. అలానే చేసింది బిందు. తన కూతుళ్లకు మంచి చదువును అందించేందుకు ఒక పక్క గరిట తిప్పుతూనే మరోపక్క నాగలి పట్టి పొలం సాగు చేస్తూ "మనం కూడా ఇలా వ్యవసాయం చేస్తే బావుంటుంది" అనేంతగా ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

**త**మిళనాడులోని తెన్రై జిల్లా బొమ్మినాయకన్‌పట్టి గ్రామానికి చెందిన బిందు, పిచ్చయ్య దంపతులకు ఇద్దరు అమ్మాయిలు. పిచ్చయ్య సొంత పొలంలో చెరకు పండించేవాడు. అయితే ఏటా అప్పులు తప్ప ఆదాయం వచ్చేది కాదు. గ్రామంలో చాలామంది రైతులు చెరకు, పత్తిని పండించి నష్టపోవడాన్ని చూసి ఇతర పంటలను పండించాలని నిర్ణయించుకుంది బిందు. మొక్కజొన్న, వంగ పంటను పొలంలో వేసింది. మరో పక్క సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లో చేరి చుట్టుపక్కల రైతులు ఏం పండిస్తున్నారో తెలుసుకునేది. ఇతర రైతుల సలహాలు, సూచనలతో సాగును మెరుగు పరుచుకుంటూ, ఎస్‌హెచ్‌జీ ద్వారా కృషి విజ్ఞాన్ నిర్వహించే వ్యవసాయ కార్యక్రమాలకు హాజరవుతూ మెలకువలు నేర్చుకుంది. అధికారులు చెప్పిన విధంగా పప్పుధాన్యాలు, మిల్లెట్స్, మినుములు కూడా సేంద్రియ పద్ధతిలో సాగుచేసింది. దీంతో మంచి లాభాలు వచ్చాయి.

**విరామంలో...**

పంటకు పంటకు మధ్య వచ్చే విరామంలో కూరగాయలు పండించడం మొదలు పెట్టింది. అవి నాలుగు నెలల్లోనే చేతికి రావడంతో మంచి ఆదాయం వచ్చేది. విరామ పంటలు చక్కగా పండుతుండడంతో.. కొత్తిమీర, కాకర, ఇతర కూరగాయలను పండిస్తోంది.

**పంటను పసుమయిగా ...**

ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో చాలా కూరగాయలు వృథా అయ్యేవి. అలా వ్యర్థంగా పోకుండా ఉండేందుకు 'పసుమయి' పేరిట ఎండబెట్టిన కూరగాయలు, పొడులను విక్రయిస్తోంది. ఇడ్లీ పొడి, నిమ్మపొడి, ధనియాల పొడి వంటి అనేక రకాల పొడులను మార్కెట్లోకి అందుబాటులోకి తెచ్చింది. నెలకు వందల సంఖ్యలో విక్రయాలు జరుగుతున్నాయి. ఇలా అంచెలంచెలుగా ఎదుగుతూ వ్యాపారవేత్తగా ఎదిగింది బిందు. ఆమె పెద్దకూతురు ఎం.ఎస్. పూర్తి చేస్తే, చిన్నకూతురు బీఎస్సీ నర్సింగ్ చేస్తోంది. అలా సేద్యంతో పిల్లల చదువులనూ పండించుకుంది బిందు.

## వంటిల్లు

ఎప్పుడూ తినే ఉల్లి, బంగాళ దుంపల కూర సమోసాలు కాకుండా... ఈ చలికాలంలో కాస్త తీపిగా, కారంగా, క్రంచీగా ఉండే సమోసాలను ఇలా ప్రయత్నించి చూడండి. మన వంటిల్లు ఇంతటి మాయాజాలం చేస్తుందా... అని ఆశ్చర్యపోతారు.

# గరం గరం సమోసాలు

### స్వీట్ కోవా సమోసా



**కావలసినవి:** మైదా – రెండు టీస్పూన్లు; సమోసా పట్టి షీట్లు – పన్నెండు (రెడీమేడ్); వేరు శనగ నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా; పిస్తా – గార్నిష్‌కు సరిపడా.

**స్టఫింగ్:** నెయ్యి – టీస్పూను; జీడిపప్పు పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; పిస్తా పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు; పచ్చికొబ్బరి తురుము – రెండు టేబుల్ స్పూన్లు; పంచదార – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీస్పూను; ఉప్పు – ముప్పావు టీస్పూను; కోవా తురుము – కప్పు.

సిరప్: పంచదార – అరకప్పు; యాలకుల పొడి – పావు టీస్పూను; నీళ్లు – అరకప్పు; కుంకుమ పువ్వు– చిటికెడు.

**తయారీ:** జీడిపప్పుని నెయ్యిలో వేసి బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయించాలి ● జీడిపప్పు వేగిన తరువాత పిస్తా, కొబ్బరి తరుము, పంచదార, కోవా తురుము వేయాలి ● ఇవన్నీ దోరగా వేగిన తరువాత రుచికి సరిపడా ఉప్పు, యాలకులపొడి వేసి కలిపి దించేయాలి. ఈ మిశ్రమం చల్లారిన తరువాత అరగంట రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● బాణలిలో కుంకుమ పువ్వును దోరగా వేయించాలి. ఇది వేగిన తరువాత పంచదార, అరకప్పు నీళ్లు, యాలకుల పొడి వేసి, సిరప్ తయారు చేసి పక్కన పెట్టుకోవాలి ● మైదాలో కొద్దిగా నీళ్లుపోసి గమ్‌లా తయార చేసి పక్కన పెట్టుకోవాలి ● ఇప్పుడు రిఫ్రిజిరేటర్ నుంచి తీసిన మిశ్రమాన్ని.. సమోసా పట్టి షీట్‌పైన టేబుల్ స్పూను వేసి సమోసాలా చుట్టుకోవాలి ● లోపల స్టఫింగ్ బయటకు రాకుండా ఉండేలా మైదా గమ్‌ను రాసుకుంటూ సమోసాను చుట్టుకోవాలి ● సమోసాలన్నీ రెడీ అయ్యాక బంగారు వర్ణంలోకి వచ్చేంత వరకు డీప్‌ఫ్రై చేయాలి ● ఫ్రై చేసిన వేడివేడి సమోసాలను సుగర్ సిరప్‌లో అరనిమిషం ఉంచాలి ● సుగర్ సిరప్ నుంచి తీసిన సమోసాపై పిస్తా పప్పు తురుము వేస్తే స్వీట్ సమోసా రెడీ.

### చికెన్ సమోసా



**కావలసినవి:** మైదా – కప్పు; వాము – చిటికెడు; నెయ్యి – రెండు టేబుల్ స్పూన్లు.

ఖీమా ఫిల్లింగ్: నెయ్యి – టేబుల్ స్పూను; ఇంగువ – చిటికెడు; జీలకర్ర – టీస్పూను; క్యారట్ ముక్కలు – అరకప్పు (చిన్నముక్కలు); వెల్లుల్లి రెబ్బలు – రెండు; అల్లం – అంగుళం ముక్క; చికెన్ ఖీమా – పావు కేజీ; కారం – అర టీస్పూను; ధనియాల పొడి – టీస్పూను; గరం మసాలా – అర టీస్పూను; పసుపు – పావు టీస్పూను; పచ్చిబఠాణి – అరకప్పు; స్ప్రింగ్ ఆనియన్ ముక్కలు – పావు కప్పు; ఉప్పు – రుచికి సరిపడా.

**తయారీ:** మైదాలో వాము, రెండు టేబుల్ స్పూన్లు నెయ్యి వేసి కలిపాక, నీళ్లు పోసి ముద్ద చేయాలి. ఈ పిండి ముద్దపైన తడి వస్త్రాన్ని కప్పి అరగంట నానబెట్టుకోవాలి ● టేబుల్ స్పూను నెయ్యిలో జీలకర్ర, ఇంగువ వేసి వేయించాలి ● జీలకర్ర వేగిన తరువాత అల్లం, వెల్లుల్లిని సన్నగా తరగి వేయాలి. వీటితోపాటే క్యారట్ ముక్కలు వేసి వేయించాలి ● క్యారట్ వేగిన తరువాత చికెన్ ఖీమా వేసి ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి ● తరువాత కారం, ధనియాల పొడి, గరం మసాలా, పసుపు వేసి గరిటతో కలిపి, మూతపెట్టి మగ్గనివ్వాలి ● ఆరు నిమిషాల తరువాత స్ప్రింగ్ ఆనియన్ తరుగు, పచ్చిబఠాణి, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● ఈ మిశ్రమాన్ని రెండు నిమిషాలు వేయించి దించేయాలి ● మైదాముద్దను చిన్న ఉండలుగా చేసి, చపాతీలా వత్తుకోవాలి ● చపాతీని కోన్ ఆకారంలో మడిచి, మధ్యలో చికెన్ ఖీమా మిశ్రమంతో నింపాలి. మిశ్రమం బయటకు రాకుండా కోన్‌ను మూసివేయాలి ● ఇలా అన్ని సమోసాలు రెడీ అయిన తరువాత బేకింగ్ ట్రేలో పెట్టాలి ● ఈ ట్రేను అవెన్‌లో పెట్టి 350 ఫారిన్‌హీట్స్ వద్ద ఇరవై నిమిషాల పాటు బేక్ చేస్తే చికెన్ సమోసా రెడీ.

### ఎగ్ సమోసా



**కావలసినవి:** గుడ్లు – ఆరు; పచ్చి బంగాళ దుంపల తురుము – కప్పు; క్యారట్ ముక్కలు – అరకప్పు; ఉల్లిపాయలు – నాలుగు; పచ్చిమిర్చి – మూడు; నూనె – ఐదు టేబుల్ స్పూన్లు; వంటసోడా – అరటీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; వాము – అరటీస్పూను; కొత్తి మీర – చిన్న కట్ట; మైదా – రెండున్నర కప్పులు; రిఫైన్డ్ నూనె – డీప్‌ఫ్రైకి సరిపడా.

**తయారీ:** ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కొత్తిమీరను సన్నగా తరిగి పెట్టుకోవాలి ● మైదాలో వంటసోడా, వాము, అరటీస్పూను ఉప్పు, రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి కలపాలి. నీళ్లుపోసి ముద్దచేసి గంటపాటు నానపెట్టుకోవాలి ● మూడు టేబుల్ స్పూన్ల నూనెలో ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేసి వేయించాలి ● ఉల్లిపాయలు వేగిన తరువాత క్యారట్ ముక్కలు, బంగాళ దుంప తురుము వేసి వేయించాలి ● నిమిషం తరువాత కొత్తిమీర తరుగు, రుచికి సరిపడా ఉప్పు వేసి మూతపెట్టి మగ్గనివ్వాలి ● మిశ్రమం మెత్తబడిన తరువాత గుడ్ల సొన వేసి వేయించాలి ● గుడ్ల సొన వేగిన తరువాత దించేసి చల్లారనివ్వాలి ● మైదా ముద్దను చిన్న ఉండలుగా చేసి, చపాతీల్లా వత్తుకోవాలి ● ఈ చపాతీలను త్రికోణాకృతిలో మడతపెట్టి మధ్యలో ఒక టీ స్పూన్ గుడ్డు మిశ్రమాన్ని పెట్టి మిశ్రమం బయటకు రాకుండా అంచులకు కొద్దిగా తడిచేసి అతుక్కునేటట్లు వేళ్లతో మెల్లగా నొక్కాలి ● ఇలా అన్ని తయారయ్యాక గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్‌ఫ్రై చేస్తే ఎగ్ సమోసా రెడీ.

2023 రౌండప్

# మురిసే మురిసే... తెర మెరిసే

2023 సిల్వర్ స్క్రీన్ మురిసేలా చేసింది.
మరి.. పదికి పైగా కొత్త తారలు తెరపై మెరిస్తే మురిసిపోవడం సహజం కదా.
తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళ్, హిందీ..
ఇలా పలు భాషలకు చెందిన కొత్తమ్మాయిలు ఈ ఏడాది తెలుగు తెరకు పరిచయం అయ్యారు. ఆ కథానాయికల గురించి తెలుసుకుందాం.



● ప్రియా భవానీ శంకర్ ● ఆషికా రంగనాథ్ ● వైష్ణవీ చైతన్య

● కేరళలో పుట్టి, తమిళనాడులో పెరిగిన అమ్మాయి ఐశ్వర్యా మీనన్. తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో పలు సినిమాలు చేసిన ఐశ్వర్య యాక్షన్ ఫిల్మ్ 'స్పై'తో తెలుగు తెరకు పరిచయం అయ్యారు. ఈ సినిమాలో చాలా బోల్డ్‌గా కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా చేశారు ఐశ్వర్యా మీనన్. ఈ చిత్రంలో నిఖిల్ హీరోగా నటించారు. రానా అతిథి పాత్ర చేశారు. ఎడిటర్ గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె. రాజశేఖరరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు.

● ఈ ఏడాది సూపర్ హిట్‌గా నిలిచిన తెలుగు సినిమాల్లో 'సామజ వరగమన' ఒకటి. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు మలయాళ బ్యూటీ రెబా మోనికా జాన్. సాయిధరమ్ తేజ్ ఓ హీరోగా నటించిన 'బ్రో' సినిమా లుక్ టెస్ట్‌కు వచ్చిన రెబా మోనికాకి ఆ అవకాశం దక్కలేదు. అదే టైమ్‌లో 'సామజ వరగమన' నిర్మాత రాజేశ్ దండాను కలవడం, ఆయన ద్వారా రెబాకి చిత్రదర్శకుడు రామ్ అబ్బరాజు కథ వినిపించడం, ఆమె ఓకే అనడం, ఈ సినిమా హిట్ కావడం అన్నీ చకా చకా జరిగిపోయాయి. నిజానికి ఈ సినిమాలో హీరోగా నటించిన శ్రీ విష్ణుతో అంతకు ముందే ఓ సినిమా చేయాల్సిందట రెబా. కానీ ఆ చాన్స్ చేజారినప్పటికీ ఫైనల్‌గా శ్రీవిష్ణు 'సామజ వరగమన' ద్వారానే టాలీవుడ్‌కి వచ్చారు రెబా.



● రెబా మోనికా జాన్

● 'ది సాఫ్ట్‌వేర్ డెవలప్పర్స్' (2020) వెబ్ సిరీస్‌తో నటిగా కెరీర్‌ను డెవలప్ చేశారు యంగ్ బ్యూటీ వైష్ణవీ చైతన్య. అల్లు అర్జున్ 'అల.. వైకుంఠపురములో', నాని 'టక్ జగదీష్', అజిత్ 'వలిమై' వంటి సినిమాల్లో సపోర్టింగ్ క్యారెక్టర్స్ చేసే అవకాశాలు వచ్చినప్పుడు, అవి తన కెరీర్‌కు సపోర్ట్ చేస్తాయని నమ్మి, ఆ పాత్రల్లో నటించారు వైష్ణవి. ఆ నమ్మకమే ఆమెను హీరోయిన్‌ని చేసింది. లీడ్ హీరోయిన్‌గా 'బేబీ' సినిమా చేశారు వైష్ణవి. ఈ సినిమాలో ఎంత బాగా నటించారంటే.. ఇప్పుడు 'బేబీ' అంటే దాదాపు కుర్రకారు అంతా టక్కున వైష్ణవీ చైతన్య పేరునే గుర్తుకు తెచ్చుకుంటున్నారు. ఇక ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన ఈ 'బేబీ' సినిమాకు సాయి రాజేశ్ దర్శకత్వం వహించగా, ఎస్‌కేఎన్ నిర్మించారు. ఈ సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. వైష్ణవీ చైతన్య కెరీర్ కూడా బ్లాక్ బస్టర్ అనేలా మారింది. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ, ఆనంద్ దేవరకొండ హీరోలుగా నటిస్తున్న చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తూ బిజీగా ఉన్నారీ సిల్వర్ స్క్రీన్ బేబీ. మామూలుగా తెలుగు అమ్మాయిలకు అవకాశాలు రావని అంటుంటారు. కానీ వరుస సినిమాలతో జోష్‌గా ఉన్నారు వైష్ణవీ చైతన్య.

● కన్నడ పరిశ్రమలో హీరోయిన్‌గా నిరూపించుకున్న ఆషికా రంగనాథ్ 'అమిగోస్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించారు. ఈ శాండిల్‌వుడ్ బ్యూటీ నటనకు ఆడియన్స్ ఓకే అన్నారు. ఆషికా కూడా తెలుగులో మరో అవకాశం తెచ్చుకోగలిగారు. ప్రస్తుతం నాగార్జున హీరోగా నటిస్తున్న 'నా సామి రంగ'లో ఆషిక ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇక కల్యాణ్‌రామ్ హీరోగా రాజేందర్ రెడ్డి దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ 'అమిగోస్' చిత్రాన్ని నిర్మించారు.

● బుల్లితెర నుంచి తమిళ వెండి తెరపై దర్శనమిచ్చి సక్సెస్ ట్రాక్‌లో కొనసాగుతున్న వారిలో ప్రియా భవానీ శంకర్ ఒకరు. తమిళంలో ఫుల్ ఫామ్‌లో ఉన్న ఈ బ్యూటీ 'కళ్యాణం కమనీయం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించారు. సంతోష్ శోభన్ హీరోగా అనిల్ కుమార్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని యూవీ కాన్సెప్ట్స్ నిర్మించింది. జనవరిలో సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం విడుదలైంది. ఆ తర్వాత తెలుగులో ఒకట్రెండు సినిమాలు సైన్ చేశారు ప్రియా భవానీ శంకర్.



● నూపుర్ సనన్ ● గాయత్రీ భరద్వాజ్

***

● తెలుగు తెరపై ఈ ఏడాది మెరిసిన హరియాణా బ్యూటీ యుక్తీ తరేజ. ఢిల్లీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఈ బ్యూటీ ఆ తర్వాత మోడల్‌గా కెరీర్‌ను ఆరంభించారు. 2019లో సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్ పోటీల్లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచి, అందరి చూపూ తనవైపు తిప్పుకున్నారు యుక్తి. ఆ తర్వాత ఇమ్రాన్ హష్మితో కలిసి ఈ బ్యూటీ చేసిన 'లుట్ గయే..' సాంగ్ ఇంటర్నెట్‌లో సంచలనమైంది. అంతే.. వెండితెర అవకాశాలు వచ్చాయి. అలా 'రంగబలి' సినిమాతో తెలుగు తెరపై మెరిశారు యుక్తీ తరేజ. తన నటనతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. నాగశౌర్య హీరోగా పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి 'రంగ బలి' చిత్రాన్ని నిర్మించారు.



● యుక్తీ తరేజ



● ఐశ్వర్యా మీనన్

***

● రెండు చిత్రాలతో ఈ ఏడాది తెరపై మెరిశారు సాక్షీ వైద్య. ఈ ముంబై మోడల్ నాయికగా టాలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన చిత్రం 'ఏజెంట్'. అఖిల్ హీరోగా నటించారు. సురేందర్ రెడ్డి దర్శకత్వంలో అనిల్ సుంకర నిర్మించిన చిత్రం ఇది. అలాగే సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటించిన మరో తెలుగు చిత్రం 'గాండీవదారి అర్జున' కూడా ఈ ఏడాదే రిలీజైంది. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించారు.



● సాక్షీ వైద్య

వీరే కాదు.. కిరణ్ అబ్బవరం 'మీటర్' సినిమాతో తమిళ హీరోయిన్ అతుల్యా రవి, దగ్గుబాటి అభిరామ్ హీరోగా పరిచయమైన 'అహింస'తో మధ్యప్రదేశ్ అమ్మాయి గీతికా తివారి, బెల్లంకొండ గణేశ్ 'నేను స్టూడెంట్ సర్!'తో అలనాటి తార భాగ్య శ్రీ తనయ అవంతికలతో పాటు మరికొందరు హీరోయిన్లు ఈ ఏడాది తెలుగు తెరపై మెరిశారు.

● మ్యూజిక్ వీడియోల్లో అక్షయ్ కుమార్ సరసన నటించి, బాలీవుడ్‌ను ఆకట్టుకున్నారు నూపుర్ సనన్. అయితే హీరోయిన్‌గా తొలి సినిమాను మాత్రం తెలుగులో చేశారు. రవితేజ టైటిల్ రోల్ చేసిన 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రంలో నూపుర్ సనన్ ఓ హీరోయిన్‌గా నటించారు. అలాగే ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా నటించిన ఢిల్లీ అమ్మాయి గాయత్రీ భరద్వాజ్‌కు సైతం తెలుగులో తొలి సినిమా 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీకృష్ణ దర్శకత్వంలో ఈ సినిమాను అభిషేక్ అగర్వాల్ నిర్మించారు. అన్నట్లు మరో మాట.. మహేశ్‌బాబు, నాగచైతన్య, ప్రభాస్‌లతో సినిమాలు చేసిన హీరోయిన్ కృతీ సనన్ సోదరే నూపుర్ సనన్.

● బాల నటిగా, ఆ తర్వాత సహ నటిగా తమిళ, మలయాళం భాషల్లో సినిమాలు చేశారు అనిఖా సురేంద్రన్. గత ఏడాది విడుదలైన నాగార్జున 'ది ఘోస్ట్' చిత్రంలోనూ ఓ సపోర్టింగ్ రోల్ చేశారు. బాల నటిగా పేరు తెచ్చుకున్న అనిఖా హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయమైన సినిమా 'బుట్టబొమ్మ'. అర్జున్ దాస్, సూర్య వశిష్ఠ ఇతర లీడ్ రోల్స్ చేశారు. మలయాళ హిట్ ఫిల్మ్ 'కప్పెలా'కు తెలుగు రీమేక్‌గా రూపొందిన ఈ సినిమాకు చంద్రశేఖర్ టి. రమేశ్ దర్శకత్వం వహించగా, సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు.



● అనిఖా సురేంద్రన్

## సినిమా రీల్స్

### డెవిల్ డేట్ ఫిక్స్



● కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా నటించిన పీరియాడికల్ స్పై థ్రిల్లర్ 'డెవిల్'. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటించారు. అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 29న విడుదల చేస్తున్నట్లుగా గురువారం చిత్ర యూనిట్ వెల్లడించింది. ''ఈ చిత్రంలో ఎవరికీ అంతు చిక్కని ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్ పాత్రలో కల్యాణ్ రామ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్.

### దళారి రాజకీయం



● షకలక శంకర్, రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, 'షకలక' శంకర్, అక్షా ఖాన్ ప్రధాన పాత్రల్లో కాచిడి గోపాల్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'దళారి'. వెంకట్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాతలు సి. కల్యాణ్, దామోదర ప్రసాద్ విడుదల చేశారు. సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''వెంకట్ రెడ్డిగారిలాంటి కొత్తవారు వస్తేనే ఇండస్ట్రీ బాగుంటుంది. 'దళారి' ట్రైలర్ బాగుంది.. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాని ఆకృతి క్రియేషన్స్ పతాకంపై రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు వెంకట్ రెడ్డి. ''సమాజంలో ఏ పని జరగాలన్నా ఒక దళారి ఉంటాడు. అలాంటి దళారి పాత్ర రాజకీయంలో ఉంటే ఎలా ఉంటుందో తెలిపేదే మా సినిమా'' అన్నారు గోపాల్ రెడ్డి.

### ఐదు భాషల్లో జాలరి



● శ్రీహరి, రాజ్ తాళ్లూరి

శ్రీహరి హీరోగా రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో తెరకెక్కనున్న 'జాలరి' సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి దర్శకుడు సముద్ర కెమెరా స్విచ్చాన్ చేసి, స్క్రిప్ట్‌ను నిర్మాతలకు అందించారు. ఐదు భాషల్లో 'జాలరి'ని ఎమ్‌వైౖ3 ప్రొడక్షన్స్ పతాకంపై ఆదిత్య పల్లా, రఘు కుడితిపూడి, సాయికిరణ్ బత్తుల, రక్తం దశరథ్ గౌడ్ నిర్మించనున్నారు. ''1980 నేపథ్యంలో కమర్షియల్ ఫార్మాట్‌లో తెరకెక్కనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఫిబ్రవరిలో ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

### మతిమరుపు...



● రామకృష్ణ, యాని, రేఖ, హరికృష్ణ

కవలలు హరికృష్ణ, రామకృష్ణ హీరోలుగా యాని, రేఖా నిరోషా హీరోయిన్లుగా వెంకట్ దర్శకత్వం వహించిన చిత్రం 'తికమక తాండ'. తిరుపతి సత్యం సమర్పణలో తిరుపతి శ్రీనివాసరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న రిలీజవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకకి నిర్మాతలు సి. కల్యాణ్, దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్ అతిథులుగా హాజరై, హిట్టవ్వాలన్నారు. ''తికమక తాండ అనే ఊర్లోని ప్రజలకు మతిమరుపు అనే కథాంశంతో రూపొందించాం'' అన్నారు వెంకట్. ''మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదించాలి'' అన్నారు తిరుపతి శ్రీనివాసరావు.

## ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



కాకినాడ జిల్లా తిరుపతి గ్రామంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



గుంటూరు జిల్లా తెనాలిలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక తదితరులు



ఏలూరు జిల్లా వెంకటాపురం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు



అన్నమయ్య జిల్లా రాయచోటిలో పథకాల వివరాలను కరపత్రాలను ప్రదర్శిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి



చిత్తూరు జిల్లా బసవాపల్లెలో సంక్షేమం, అభివృద్ధి పనుల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



కృష్ణా జిల్లా వెంకటనరసింహాపురం కాలనీలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి

## 'వార్షిక కౌలు' వ్యాజ్యానికి విచారణార్హత ఉంది

- మీ సంఘాల్లోని ప్రతి సభ్యుడి పేరు మీద కోర్టు ఫీజు చెల్లించండి
- రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, రాజధాని రైతు పరిరక్షణ సమితికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు చెల్లించేలా సీఆర్‌డీఏను, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, రాజధాని రైతు పరిరక్షణ సమితి దాఖలు చేసిన వ్యాజ్యానికి విచారణార్హత ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో సీఆర్‌డీఏ లేవనెత్తిన అభ్యంతరాలను హైకోర్టు తోసిపుచ్చింది. అయితే పిటిషన్లు దాఖలు చేసిన సంఘాల్లో ఉన్న సభ్యులందరి వివరాలను కోర్టు ముందుంచాలని పిటిషనర్లను ఆదేశించింది. అంతేకాక ఆ సంఘాల్లోని ప్రతి సభ్యుడి పేరు మీద కోర్టు ఫీజు చెల్లించాలని కూడా ఆదేశాలిచ్చింది. ఇందుకోసం పది రోజుల గడువు ఇచ్చింది. తదుపరి విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వార్షిక కౌలు చెల్లించేలా ఆదేశాలివ్వాలంటూ రైతుల తరపున అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, రాజధాని రైతు పరిరక్షణ సమితి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యం విచారణార్హతపై సీఆర్‌డీఏ అభ్యంతరం లేవనెత్తింది. రైతుల తరఫున సంఘాల పేరుతో పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదని సీఆర్‌డీఏ తరపు న్యాయవాది కాసా జగన్ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రైతులే నేరుగా పిటిషన్ దాఖలు చేసుకోవాలన్నారు. విచారణార్హతపై ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి గురువారం తన నిర్ణయాన్ని వెలువరించారు. సీఆర్‌డీఏ అభ్యంతరాలను తోసిపుచ్చారు. అయితే పిటిషన్ దాఖలు చేసిన రెండు సంఘాల్లో ఉన్న ప్రతీ సభ్యుడి పేరు మీద కోర్టు ఫీజు చెల్లించాలని ఆ సంఘాలను న్యాయమూర్తి ఆదేశించారు.

## సీనియర్ ఐఏఎస్ అధికారులకు ఊరట

- కోర్టు ధిక్కార కేసులో సింగిల్ జడ్జి తీర్పు అమలు నిలుపుదల
- మూడు వారాల పాటు నిలిపేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: సీనియర్ ఐఏఎస్ అధికారులైన ఉన్నత విద్యాశాఖ ప్రస్తుత ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, కాలేజీ విద్య ప్రస్తుత కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్‌లకు హైకోర్టు ధర్మాసనం ఊరటనిచ్చింది. కోర్టు ధిక్కార కేసులో వారిద్దరికీ నెల రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ ఇటీవల సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును ధర్మాసనం నిలుపుదల చేసింది. మూడు వారాల పాటు తీర్పు అమలును నిలిపేసింది. విచారణను మూడు వారాల తరువాత చేపడుతామంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ ఎయిడెడ్ లెక్చరర్ల పోస్టుల భర్తీ విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అధికారులు అప్పీళ్లు దాఖలు చేశారని, ఆ అప్పీళ్లపై మరో ధర్మాసనం విచారణ జరిపి తీర్పు వాయిదా వేసిందని ధర్మాసనం గుర్తు చేసింది. ఆ అప్పీళ్లపై ధర్మాసనం ఇచ్చే తీర్పు ఆధారంగా ప్రస్తుతం ఇద్దరు దాఖలు చేసిన కోర్టు ధిక్కార అప్పీళ్లపై నిర్ణయం తీసుకుంటామని జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## శ్రీసిటీకి ఎల్‌జీ పాలిమర్స్ ఈపీసీ ప్లాంట్ తరలింపు


- ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు ధర్మాసనం
- అయితే చట్ట ప్రకారం అనుమతులన్నీ తీసుకోవాల్సిందే

సాక్షి, అమరావతి: విశాఖలో ఎల్‌జీ పాలిమర్స్‌కు చెందిన ఇంజినీరింగ్ ప్లాస్టిక్ కాంపౌండింగ్(ఈపీసీ) ప్లాంట్‌ను తిరుపతి, నెల్లూరు జిల్లాల పరిధిలోని శ్రీసిటీకి తరలించేందుకు హైకోర్టు అనుమతినిచ్చింది. చట్ట ప్రకారం సంబంధిత విభాగాల నుంచి అన్నీ అనుమతులు తీసుకోవాలని ఎల్‌జీ పాలిమర్స్ యాజమాన్యాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం గురువారం ఉత్తర్వులిచ్చింది. కాగా, 2020 మే 7న విశాఖ, ఆర్‌ఆర్ వెంకటాపురం వద్ద ఉన్న ఎల్‌జీ పాలిమర్స్ నుంచి స్టైరీన్ విషవాయువు లీక్ కావడం వల్ల పలువురు మరణించారు. ఈ ఘటనను హైకోర్టు సుమోటో పిల్‌గా పరిగణించి విచారణ చేస్తోంది. ఈ అంశంపై పలువురు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై ఇటీవల జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం ముందు విచారణకు రాగా..విశాఖలో తమకున్న ఇంజనీరింగ్ ప్లాస్టిక్ కాంపౌండింగ్ (ఈపీసీ) ప్లాంట్‌ను తిరుపతి, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న శ్రీసిటీకి తరలించేందుకు అనుమతించాలంటూ ఎల్జీ పాలిమర్స్ యాజమాన్యం అనుబంధ పిటిషన్ దాఖలు చేసింది. తమ షరతులకు కట్టుబడి ఉంటామంటే ఎల్‌జీ పాలిమర్స్ ఈపీసీ ప్లాంట్‌ను శ్రీ సిటీకి తరలించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ అనుబంధ పిటిషన్‌పై తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. తాజాగా గురువారం ధర్మాసనం తన నిర్ణయాన్ని వెల్లడించింది.

రాజ్యసభ — ఏపీ ఇన్ పార్లమెంట్

## క్రూయిజ్ టూరిజానికి జాతీయ వ్యూహం

వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో క్రూయిజ్ టూరిజాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు జాతీయ వ్యూహానికి రూపకల్పన చేసినట్టు పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు గురువారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఆంధ్రప్రదేశ్ సహా దేశంలో క్రూయిజ్ టూరిజాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఏడు కీలక అంశాలను ప్రాతిపదికగా తీసుకుని జాతీయ వ్యూహానికి రూపకల్పన చేసినట్టు తెలిపారు. జాతీయ వ్యూహంలో భాగంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సర్క్యూట్ ఎనేబుల్‌మెంట్, మార్కెట్ డెవలప్‌మెంట్, సులభతర వాణిజ్యం, టెర్మినల్ చుట్టూ ఇంటిగ్రేటెడ్ టూరిజం, పెట్టుబడులను ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి, సంస్థాగత నిర్మాణం, పరిపాలన మొదలైన అంశాలు క్రూయిజ్ టూరిజానికి ప్రధాన స్తంభాలుగా గుర్తించినట్టు తెలిపారు. విశాఖపట్నంలో క్రూయిజ్ కమ్ కోస్టల్ కార్గో టెర్మినల్ ప్రారంభమైందని వెల్లడించారు.

### కేబుల్ టీవీ చట్టం స్థానంలో బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు

అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, స్వీయ నియంత్రణ ఆవశ్యకత దృష్ట్యా ప్రస్తుతం ఉన్న కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ నియంత్రణ చట్టం–1995 స్థానంలో బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ రెగ్యులేషన్ బిల్లు–2023ని తీసుకువస్తున్నట్టు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ తెలిపారు. పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి అడిగిన మరో ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

### తూర్పు కనుమల్లో సర్వే అవసరం లేదు

దేశంలోని అడవుల విస్తీర్ణం, అటవీ భూముల కోతపై ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా రెండేళ్లకోసారి సర్వే చేస్తోందని.. అందువల్ల తూర్పు కనుమల్లో అటవీ భూముల కోతపై ప్రత్యేకంగా సర్వే నిర్వహించాల్సిన అవసరం లేదని కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయి రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

### వర్చువల్ కోర్టు అమలులో లేదు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతానికి వర్చువల్ కోర్టు అమలులో లేదని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తెలిపారు. వర్చువల్ కోర్టులను స్థానిక హైకోర్టులతో సంప్రదింపులు చేసి రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తాయని.. ఇందులో కేంద్రానికి నేరుగా ప్రమేయం ఉండదని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

### 288 బీచ్‌ల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్

తీర ప్రాంతంలో 288 బీచ్‌ల అభివృద్ధికి, కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్–2019లో చేర్చడానికి ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీకి డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ పంపినట్టు ఏపీ ప్రభుత్వం తెలిపిందని కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గండికోట, అరకు–లంబసింగి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి స్వదేశీ దర్శన్–2.0లో చేర్చినట్టు వైఎస్సార్‌సీపీ సభ్యుడు బీద మస్తానరావు ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

లోక్‌సభ

## ఏపీలో ఉన్నత విద్యాభివృద్ధికి కృషి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ఉన్నత విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్ తెలిపారు. తెలంగాణలో సమ్మక్క–సారక్క వర్సిటీ ఏర్పాటు నిమిత్తం ప్రవేశపెట్టిన 'కేంద్రీయ విశ్వవిద్యాలయాల (సవరణ) బిల్లు–2023'పై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చలో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో ఏపీ నుంచి వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి పెద్దఎత్తున సహకారం అందుతోందని చెప్పారు.

### కృష్ణా ట్రిబ్యునల్ ఎలాంటి సమావేశం నిర్వహించలేదు

తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీకి ఏర్పాటు చేసిన కృష్ణా జల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్–2 ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య జలాల పంపిణీకి సంబంధించి ఎలాంటి సమావేశం నిర్వహించలేదని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు గురువారం లోక్‌సభలో సమాధానమిస్తూ.. కృష్ణా ట్రిబ్యునల్–2 పదవీ కాలాన్ని 2014 ఆగస్టు నుంచి కేంద్రం రెండేళ్ల పాటు పొడిగించిందన్నారు. ట్రిబ్యునల్ పదవీ కాలం 31.3.2024 వరకూ పొడిగించామన్నారు.

### ఆవాస్ యోజన అర్బన్‌లో 1,617 ఇళ్లు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్‌లో భాగంగా ఏపీకి మూడేళ్లలో 1,617 ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చినట్టు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ప్రశ్నోత్తరాల్లో వైఎస్సార్‌సీపీ సభ్యులు ఎన్.రెడ్డెప్ప, సంజీవ్‌కుమార్ అడిగిన మరో ప్రశ్నకు గృహ, పట్టణ వ్యవహారాల మంత్రి హర్‌దీప్ సింగ్ పురి సమాధానమిస్తూ.. ఏపీలో 1,617కు గానూ 212 ఇళ్లు పూర్తయ్యాయని, కేంద్ర సాయం కింద రూ.32.87 కోట్లు విడుదల చేశామని చెప్పారు.

### ఏపీలో 11 సిటీలు

పట్టణ ప్రాంతాల్లో ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి పీఎం–ఈ బస్ సేవా పథకం ఇటీవల ప్రారంభించినట్టు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. ఈ పథకానికి రూ.20 వేల కోట్లు కేటాయించామని, 2011 జనాభా లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 3 లక్షల నుంచి 40 లక్షల జనాభా ఉన్న సిటీలు 169 ఉండగా ఏపీలో 11 సిటీలు ఉన్నాయని తెలిపారు. ఈ పథకంలో ఏపీ కూడా పార్టిసిపేట్ చేయడానికి అర్హత కలిగినదేనని వైఎస్సార్‌సీపీ సభ్యుడు మాగుంట ప్రశ్నకు సమాధానమిచ్చారు.

### మచిలీపట్నంలో నాలుగు ప్రాజెక్టులు త్వరలోనే పూర్తి

అమృత్ పథకంలో భాగంగా మచిలీపట్నంలో చేపట్టిన 8 అభివృద్ధి ప్రాజెక్టుల్లో మిగిలిన 4 త్వరలోనే పూర్తవుతాయని కేంద్ర మంత్రి కౌశల్ కిషోర్ తెలిపారు. మూడు ప్రాజెక్టులు జూలై 2024కి, మరొకటి ఫిబ్రవరి 2024కి పూర్తవుతాయని వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

### లాజిస్టిక్స్ పార్కుల కోసం రాష్ట్రాలతో ఒప్పందాల్లేవు కానీ..

దేశంలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుల అభివృద్ధి కోసం నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ రాష్ట్ర ప్రభుత్వాలతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కుల అభివృద్ధి కోసం కేంద్ర మంత్రిత్వ శాఖ తెలంగాణ, ఏపీ సహా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలతో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసిందని ఎంపీలు వైఎస్ అవినాశ్‌రెడ్డి, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా బదులిచ్చారు.

### సత్తుపల్లి-దేవరపల్లి సర్వీస్ రోడ్డు నిర్మాణంపై పరిశీలిస్తాం

సత్తుపల్లి–దేవరపల్లి మధ్య గ్రీన్ ఎక్స్‌ప్రెస్ హైవే సర్వీస్ రోడ్డు నిర్మాణం అంశాన్ని పరిశీలించి.. తగిన చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ రూట్‌లో 80 కి.మీ. మేర నిర్మాణం అవుతున్న ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుసంధానంగా సర్వీస్ రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందని, దీనిని నిర్మించాలంటూ ఎంపీ కోటగిరి శ్రీధర్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేంద్రమంత్రి లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ.. తాను పరిశీలించి సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకుంటానన్నారు. విజయవాడ విమానాశ్రయంలో రూ.611.80 కోట్ల వ్యయంతో ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా కొత్త ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, అనుబంధ పనులు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి జనరల్ వీకే సింగ్ తెలిపారు.

# సాక్షి బిజినెస్

శుక్రవారం
8-12-2023

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|---|
| | 132 | 37 |
| | 69,522 | 20,901 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

| విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 14,339 | △ | 192 |
| డోజోన్స్ | 36,113 | △ | 59 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,514 | ▽ | 2 |
| డాక్స్ | 16,289 | ▽ | 27 |
| షాంఘై | 2,966 | ▽ | 3 |
| నికాయ్ | 32,858 | ▽ | 588 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (24 క్యారెట్) | | |
| 62,462 | △ | 318 |
| బంగారం (22 క్యారెట్) | | |
| 62,212 | △ | 317 |
| వెండి (కిలో) | | |
| 73,888 | ▽ | 380 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 84.28 | 82.61 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 103.09 | 106.45 |
| € | యూరో | ఒకటి | 88.30 | 91.35 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 55.95 | 57.67 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 53.34 | 55.69 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 61.38 | 63.37 |
| SAR | సౌదీ రియాల్ | ఛాయసంకేత | 21.32 | 22.84 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ఛాయసంకేత | 21.78 | 23.88 |
| ¥ | చైనా యువాన్ | ఛాయసంకేత | 10.38 | 12.33 |

## హ్యుందాయ్ వాహనాలు ప్రియం

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా కార్ల ధరలను పెంచుతోంది. భారమవుతున్న తయారీ వ్యయం, ప్రతికూల మారకపు రేటు, వస్తువుల ధరల పెరుగుదల ఇందుకు కారణమని కంపెనీ తెలిపింది. సవరించిన ధరలు 2024 జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయని గురువారం ప్రకటించింది. అయితే ఎంత మొత్తం పెంచేదీ సంస్థ వెల్లడించలేదు.




రూ.5.84 లక్షల ప్రారంభ ధరలో గ్రాండ్ ఐ10తో మొదలుకుని రూ.45.95 లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ అయానిక్–5 మోడళ్లను కంపెనీ భారత్‌లో విక్రయిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లోనే ధరలు పెంచాల్సి వస్తోందని హ్యుందాయ్ మోటార్ ఇండియా సీవోవో తరుణ్ గర్గ్ వెల్లడించారు. జనవరి నుంచి ధరలను సవరిస్తున్నట్టు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా, ఆడి ఇప్పటికే ప్రకటించాయి.

## లంబోర్గినీ రెవెల్టో.. రూ.8.89 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సూపర్ లగ్జరీ కార్ల తయారీలో ఉన్న ఇటలీ దిగ్గజం ఆటోమొబైల్ లంబోర్గినీ తాజాగా భారత్‌లో తొలి ప్లగ్ ఇన్ హైబ్రిడ్ సూపర్ స్పోర్ట్స్ కారు రెవెల్టో ప్రవేశపెట్టింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.8.89 కోట్లు. ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో ఎలక్ట్రిక్+పెట్రోల్ వేరియంట్‌లో లభిస్తుంది. ఇంధనం, డ్రైవింగ్ తీరునుబట్టి మైలేజీ లీటరుకు 10 కిలోమీటర్లు. ఇద్దరు మాత్రమే కూర్చునే వీలుంది. రెండు డోర్లున్న ఈ కారులో పౌచ్ సెల్స్‌తో లిథియం అయాన్ హై స్పెసిఫిక్ పవర్ బ్యాటరీ, 6,498 సీసీ వీ12 ఇంజన్ పొందుపరిచారు. గరిష్ట వేగం గంటకు 350 కిలోమీటర్లు.


## ఫిబ్రవరి బడ్జెట్‌లో భారీ ప్రకటనలేమీ ఉండవు..

- జూలై తర్వాతే పూర్తి బడ్జెట్
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో సమర్పించే బడ్జెట్ .. ఓట్ ఆన్ అకౌంట్ మాత్రమేనని, అందులో ఎటువంటి అద్భుతమైన ప్రకటనలు ఉండబోవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అలాంటి వాటి కోసం, ఎన్నికలయ్యాక ఏర్పడే కొత్త ప్రభుత్వం జూలైలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టే దాకా ఎదురు చూడాల్సిందేనని ఆమె తెలిపారు. సీఐఐ గ్లోబల్ ఎకనమిక్ పాలసీ ఫోరమ్‌లో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు. ఎన్నికల ముంగిట్లో ప్రవేశపెట్టే బడ్జెట్ .. కొత్త సర్కార్ కొలువు తీరే వరకు అయ్యే ప్రభుత్వ వ్యయాలకు ఆమోదం పొందేందుకు ఉద్దేశించి ఉంటుంది. దీన్ని ఓట్ ఆన్ అకౌంట్‌గా వ్యవహరిస్తారు. సాధారణంగా ఇలాంటి వాటిలో ప్రభుత్వం భారీ ప్రతిపాదనలేమీ చేయదు. మరోవైపు, అన్ని రంగాల్లో కార్యకలాపాలు పుంజుకోవడంతో రెండో క్వార్టర్‌లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అత్యధికంగా నమోదైనట్లు రాజ్యసభలో చర్చ సందర్భంగా నిర్మలా సీతారామన్ తెలిపారు. తద్వారా ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఎకానమీగా భారత్ కొనసాగుతోందని ఆమె చెప్పారు. గత ఎనిమిదేళ్ల వ్యవధిలో ప్రపంచంలోనే అతి పెద్ద ఎకానమీల జాబితాలో భారత్ 10వ స్థానం నుంచి అయిదో స్థానానికి చేరిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మేకిన్ ఇండియా, పీఎల్ఐ (ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహకాల స్కీము) వంటి తోడ్పాటు చర్యలతో తయారీ రంగం కూడా ఎకానమీ వృద్ధిలో గణనీయంగా పాలుపంచుకుంటోందని మంత్రి చెప్పారు. నిరుద్యోగిత రేటు 2017–18లో దాదాపు 18 శాతంగా ఉండగా ప్రస్తుతం 10 శాతానికి దిగి వచ్చిందన్నారు.




## జాయ్ అలుక్కాస్ ఆత్మకథ పుస్తకావిష్కరణ




హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ ఆత్మకథ(ఆటోబయోగ్రఫీ) 'స్ప్రెడింగ్ జాయ్–హౌ జోయాలుక్కాస్ బికమ్ వరల్డ్ ఫేవరేట్ జ్యువెలర్'ను షార్జా పుస్తక మేళాలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులతో పాటు, భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. అద్భుతమైన ఈ ఆత్మకథ అమెజాన్‌లో బెస్ట్ సెల్లర్‌గా ఉంది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

| 8-12-2023 | |
|---|---|
| విశాఖ | 550–00 |
| చిత్తూరు | 543–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 545–00 |
| విజయవాడ | 545–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **7-12-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 530–00 |
| వరంగల్ | 532–00 |
| రిటైల్ ధర | 5.90 |

# ఏడు రోజుల ర్యాలీకి బ్రేక్..!

- గరిష్ట స్థాయి వద్ద లాభాల స్వీకరణ
- ఆర్‌బీఐ పాలసీ వెల్లడికి ముందు అప్రమత్తత
- ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు



ముంబై: ఆసియా మార్కెట్లలో నెలకొన్న ప్రతికూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఆర్‌బీఐ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి(నేడు)కి ముందు ట్రేడర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా స్టాక్ సూచీల ఏడు రోజుల వరుస లాభాలకు గురువారం ముగింపు పడింది. సెన్సెక్స్ 132 పాయింట్లు నష్టపోయి 69,522 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు పతనమైన 20,901 వద్ద నిలిచింది. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ఎఫ్ఎంసీజీ, మెటల్, టెక్ షేర్ల అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. యుటిలిటీ, విద్యుత్, కన్జూమర్ డ్యూరబుల్స్, ఇంధన షేర్లు కొనుగోళ్లకు మద్దతు లభించింది. చైనా ఆర్థిక వ్యవస్థ మందగమన ఆందోళనలతో ఆసియా మార్కెట్లు 2% పతనమయ్యాయి. యూరప్ మార్కెట్లు అరశాతం నష్టపోయాయి.

- ఆర్‌బీఐ కన్జూమర్ రుణ నిబంధనలు కఠినతరం చేసిన నేపథ్యంలో పేటీఎం రూ.50,000 లోపు వ్యక్తిగత రుణాల జారీని తగ్గించుకుంటామని ప్రకటించింది. దీంతో కంపెనీ షేరు 19% నష్టపోయి రూ.661 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 20% క్షీణించి రూ.651 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది. షేరు భారీ పతనంతో ఒక్కరోజులో రూ.9,642 కోట్ల(1.15 బిలియన్ డాలర్లు) మార్కెట్ క్యాప్ తుడిచిపెట్టుకుపోయింది.
- ఎల్ఐసీ షేరు ఇంట్రాడేలో 7% లాభపడి రూ.800 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. దీంతో 2022 తర్వాత బీఎస్ఈలో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ తిరిగి రూ.5 లక్షల కోట్ల మార్కు అందుకుంది. మార్కెట్ ముగిసే సరికి 5% లాభపడి రూ.786 వద్ద నిలిచింది. కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.4.96 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. మొత్తం నాలుగు ట్రేడింగ్‌లో ఈ షేరు 19% ర్యాలీ చేసింది.
- ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.1,000 కోట్ల నుంచి రూ.1,200 కోట్ల నిధుల సమీకరణ సిద్ధమైనట్లు వార్తలు వెలువడటంతో స్పైస్‌జెట్ షేరు 20% ఎగసి రూ.52.29 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.

### ఇర్కాన్ ఆఫర్‌కు భారీ స్పందన

4.63 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్

రైల్వే రంగ కంపెనీ ఇర్కాన్ ఇంటర్నేషనల్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)కు సంస్థాగత ఇన్వెస్టర్లనుంచి భారీ స్పందన లభించింది. ప్రభుత్వం మొత్తం 7.53 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. వీటిలో 3.38 కోట్ల షేర్లను నాన్‌రిటైల్ ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేసింది. ఈ కేటగిరీలో 15.66 కోట్ల షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి. వెరసి 4.63 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. వీటి విలువ రూ. 2,400 కోట్లుకాగా.. షేరుకి రూ. 154 ఫ్లోర్ ధరలో ప్రభుత్వం మొత్తం 8 శాతం వాటాను ఆఫర్ చేస్తోంది. నేడు(శుక్రవారం) రిటైల్ ఇన్వెస్టర్లకు విండో ఓపెన్ కానుంది. ప్రస్తుతం ఇర్కాన్‌లో ప్రభుత్వం 73.18 శాతం వాటాను కలిగి ఉంది. ఓఎఫ్ఎస్‌కు నాన్‌రిటైల్ ఇన్వెస్టర్లు రూ. 157.24 సగటు ధరలో దరఖాస్తు చేయడం గమనార్హం!

ఓఎఫ్ఎస్ నేపథ్యంలో ఇర్కాన్ షేరు బీఎస్ఈలో 6.5% పతనమై రూ. 161 దిగువన స్థిరపడింది.

## డోమ్స్ @ రూ. 750–790

- 13 నుంచి ఐపీవో షురూ
- రూ. 1,200 కోట్ల సమీకరణ లక్ష్యం




ముంబై: పెన్సిళ్ల తయారీ దిగ్గజం డోమ్స్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూకి రూ. 750–790 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 13న ప్రారంభమై 15న ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 350 కోట్ల విలువైన ఈక్విటీని కంపెనీ కొత్తగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో రూ. 850 కోట్ల విలువైన షేర్లను డోమ్స్‌లో 51 శాతం వాటా కలిగిన ఇటాలియన్ దిగ్గజం ఫిలాతోపాటు ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ. 1,200 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ప్రధానంగా ఫిలా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని ఆఫర్ చేస్తోంది. కాగా.. అర్హతగల కంపెనీ ఉద్యోగులకు రూ. 5 కోట్ల విలువైన షేర్లను రిజర్వ్ చేసింది. వీటిని షేరుకి రూ. 75 డిస్కౌంట్ ధరలో ఆఫర్ చేస్తోంది.

**కొత్త ప్లాంటు ఏర్పాటు..:** ఈక్విటీ జారీ నిధులను గుజరాత్‌లోని అంబర్‌గామ్‌వద్ద కొత్త తయారీ ప్లాంటు ఏర్పాటు, కార్పొరేట్ అవసరాలకు డోమ్స్ వినియోగించనుంది. ప్రధానంగా డోమ్స్ బ్రాండుతో కంపెనీ స్టేషనరీ, ఆర్ట్ ప్రొడక్టులను విక్రయిస్తోంది. గతేడాది (2022–23) డోమ్స్ ఆదాయం రూ. 684 కోట్ల నుంచి రూ. 1,212 కోట్లకు జంప్‌చేయగా.. రూ. 103 కోట్ల నికర లాభం ఆర్జించింది.

## బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి పరివార్ అకౌంట్




ముంబై: సేవింగ్స్, కరెంటు ఖాతాలకు సంబంధించి బీవోబీ పరివార్ అకౌంటును ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా వెల్లడించింది. దీని ప్రకారం ఒకే కుటుంబానికి చెందిన సభ్యులందరి ఖాతాలను ఒక గ్రూపుగా పరిగణిస్తారు. ప్రతి ఖాతాను ఎవరికి వారు వేర్వేరుగా నిర్వహించుకుంటున్నప్పటికీ కనీస త్రైమాసిక బ్యాలెన్స్ (క్యూఏబీ)ని గ్రూప్/కుటుంబ స్థాయిలో లెక్కిస్తారు. తద్వారా ప్రతి ఖాతా వేర్వేరుగా క్యూఏబీ పాటించక్కర్లేదు. పరివార్ ఖాతాలో కనిష్టంగా ఇద్దరు, గరిష్టంగా ఆరుగురు కుటుంబ సభ్యులు ఉండవచ్చు. సిల్వర్, గోల్డ్, డైమండ్ అని 3 కేటగిరీల్లో ఈ ఖాతాలు ఉంటాయి. ఈ ఖాతాదారులు తక్కువ వడ్డీపై రిటైల్ రుణాలు, ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపు వంటి ప్రయోజనాలను పొందొచ్చని బ్యాంక్ సీజీఎం రవీంద్ర సింగ్ నెగి తెలిపారు.

# సాక్షి స్పోర్ట్స్



### గౌతమ్‌కు ఐదు స్వర్ణాలు

తెలంగాణ స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అంతర్ జిల్లా జూనియర్, సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ స్విమ్మర్ గౌతమ్ శశివర్ధన్ ఐదు స్వర్ణ పతకాలతో అదరగొట్టాడు. విక్కీ స్విమ్మింగ్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న 14 ఏళ్ల గౌతమ్ బరిలోకి దిగిన ఐదు ఈవెంట్లలోనూ విజేతగా నిలిచాడు. గ్రూప్–2 వయో విభాగంలో గౌతమ్ 50, 100, 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్, 200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ ఈవెంట్లలో పసిడి పతకాలు గెలిచాడు. ఈ ప్రదర్శనతో గౌతమ్ ఈనెల 27 నుంచి 29 వరకు బెంగళూరులో జరిగే జాతీయ జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ జట్టులోకి ఎంపికయ్యాడు.

### రెండో రోజు ఆట వర్షార్పణం


బంగ్లాదేశ్, న్యూజిలాండ్ జట్ల మధ్య మిర్పూర్‌లో జరుగుతున్న రెండో టెస్టు తొలిరోజు ఆటను ఇరుజట్ల బౌలర్లు శాసిస్తే, రెండో రోజు ఆటను వాన ఆపేసింది. గురువారం భారీ వర్షం వల్ల స్టేడియం చిత్తడిగా మారింది. దీంతో ఒక బంతి అయిన పడకుండానే అంపైర్లు ఆటను రద్దు చేయాల్సి వచ్చింది.

## శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ మ్యాచ్ 'డ్రా'



శ్రీనగర్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు రెండో 'డ్రా' నమోదు చేసింది. రియల్ కశ్మీర్ ఎఫ్‌సీ జట్టుతో గురువారం జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి డెక్కన్ జట్టు 0–0తో 'డ్రా'గా ముగించింది. రెండు జట్లకు గోల్ చేసే అవకాశాలు లభించినా ఫినిషింగ్ లోపంతో సాధ్యపడలేదు. 13 జట్ల మధ్య జరుగుతున్న ఐ–లీగ్‌లో ఇప్పటి వరకు శ్రీనిధి జట్టు తొమ్మిది మ్యాచ్‌లు ఆడింది. ఐదు మ్యాచ్‌ల్లో గెలిచింది. రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి, మరో రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని ఓవరాల్‌గా 17 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఈనెల 11న జరిగే తదుపరి మ్యాచ్‌లో ఢిల్లీ ఎఫ్‌సీతో హైదరాబాద్‌లో శ్రీనిధి జట్టు తలపడుతుంది.

## అజేయంగా కీర్తిక



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్–13 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి బి.కీర్తిక ఐదో విజయం సాధించింది. గురువారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌లో కీర్తిక 44 ఎత్తుల్లో మీరా సింగ్ (ఢిల్లీ)పై గెలిచింది. ఏడో రౌండ్ తర్వాత నిహిరా కౌల్ (మహారాష్ట్ర), ఆముక్త (ఆంధ్రప్రదేశ్)లతో కలిసి కీర్తిక ఆరు పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉంది. కీర్తిక ఐదు గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నైనా గొర్లి 6.5 పాయింట్లతో రెండో స్థానంలో... శ్రేయా హిప్పరాగి (మహారాష్ట్ర) 7 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తెలంగాణకే చెందిన సంహిత పుంగవనం, శివాంశిక 5.5 పాయింట్లతో మరో ఎనిమిది మందితో కలిసి ఉమ్మడిగా నాలుగో స్థానంలో ఉన్నారు.

# భారత్‌కు స్పెయిన్ షాక్

- రెండో మ్యాచ్‌లో 1–4తో ఓడిపోయిన యువ భారత్
- జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీ



గోల్ చేసిన ఆనందంలో భారత బృందం

కౌలాలంపూర్: జూనియర్ పురుషుల అండర్–21 ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత్‌కు ఊహించని ఫలితం ఎదురైంది. గురువారం వరుసగా రెండో విజయం సాధించి దర్జాగా క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకోవాలని ఆశించిన యువ భారత్ గ్రూప్ 'సి' రెండో లీగ్ మ్యాచ్‌లో 1–4 గోల్స్ తేడాతో స్పెయిన్ చేతిలో ఓడిపోయింది. వరుసగా రెండో విజయంతో స్పెయిన్ జట్టు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో దక్షిణ కొరియాపై 4–2తో నెగ్గి శుభారంభం చేసిన భారత జట్టుకు రెండో మ్యాచ్‌లో స్పెయిన్ నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. ఆట తొలి నిమిషంలోనే పాల్ క్యాబిర్ వెర్డెల్ గోల్‌తో స్పెయిన్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 18వ నిమిషంలో ఆండ్రెస్ రాఫి గోల్‌తో స్పెయిన్ ఆధిక్యం 2–0కు పెరిగింది. 33వ నిమిషంలో రోహిత్ గోల్ సాధించడంతో భారత్ ఖాతా తెరిచింది. అయితే స్పెయిన్ జోరు తగ్గించకుండా ఆడుతూ ఎనిమిది నిమిషాల తర్వాత మూడో గోల్ చేసింది. పాల్ క్యాబిర్ వెర్డెల్ గోల్‌తో స్పెయిన్ 3–1తో ముందంజ వేసింది. మ్యాచ్ చివరి నిమిషంలో ఆండ్రెస్ రాఫి గోల్‌తో స్పెయిన్ 4–1తో విజయాన్ని ఖాయం చేసుకుంది. భారత జట్టుకు ఈ మ్యాచ్‌లో ఏడు పెనాల్టీ కార్నర్‌లు రాగా కేవలం ఒక దానిని సద్వినియోగం చేసుకుంది. మరో మ్యాచ్‌లో దక్షిణ కొరియా 4–1తో కెనడాను ఓడించి క్వార్టర్ ఫైనల్ రేసులో నిలిచింది. శనివారం జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో కెనడాతో భారత్; కొరియాతో స్పెయిన్ తలపడతాయి. కొరియా–స్పెయిన్ మ్యాచ్ తర్వాతే భారత జట్టు మ్యాచ్ జరుగుతుంది. ఒకవేళ స్పెయిన్ చేతిలో కొరియా ఓడితే భారత్ తమ మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంటే చాలు క్వార్టర్ ఫైనల్ చేరుకుంటుంది. ఒకవేళ స్పెయిన్‌పై కొరియా గెలిస్తే మాత్రం భారత్ భారీ తేడాతో కెనడాపై తప్పనిసరిగా విజయం సాధించాల్సి ఉంటుంది.

**ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | టై | పా |
|---|---|---|---|---|---|
| గుజరాత్ జెయింట్స్ | 4 | 3 | 1 | 0 | 16 |
| పట్నా పైరేట్స్ | 2 | 2 | 0 | 0 | 10 |
| బెంగాల్ వారియర్స్ | 2 | 1 | 0 | 1 | 8 |
| యూపీ యోధాస్ | 2 | 1 | 1 | 0 | 6 |
| యు ముంబా | 2 | 1 | 1 | 0 | 6 |
| తమిళ్ తలైవాస్ | 1 | 1 | 0 | 0 | 5 |
| పుణేరి పల్టన్ | 1 | 1 | 0 | 0 | 5 |
| జైపూర్ పింక్ పాంథర్స్ | 2 | 0 | 1 | 1 | 4 |
| బెంగళూరు బుల్స్ | 2 | 0 | 2 | 0 | 2 |
| తెలుగు టైటాన్స్ | 2 | 0 | 2 | 0 | 1 |
| దబంగ్ ఢిల్లీ | 1 | 0 | 1 | 0 | 0 |
| హరియాణా స్టీలర్స్ | 1 | 0 | 1 | 0 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు

## గుజరాత్‌పై పట్నా పైచేయి



అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో వరుసగా మూడు విజయాలతో జోరు మీదున్న గుజరాత్ జెయింట్స్ జట్టుకు పట్నా పైరేట్స్ బ్రేక్ వేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్ 33–30 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. ఈ లీగ్‌లో పట్నాకిది వరుసగా రెండో విజయంకాగా... గుజరాత్ జట్టుకిది తొలి పరాజయం. గుజరాత్‌తో మ్యాచ్‌లో పట్నా సమష్టి ఆటతో రాణించింది. పట్నా పైరేట్స్ తరఫున సుధాకర్ (6 పాయింట్లు), సచిన్ (4), నీరజ్ కుమార్ (4), అంకిత్ (4), సందీప్ కుమార్ (4 పాయింట్లు) ఆకట్టుకున్నారు. గుజరాత్ తరఫున రాకేశ్ 11 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచినా ఫలితం లేకపోయింది. అంతకుముందు బెంగాల్ వారియర్స్, జైపూర్ పింక్ పాంథర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 28–28తో 'డ్రా'గా ముగిసింది. బెంగాల్ తరఫున శ్రీకాంత్ జాదవ్ (7), నితిన్ కుమార్ (5), మణీందర్ సింగ్ (4)... జైపూర్ తరఫున భవాని రాజ్‌పుత్ (10) అర్జున్ దేశ్వాల్ (6) రాణించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్‌తో దబంగ్ ఢిల్లీ; పుణేరి పల్టన్‌తో యు ముంబా తలపడతాయి.

## 'నన్ను ఫిక్సర్ అన్నాడు'

గంభీర్‌పై శ్రీశాంత్ ఆరోపణ





శ్రీశాంత్

సూరత్: గౌతమ్ గంభీర్...ఎస్.శ్రీశాంత్...భారత జట్టు తరఫున కలిసి 49 మ్యాచ్‌లు ఆడారు. 2007 టి20, 2011 వన్డే వరల్డ్ కప్ విజయాల్లో భాగస్వాములు. రిటైర్మెంట్ తర్వాత 'సీనియర్ల'గా లెజెండ్స్ లీగ్ క్రికెట్ (ఎల్ఎల్‌సీ)లో ఆడుతున్నారు. కానీ ఆవేశకావేశాలకు మారుపేరైన వీరిద్దరు ఇలాంటి వెటరన్ టోర్నీలో కూడా గొడవ పడ్డారు. గంభీర్ తనను పదే పదే 'ఫిక్సర్' అంటూ దూషించాడని శ్రీశాంత్ ఆరోపించాడు. బుధవారం ఇండియా క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్ జట్ల మధ్య జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. మ్యాచ్ తర్వాత ఒక వీడియో విడుదల చేసిన శ్రీశాంత్ 'నా తప్పు ఏమీ లేకపోయినా గంభీర్ నన్ను అనరాని మాటలు అన్నాడు. అది సరైంది కాదు' అని అన్నాడు. అయితే ఆ తర్వాత కొద్ది సేపటికే మరో వీడియోలో దానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించాడు. 'ఫిక్సర్, ఫిక్సర్, నువ్వు ఫిక్సర్‌వి అంటూ పదే పదే గంభీర్ అన్నాడు. నేను నవ్వుతూ ఉన్నా అతను మాత్రం అలాంటి దూషణలు కొనసాగించాడు. నేను ఒక్క చెడు మాట కూడా మాట్లాడలేదు. అసలు అతనికి ఎందుకు కోపం వచ్చిందో, ఎందుకు అలా అన్నాడో నాకు అస్సలు అర్థం కాలేదు' అని వివరించాడు. ఈ ఘటనపై గంభీర్ వైపు నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదు కానీ తాను చిరునవ్వులు చిందిస్తున్న ఫొటోను ట్విట్టర్‌లో పెట్టాడు. ఎల్ఎల్‌సీలో తగిన నిబంధనలు, ప్రమాణాలు పాటిస్తున్నామని, ఘటనపై విచారణ చేస్తామని మాత్రం టోర్నీ నిర్వాహకులు ప్రకటించారు. ఆ తర్వాత దీనిని కొనసాగించిన శ్రీశాంత్... 'నువ్వు అందరితో ఇలాగే ఉంటావు, సీనియర్లను కూడా గౌరవించవు. నన్ను అలా అనే హక్కు నీకు లేదు. అయినా నువ్వు సుప్రీం కోర్టుకంటే ఎక్కువా' అని ప్రశ్నించాడు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ ఉదంతంలో శ్రీశాంత్‌పై బీసీసీఐ జీవితకాల నిషేధం విధించగా... సుప్రీం కోర్టు ఆదేశాలతో దానిని ఏడేళ్లకు తగ్గించడంతో 2020లో అతని నిషేధం ముగిసింది.

## క్వార్టర్స్‌లో అచ్యుతాదిత్య–హర్షవర్ధన్ జోడీ

గువాహటి: హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో కీలక దశలో పాయింట్లు గెలిచిన దొడ్డవరపు అచ్యుతాదిత్య రావు–వెంకట హర్షవర్ధన్ (భారత్) జోడీ... గువాహటి ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–100 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో తెలంగాణకు చెందిన అచ్యుతాదిత్య, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హర్షవర్ధన్ ద్వయం 24–22, 23–21తో నాలుగో సీడ్ వె చున్ వె–వు గువాన్ జున్ (చైనీస్ తైపీ) జంటను బోల్తా కొట్టించింది. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో హైదరాబాద్ అమ్మాయి సామియా 15–21, 21–18, 13–21తో రెండో సీడ్ వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో పోరాడి ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి (భారత్) జోడీ 21–13, 19–21, 17–21తో చూంగ్ హోన్ జియాన్–గో పె కీ (మలేసియా) జంట చేతిలో పరాజయం పాలైంది.

## రెండో వన్డేలో ఇంగ్లండ్ విజయం

రాణించిన స్యామ్ కరన్, జాక్స్, బట్లర్


స్యామ్ కరన్

అంటిగ్వా: ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన ఇంగ్లండ్ జట్టు వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో ఆరు వికెట్ల తేడాతో గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–1తో సమం చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 39.4 ఓవర్లలో 202 పరుగులకే కుప్పకూలింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్యామ్ కరన్ (3/33), లివింగ్‌స్టోన్ (3/39), అట్కిన్సన్ (2/28), రేహన్ (2/40) వెస్టిండీస్‌ను దెబ్బ తీశారు. అనంతరం ఇంగ్లండ్ దూకుడుగా ఆడి 32.5 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 206 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ విల్ జాక్స్ (72 బంతుల్లో 73; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ జోస్ బట్లర్ (45 బంతుల్లో 58 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. ముందుగా ఓపెనర్లు జాక్స్, ఫిల్ సాల్ట్ (21) తొలి వికెట్‌కు 50 పరుగులు జోడించారు. అనంతరం క్రాలీ (3), డకెట్ (3) నిరాశ పరిచారు. ఈ దశలో హ్యారీ బ్రూక్ (49 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), బట్లర్ అబేధ్యమైన ఐదో వికెట్‌కు 90 పరుగుల జోడించి జట్టును గెలిపించారు.

## కృష్ణా జలాల వివాదంపై నేటి భేటీ రద్దు

### వచ్చే నెలలో రెండు రాష్ట్రాల సీఎస్‌లతో కేంద్రం సమావేశం

**సాక్షి, అమరావతి:** కృష్ణా జలాల వివాదం పరిష్కారమే అజెండాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో శుక్రవారం నిర్వహించాల్సిన సమావేశాన్ని కేంద్రం రద్దు చేసింది. మళ్లీ భేటీ ఎప్పుడన్నది తర్వాత తెలియజేస్తామని రెండు రాష్ట్రాల సీఎస్‌లకు కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ గురువారం సమాచారం ఇచ్చారు. హక్కులను కాపాడుకోవడం కోసం రాష్ట్ర భూభాగంలోని సాగర్ స్పిల్ వే, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను గత నెల 30న ఏపీ ఆధీనంలోకి తీసుకోవడంతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం ఉత్పన్నమైంది. సాగర్ వివాదంతోపాటు కృష్ణా జలాల పంపిణీ, ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించడంపై రెండు రాష్ట్రాల సీఎస్‌లతో ఈనెల 6న సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఈనెల 8కి వాయిదా వేశారు. ఇక తెలంగాణలో కొత్త ప్రభుత్వం గురువారం కొలువుదీరింది. ఈక్రమంలో శుక్రవారం నిర్వహించాల్సిన సమావేశాన్ని రద్దు చేసినట్లు కేంద్రం ప్రకటించింది.

## ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద ఏపీకి రూ.493.60 కోట్లు

- 'ఎక్స్'లో వెల్లడించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా

**సాక్షి, న్యూఢిల్లీ :** మిచాంగ్ తుపాను ప్రభావంతో అల్లాడుతున్న ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక సహకారం అందించేందుకు వీలుగా రాష్ట్ర విపత్తు స్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నుంచి రూ.493.60 కోట్లు విడుదల చేయాలని కేంద్ర హోంశాఖను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ కింద కేంద్ర వాటాగా ఈ నిధులు విడుదల చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు నిధుల విడుదలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్' (ట్విట్టర్)లో ట్వీట్ చేశారు. 'మిచాంగ్ తుపాను ప్రభావం తమిళనాడు, ఏపీలపై ఎక్కువగా ఉంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ రెండో విడత కింద కేంద్ర వాటాగా రూ.493.60 కోట్లు ఏపీకి, తమిళనాడుకు రూ.450 కోట్లు ముందస్తుగా విడుదల చేయాలని హోంశాఖను ప్రధాని ఆదేశించారు. కేంద్రం ఇప్పటికే రెండు రాష్ట్రాలకు అదే మొత్తంలో మొదటి విడత విడుదల చేసింది'.. అని షా తన ట్వీట్‌లో పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలందరి శ్రేయస్సు, క్షేమం కోసం కీలక సమయంలో కేంద్రం వారికి అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కృషి జరుగుతోందని అమిత్ షా వెల్లడించారు.

# పేద మహిళలకు 'మహిళాశక్తి' ఆటోలు

- తొలి విడతలో పొదుపు సంఘాల సభ్యులైన 231 మంది ఎస్సీ, ఎస్టీ మహిళలకు పంపిణీ
- ఈ ఆర్థిక సంవత్సరంలో 660 మందికి పంపిణీ లక్ష్యం
- అంబేడ్కర్ జయంతి నాటికి మిగిలిన లబ్ధిదారుల ఎంపిక
- ఆటో కొనుగోలు ఖర్చులో 90శాతం వడ్డీ లేని రుణం
- 48 నెలలు సమాన కిస్తీల్లో చెల్లింపు
- 26 జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో మహిళలకు ఆటోల అందజేత
- సెర్ప్ అధికారులు వెల్లడి


మహిళలకు ఆటోలు పంపిణీ చేస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

**సాక్షి, అమరావతి:** ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్న పొదుపు సంఘాల సభ్యులైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వం గురువారం 'మహిళాశక్తి' పేరుతో ఆటోలను పంపిణీ చేసింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మండలానికి ఒకరు చొప్పున 660 మండలాల్లో 660 మందికి ఆటోలను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. తొలి విడతగా రాష్ట్రవ్యాప్తంగా 231 మందికి అందించింది. జిల్లాల వారీగా ఎంపికైన లబ్ధిదారులకు ఆయా జిల్లాల్లోనే కలెక్టర్ల ఆధ్వర్యంలో ఆటోలను అందించినట్లు సెర్ప్ అధికారులు వెల్లడించారు. గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్, అడిషనల్ సీఈవో విజయకుమారి, 'ఉన్నతి' డైరెక్టర్ రాజాప్రతాప్ నేతృత్వంలో విజయవాడ గొల్లపూడిలోని టీటీడీసీ కేంద్రంలో పదిమంది లబ్ధిదారులకు ఆటోలను అందజేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా నాలుగున్నరేళ్లుగా పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలను, 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు వైఎస్సార్ చేయూత సహా అనేక కార్యక్రమాలు అమలుచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం... స్వశక్తితో ఎదగాలని కోరుకునే పేదింటి మహిళలకు చేయూతనిచ్చేందుకు 'మహిళా శక్తి' పేరుతో ఆటోల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్టుకున్న లక్ష్యం మేరకు మిగిలిన లబ్ధిదారుల ఎంపికను ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి నాటికి పూర్తిచేసి వారికి ఆటోలు అందజేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు.

### భరించాల్సింది 10 శాతమే

కొనుగోలుకు అయ్యే ఖర్చులో కేవలం పదిశాతం మేర లబ్ధిదారులు భరిస్తే మిగిలిన 90శాతం మొత్తాన్ని ప్రభుత్వం వడ్డీ లేని రుణంగా సెర్ప్ ద్వారా సమకూరుస్తోంది. ఆ 90శాతం రుణాన్ని కేవలం అసలు మొత్తం 48 నెలవారీ కిస్తీల రూపంలో చెల్లించే వెసులుబాటు కల్పించింది. దీంతో వడ్డీ రూపంలో దాదాపు రూ.1.5లక్షల మేర లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని అధికారులు వివరించారు. ఆటోలను లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసి అందజేసినందుకు సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్, అధికారులకు మహిళా సంఘాల సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు

**తిరుపతి సిటీ:** ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో మూడు రోజులుగా 'పశు శరీర నిర్మాణ శాస్త్రంలో ఆధునిక పద్ధతులు, వినియోగం, ఆరోగ్యం, ఉత్పాదకత' అనే అంశాలపై జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు సింహపురి వర్సిటీ మాజీ వీసీ రాజారామిరెడ్డి హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ పశు శరీర నిర్మాణ శాస్త్రం ప్రాథమిక అంశాలపై పరిశోధనలు చేయడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పరిశోధనలో ఆధునిక, సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకోవడానికి ఇలాంటి జాతీయ సదస్సులు దోహదపడతాయని తెలిపారు. అనంతరం సదస్సును ఉద్దేశించి జరిగిన పరిశోధకుల ఉపన్యాసాలు, పోస్టర్ల కాంపిటీషన్‌లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సదస్సులో ఐఏవీఏ ప్రెసిడెంట్ డాక్టర్ కిశోర్, సెక్రటరీ డాక్టర్ వ్యాస్, డాక్టర్ చంద్రశేఖర్, పలు రాష్ట్రాల నుంచి హాజరైన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


పరిశోధకులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ముఖ్యఅతిథులు

## 'ఈనాడు' అవాస్తవ ఆరోపణలు

**సాక్షి, అమరావతి:** ఏజెన్సీలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గర్భిణుల వసతి గృహాల నిర్వహణపై గురువారం ఈనాడు పత్రికలో ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తవమని వైద్య, ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. వసతి గృహాలకు గర్భిణులు ప్రసవ సమయానికి 7 రోజుల ముందు చేరుకుంటారని.. వారికి రోజుకు రూ.300 ఖర్చుతో ఉచిత ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపింది. సాలూరు పరిసర ప్రాంతాల్లోని గర్భిణుల కోసం సాలూరులో వసతి గృహం ఏర్పాటు చేశారని, ఇందులో సేవలందించేందుకు ఏఎన్‌ఎంలను నియమించారని పేర్కొంది. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గుమ్మ లక్ష్మీపురంలోనూ ఓ వసతి గృహం ఉందన్నారు. ఈ రెండింటి నిర్వహణ కోసం 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,50,500 నిధులు అందించామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ రూ.3,75,000 అందించామని తెలిపింది. రాష్ట్రంలో గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జనని శిశు సురక్షా కార్యక్రమం కింద గర్భిణులకు ఉచిత వైద్య సేవలు, మందులు, వైద్య పరీక్షలు, రక్త మార్పిడి, ఆహారం, రిఫరల్, రవాణా ఖర్చుల నిమిత్తం అన్ని ప్రభుత్వ వైద్యశాలలకు రూ.29.09 కోట్లు విడుదల చేశామని తెలిపింది. దీంతోపాటు గర్భిణులకు 108 అంబులెన్స్‌లు, వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొంది.

# కొప్పర్తిలో మరో 'టెక్నాలజీ' పార్కు

**రూ.250 కోట్లతో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు**

- అత్యాధునిక ల్యాబ్‌లతో పాటు పలు ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ కోర్సులు
- రాష్ట్ర ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలోని సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలను చేయిపట్టి నడిపించేలా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు ముందుకేసింది. ఎంఎస్‌ఎంఈలకు అవసరమైన నూతన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేలా కొత్తగా మరో ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. విశాఖలోని టెక్నాలజీ సెంటర్ లాగానే వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో మరో టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటుకానుంది. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో దీనిని ఏర్పాటు చేస్తారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్ర ఎంఎస్‌ఎంఈ శాఖ ఆమోదం తెలిపిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ సీహెచ్ రాజేశ్వరరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో కేంద్ర ప్రతినిధులు పరిశీలించిన సుమారు 19.5 ఎకరాల భూమిని కేటాయించాల్సిందిగా కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి కేంద్ర అదనపు కార్యదర్శి రజనీష్ లేఖ రాశారు. విశాఖలో తయారీ రంగానికి సంబంధించిన పరిశ్రమలు అధికంగా ఉండటంతో జనరల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేశారని, అదే తరహాలో కొప్పర్తిలో వైఎస్సార్ ఈఎంసీ, వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ ఉండటంతో ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమలకు అనుగుణంగా టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ టెక్నాలజీ సెంటర్‌ను వినియోగించుకునేలా సంబంధిత పరిశ్రమలతో ముందస్తుగా ఒప్పందాలు కుదుర్చుకుంటారు. దీనికి సంబంధించి త్వరలోనే అధ్యయనం చేసి ఏ విభాగానికి చెందిన టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలన్న దానిపై కేంద్రానికి ప్రతిపాదనలను పంపనున్నారు. ఈ టెక్నాలజీ సెంటర్‌లో అధునాతనమైన ల్యాబ్‌లతో పాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేలా దీర్ఘకాలిక, మధ్య కాలిక, స్వల్ప కాలిక కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్థానిక యూనిట్లలో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.


కొప్పర్తి పారిశ్రామికవాడ ముఖద్వారం

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి


వికసిత్ భారత్ సంకల్ప యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

**గవర్నర్ అబ్దుల్ నజీర్**

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేందుకు సమన్వయంతో పని చేయాలని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సూచించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించేందుకు దేశంలోని అన్ని పంచాయతీలు, నగర పంచాయతీలు, పట్టణాల్లో ఈ వికసిత్ భారత సంకల్ప యాత్ర నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. ప్రధానంగా మహిళలకు సంక్షేమ పథకాల గురించి విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొన్నారు.

# మార్కెట్ కలిపిన బంధం

**మార్కెట్ అంటే.. కొందరి వ్యక్తుల మధ్య జరిగే వ్యాపారం. రైతు సరకు ఉత్పత్తి చేస్తాడు. వ్యాపారి వాటిని కొనుగోలు చేసి విక్రయిస్తాడు. వినియోగదారుడు ఆ సరకులను కొనుగోలు చేస్తాడు. ఇంతేనా.? మరో కోణంలో చూస్తే.. సరికొత్త బంధం కనిపిస్తుంది. రక్త సంబంధం లేకపోయినా.. బంధువులు కాకపోయినా.. అందరూ వ్యాపారులు, కొనుగోలుదారులే అయినప్పటికీ.. ఇంటి మనుషుల్లా వ్యవహరించే తీరు ఆకర్షిస్తుంది. ఏం అక్కా బాగున్నావా.? రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. మంచి క్యారెట్ వచ్చింది. తీసుకెళ్లు.! హాయ్ అన్నా.. క్యాబేజీ బాగుంది.. గిట్టుబాటవుతుంది.! ఏం బావా లేటైంది.. ఇంకొంచెం ముందు వచ్చుంటే.. బాగుండేది.. మంచి క్వాలిటీ క్యాప్సికమ్ వచ్చింది.. ఇలాంటి ఆప్యాయతల పిలుపుతో మార్కెట్ సందడిగా ఉంటుంది. పని ఒత్తిడిని దూరం చేస్తుంది. ఇలాంటి ప్రపంచం జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌లో మనకు తారసపడుతుంది.**

– విశాఖపట్నం డెస్క్

- ఉపాధినిస్తున్న జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వందల మందికి పని
- వ్యాపారులు, కొనుగోలుదారుల మధ్య పెనవేసుకున్న అనుబంధం


జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్



జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌పై ఆధారపడిన వ్యాపారులు, గుమస్తాలు, కలాసీలు, ఇక్కడ సరకులు కొనుగోలు చేసి నగరంలో విక్రయించే వారి దినచర్య ప్రతి రోజూ వేకువజాము 3 గంటలకే ప్రారంభమవుతుంది. రైతులు పండించిన పంటలు ఎక్కడెక్కడి నుంచో జ్ఞానాపురం మార్కెట్‌కు చేరుకుంటాయి. వ్యాపారులు దగ్గరుండి కలాసీల ద్వారా సరకులు దింపిస్తారు. మీకేంటి రెండు చేతులా సంపాదిస్తారు అంటాం గానీ.. సాయంత్రం 5 గంటల నుంచి మరుసటి రోజు 10 గంటల వరకు వీళ్లు ఒళ్లంతా కళ్లు చేసుకుంటే కానీ వ్యాపారం సాగదు. కూరగాయలు, ఆకుకూరలు ఏ రోజుకు ఆ రోజు విక్రయాలు పూర్తి చేస్తే హ్యాపీ.. ధర బాగుండి.. డిమాండ్ ఉంటే ఒకే.. లేకపోతే ఆ రోజు నష్టం తప్పదు. ఇక ఒక్కో దుకాణం మీద ఆధారపడి పదుల సంఖ్యలో గుమస్తాలు, కలాసీలు ఉపాధి పొందుతున్నారు. వీరిలో కొందరికి జీతాలు, రోజువారీ కూలీ ఇస్తుండగా.. మరికొందరు చేతనైన పనిచేస్తూ ఇచ్చింది తీసుకెళ్తుంటారు. ఒక్కసారి కూరగాయల మార్కెట్‌లోకి అడుగుపెడితే ఓ ప్రపంచమే కళ్ల ముందు కనిపిస్తుంది. రైతు కష్టం, కలాసీ జీవనం, వ్యాపారి మార్కెటింగ్ వ్యూహం తెలుస్తుంది.


మార్కెట్ నుంచి కూరగాయల తరలింపు

**ఉదయాన్నే మరో ప్రపంచం**

**కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న సరకును ఇక్కడి వ్యాపారులు ఉదయం 3.30 గంటల నుంచి విక్ర**యానికి ఉంచుతారు. ఇక్కడి నుంచి రైతు బజార్ల వ్యాపారులు, హోటళ్ల యజమానులు, రిటైల్ వ్యాపారులు, హోటళ్లకు సరఫరా చేసేవారు, తోపుడు బండ్ల వ్యాపారులు కూరగాయలు కొనుగోలు చేస్తారు. కొంత మంది వ్యాపారులు రిటైల్‌గా కూడా విక్రయిస్తారు. ఇక్కడ కొనుగోలు చేసిన వాళ్లు తిరిగి వాటిని ఇళ్ల వద్ద దుకాణాల్లో, తోపుడు బండ్లపై విక్రయిస్తుంటారు. ఇలా మధ్యాహ్నం ఒంటి గంట వరకు మార్కెట్‌లో హడావిడి కనిపిస్తుంది.

**కరోనా సమయంలోనూ..**

మార్కెట్‌కు ప్రతీ ఆదివారం సెలవు. సంక్రాంతి, దసరా, మే డే, నాగులచవితి తదితర రోజుల్లో సెలవు ఉంటుంది. మిగతా అన్ని రోజులు పనిచేస్తుంది. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలోనూ మార్కెట్ తెరిచారు. మార్కెట్‌కు పక్కనే ఉన్న శ్మశానవాటికలో ఓ పక్క మృతదేహాలు కాలుతుంటే.. ఇక్కడ వ్యాపారులు, కలాసీలు, గుమస్తాలు ధైర్యంగా పనిచేసి.. నిత్యావసరాల్లో భాగమైన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూశారు. కరోనాకు ఎదురొడ్డి నిలిచి అందరి ఆకలి తీర్చారు.


### మార్కెట్ చరిత్ర

**నగరం**లో కూరగాయల మార్కెట్ అంటే **టక్కు**న గుర్తొచ్చేది పూర్ణా మార్కెట్. బ్రిటిష్ ప్రభుత్వం 1935లో నిర్మించిన ఈ మార్కెట్ స్వాతంత్య్రం అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్‌గా మారింది. సొంత భవనాల్లో వ్యాపారులు హోల్‌సేల్‌గా కూరగాయలు, పండ్లు, కిరాణా సరకులు విక్రయించేవారు. రోజురోజుకూ వినియోగదారుల తాకిడి పెరగడం, రోడ్లపై వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. 1988లో అప్పటి మేయర్ డి.వి. సుబ్బారావు, కమిషనర్ మహంతి కూరగాయలు, పండ్లు, అరటి పండ్ల వ్యాపారులతో సమావేశయ్యారు. వేరే ప్రాంతంలో పునరావాసం కల్పిస్తామని, హోల్‌సేల్ మార్కెట్లు తరలించాలని ప్రతిపాదన చేశారు. మొదట్లో ససేమిరా అన్న వ్యాపారులు ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో కొన్ని షరతులతో ఒకే చెప్పారు. ఈ క్రమంలో జ్ఞానాపురంలో స్థలం కేటాయించడంతో.. సొంతంగానే వ్యాపారులు షెడ్లు వేసుకున్నారు. అలా 1990లో హోల్‌సేల్‌గా కూరగాయల విక్రయాలు ప్రారంభమయ్యాయి. మొదట్లో సరిగ్గా వ్యాపారాలు సాగలేదు. అందరూ పూర్ణా మార్కెట్‌కే వెళ్లేవారు. 2000 సంవత్సరం నుంచి వ్యాపారాలు ఊపందుకున్నాయి. మొదట్లో ఇక్కడకు వస్తామన్న అరటి పండ్లు, పండ్ల వ్యాపారులు తర్వాత రాలేదు. 33 ఏళ్లుగా ఈ మార్కెట్ నగర ప్రజల కూరగాయల అవసరాలు తీరుస్తోంది. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది.

### ఇదీ మార్కెట్ స్వరూపం

| | |
|---|---|
| మార్కెట్ ప్రారంభం | 1990 |
| విస్తీర్ణం | 1.7 ఎకరాలు |
| దుకాణాలు | 66 |
| కలాసీలు | సుమారు 1,000 |
| గుమస్తాలు | 400 నుంచి 500 |
| రిక్షా కార్మికులు | 200 నుంచి 300 |
| ఆటో కార్మికులు | 300 నుంచి 400 |
| లారీ కార్మికులు | 300 నుంచి 400 |
| పరోక్షంగా ఉపాధి పొందుతున్న కుటుంబాలు | 5 వేలు |

### కూరగాయలు వచ్చేది ఇలా..



మహారాష్ట్ర నుంచి ఉల్లి, పశ్చిమ బెంగాల్ నుంచి బంగాళాదుంపలు(పాత), ఇండోర్ నుంచి కొత్త బంగాళాదుంపలు, కర్నాటక నుంచి టమాటా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, బిహార్ నుంచి చిక్కుడు, మిర్చి, బీన్స్, పొటల్స్, గ్రీన్ ప్రీస్, బెండ, దొండ, కీర, ఆనపకాయ, హైదరాబాద్ నుంచి బీట్‌రూట్, క్యారెట్, కర్నాటక నుంచి క్యాప్సికం, అల్లం, బీన్స్ తదితర కూరగాయలు ఈ మార్కెట్‌కు వస్తాయి. మన రాష్ట్రంలో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఉత్పత్తయ్యే కూరగాయాలు మార్కెట్ వస్తాయని వ్యాపారులు చెబుతున్నారు. మదనపల్లి నుంచి టమాటా, విజయవాడ నుంచి కరివేపాకు, చింతల అగ్రహారం ఆకుకూరలు, అరకు, పాడేరు, చింతపల్లి తదితర ప్రాంతాల నుంచి అల్లం, బీన్స్, పార్వతీపురం, రామభద్రాపురం, కొవ్వూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి కాలీఫ్లవర్, కత్తిపూడి, పిఠాపురం, ద్వారపూడి తదితర ప్రాంతాల నుంచి బెండ తదితర కూరగాయలు వస్తాయి.


పచ్చిమిర్చి విక్రయిస్తున్న వ్యాపారులు

### వైష్ణవి మార్కెట్‌గా పేరు నిర్ణయించాం



పూర్ణామార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ పెరగడంతో అప్పటి మేయర్, కమిషనర్ కోరిక మేరకు జ్ఞానాపురంలో షెడ్‌లు వేసుకుని హోల్‌సేల్ మార్కెట్‌ను ప్రారంభించాం. 33 ఏళ్లుగా ఇక్కడే వ్యాపారం సాగిస్తున్నాం. ఇక్కడ వ్యాపారులు, కలాసీలతో ఓ అనుబంధం ఉంది. ఇన్ని రోజులు మార్కెట్‌కు పేరంటూ లేదు. అందరూ చావులమదుం మార్కెట్ అని పిలుస్తున్నారు. ఇలా పిలవడం ఇబ్బందికరంగా ఉంది. అందుకే వైష్ణవి హోల్‌సేల్ వెజిటెబుల్ మార్కెట్‌గా పేరు పెట్టాలని అందరం కలిసి తీర్మానించాం. ఈ విషయాన్ని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి.. రిజిస్టర్ చేయాలనుకుంటున్నాం.

– కొణతాల వీర్రాజు, యూనియన్ అధ్యక్షుడు

### మంచి వాతావరణంలో వ్యాపారం



నా 14వ ఏటనే ఈ వ్యాపారంలోకి వచ్చాను. నాన్న పేరుతో షాపు కొనసాగుతోంది. మార్కెట్‌లో మొత్తం 66 దుకాణాలు ఉన్నాయి. దాదాపు 1000 మంది వరకు కలాసీలు ఉన్నారు. ఇక్కడ మంచి వాతావరణం ఉంటుంది. కలాసీలను వ్యాపారులంతా కుటుంబ సభ్యుల్లా చూసుకుంటారు. మార్కెట్‌లో ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటాం. మార్కెట్‌కు చెందిన సౌభాగ్య గణపతి ఆలయంలో చైర్మన్ కోరిబిల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతీవారం అన్నదానం నిర్వహిస్తున్నాం.

– విల్లూరి పరమేశ్వరరావు, యూనియన్ కార్యదర్శి

### ఎన్నో జ్ఞాపకాలున్నాయి..



నాది వాడచీపురుపల్లి. పూర్ణా మార్కెట్ ప్రాంతంలో ఉంటున్నాను. మొదట్లో పూర్ణామార్కెట్‌లో కలాసీగా పనిచేసేవాడిని. జ్ఞానాపురంనకు మార్కెట్ తరలిరావడంతో అప్పటి నుంచి ఇక్కడే పనిచేస్తున్నాను. నాకు ఇద్దరు ఆడపిల్లలు. కలాసీగా పనిచేస్తూనే పెద్ద అమ్మాయిని ఎంఎస్సీ, చిన్న అమ్మాయిని బి.టెక్ చదివించి.. పెళ్లిళ్లు చేశాను. అర్ధరాత్రి 2 గంటలకు నిద్ర లేస్తాను. చద్దన్నం పట్టుకుని మూడు గంటలకు మార్కెట్‌కు వచ్చేస్తాను. ఇక్కడ పని చూసుకుని మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వెళ్తాను. అప్పట్లో రూ.300 నుంచి రూ.400 వరకు ఆదాయం వచ్చేది. ఇప్పుడు రూ.800 నుంచి రూ.1000 వరకు వస్తోంది. ఈ మార్కెట్‌తో ఎన్నో జ్ఞాపకాలు పెనవేసుకున్నాయి.

– రెడ్డి ముత్యాలనాయుడు, కలాసీ

### 20 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా



ఈ మార్కెట్‌తో ఎంతో అనుబంధం ఉంది. 20 ఏళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నా. వేకువ జామున 3.30 గంటలకే మార్కెట్‌కు చేరుకుంటాం. లావాదేవీలన్నీ పూర్తయ్యే సరికి మధ్యాహ్నం 12 గంటలు దాటిపోతుంది. కరోనా సమయంలోనూ మార్కెట్‌ను తెరిచాం. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నగర ప్రజలకు తాజా కూరగాయలు అందించాం.

– రొంగళి ప్రకాష్‌రావు, వ్యాపారి

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 